అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 27-5-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 146 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar www.navatelangana.com 14 పేజీలు వెల : 6.50

కొత్త పార్లమెంట్ ఎదుటే నిరసన

మహిళా మహా పంచాయతీకి తుది దశ సన్నాహాలు

- మీడియాతో రెజ్లర్లు

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

ఈనెల 28న ప్రారంభంకానున్న కొత్త పార్లమెంట్ ఎదుట దేశ మహిళా క్రీడాకారులు నిరసనకు సన్నద్ధమవుతున్నారు. మహిళా మహాపంచాయతీకి సన్నాహాలు తుది దశకు చేరుకున్నాయి. శుక్రవారం జంతర్ మంతర్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెజ్లర్లు మాట్లాడుతూ కొత్త పార్లమెంట్...5లో



వెంపర్లాట



గ్లోబల్ బ్రాండ్ బిల్డింగ్ కోసం మోడీ విదేశీ పర్యటనలు

సామాజిక మాధ్యమాల్లో బీజేపీ అసత్య ప్రచారాలు

ప్రధాని మోడీ అనేక పర్యటనలు, ప్రచారాలు చేసినా కర్నాటకలో అధికార బీజేపీ ఘోర పరాజయాన్ని చవి చూసింది. ఈ దెబ్బతో దక్షిణాదిలో బీజేపీ అడ్రస్ గల్లంతయ్యింది. దక్షిణాది రాష్ట్రాల్లో అధికారంలోకి వద్దామన్న ఆలోచనలు సైతం ఇప్పుడు ఆ పార్టీలో సన్నగిల్లాయి. అయితే, కర్నాటక ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని సాక్షాత్తూ మోడీయే వచ్చి ప్రచారం చేసినప్పటికీ ఓటమి చెందటం బీజేపీకి జీర్ణం కావటం లేదా? బీజేపీ చెప్తూ వస్తున్న 'మోడీ చరిష్మా, ప్రజాదరణ, జనాకర్షణ' వంటివి ఉట్టి మాటలేనని ఈ ఎన్నికలు తేటతెల్లం చేశాయా? దీని నుంచి బయట పడేందుకే మోడీ విదేశీ పర్యటనలతో గ్లోబల్ బ్రాండ్ బిల్డింగ్ కోసం వెంపర్లాడు తున్నారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఎన్నికల్లో ఓటములను కప్పిపుచ్చుకునే యత్నం

న్యూఢిల్లీ : కర్నాటక ఎన్నికల్లో చేదు ఫలితాలు, ప్రతిపక్షాల ప్రచారాలు రాబోయే 2024 సాధారణ ఎన్నికల్లో బీజేపీపై మరింత ప్రతికూల ప్రభావం చూపనున్నాయని కాషాయపార్టీ గ్రహించింది. దాని నుంచి ప్రజల దృష్టిని దారి మళ్లించేందుకు ప్రణాళికలు చేస్తున్నది. ఇందులో భాగమే ప్రధాని మోడీ ఇటీవల చేస్తున్న విదేశీ పర్యటనలు, వాటికి కల్పిస్తున్న విపరీత ప్రచారాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కర్నాటకతో పాటు ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన పలు ఎన్నికలలో ఓటమి విషయంలో మోడీ వైఫల్యాన్ని కప్పి పుచ్చే ప్రయత్నాలను బీజేపీ ముమ్మరం చేస్తున్నది. మోడీకి అంతర్జాతీయ ప్రజాదరణ ఉన్నదంటూ గ్లోబల్ బ్రాండ్ బిల్డింగ్ కోసం ప్రయత్నిస్తున్నది. ఈ పనిలో బీజేపీ, దాని అనుబంధ సంఘాలు, ఇతర సోషల్ మీడియా టీమ్‌లు తమ సామాజిక మాధ్యమాల ఖాతాలతో బిజీగా ఉన్నాయి. ఈ గ్లోబల్ బ్రాండ్ బిల్డింగ్ కోసం మోడీ సైతం నానా ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ మోడీ ఆటోగ్రాఫ్‌ను అడగటం, పాపువా న్యూ గినియా ప్రధాన మంత్రి జేమ్స్ మరాపే మోడీ పాదాలను తాకి స్వాగతించడం, ఆస్ట్రేలియన్ ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్ మోడీని ప్రసిద్ధ రాక్‌స్టార్ బ్రూస్ స్ప్రింగ్‌స్టీన్‌తో పోల్చి 'ది బాస్' అని సంబోధించటం వంటివన్నీ ఈ ప్రహసనంలో భాగమే. వీటికి సంబంధించిన వీడియోలు, ఫోటోలను బీజేపీ ఐటీ పరివారం వైరల్ చేస్తూ మోడీ చరిష్మా తగ్గలేదని చూపించే ప్రయత్నం చేస్తున్నాయి. రాన్ను రోజుల్లోనూ ఇందుకోసం మోడీ మరిన్ని విదేశాల్లో పర్యటించనున్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ జూన్ 22న వాషింగ్టన్ డీసీలో ఉంటారు. జులై14న ఫ్రాన్స్ ప్రెసిడెంట్ ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌ను కలవడానికి, బాస్టిల్ డే పరేడ్‌లో పాల్గొనడానికి ఆయన ఆ దేశ రాజధాని పారిస్‌లో ఉంటారు. జూలై నెలాఖరులో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) నాయకులు, రష్యా, చైనా, ఇరాన్ అధ్యక్షులు, పలువురు మధ్య ఆసియా నేతలను మోడీ కలుస్తారు. ఆగస్టులో జరిగే బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోడీ.. వ్లాదిమిర్ పుతిన్, జి జిన్‌పింగ్, బ్రెజిల్‌కు ప్రెసిడెంట్ లులా డా సిల్వా, దక్షిణాఫ్రికా అధ్యక్షులు సిరిల్ రమఫోసాలను కలుస్తారు. అలాగే, సెప్టెంబర్ 9-10 తేదీలలో ఢిల్లీలో జీ20 సమ్మిట్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనున్నది.

ఈ విదేశీ పర్యటనల్లో, జీ20 సమావేశాల్లో ఆయా దేశాల ప్రధానులు, అధ్యక్షులతో సమావేశాలు, కరచాలనం, ముచ్చట్లు, వారి పొగడ్తలు వంటి ప్రతి సాధారణ విషయాన్నీ బీజేపీ అసాధరణ ప్రచారానికి అస్త్రాలుగా మలుచుకుంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపై దేశాధ్యక్షులు, ప్రధానుల పొగడ్తలు, కరచాలనాలు సర్వసాధారణమైన విషయమనీ, వీటిని భూతద్దంలో చూపిస్తూ మోడీని అంతర్జాతీయ నాయకుడు అంటూ బీజేపీ ఐటీ సెల్ ప్రచారం చేసుకుంటున్నదని అభిప్రాయపడ్డారు.

2019 తర్వాత పలు రాష్ట్రాల్లో ఓటములు

స్వదేశంలోనే జనాదరణకు నోచుకోలేకపోతున్న మోడీ, దానిని అడ్డుకోవడానికే గ్లోబల్ బ్రాండ్ కోసం వెంపర్లాడుతున్నారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. 2019లో రెండోసారి కేంద్రంలోకి అధికారంలోకి వచ్చిన మోడీ.. ఆ తర్వాత జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. 2019 నుంచి బీజేపీ పంజాబ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఢిల్లీ వంటి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను గెలవలేకపోయిందని తెలిపారు. హర్యానా, మహారాష్ట్రలలో అధికారానికి కావాల్సిన మ్యాజిక్ ఫిగర్‌కు సైతం బీజేపీ చేరుకోలేకపోయిందని వివరించారు. అందువల్ల విదేశాల్లో మోడీ ప్రజాదరణ అంటూ బీజేపీ చేస్తున్న ప్రచారమంతా 'మేడిపండు' వంటిదేననీ, 2019 నుంచి దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఓటమే దీనిని రుజువు చేస్తున్నదని గుర్తు చేస్తున్నారు.

రాష్ట్రపతిని విస్మరించడం రాజ్యాంగ వ్యతిరేక చర్య

అదానీపై జేపీసీ వేయాల్సిందే

- రాజదండం వాడటం ఫాసిస్టు చర్య : సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి



నవతెలంగాణ-అమరావతి బ్యూరో

నూతన పార్లమెంటు భవన ప్రారంభోత్సవం విషయంలో రాష్ట్రపతిని విస్మరించడం రాజ్యాంగ వ్యతిరేక చర్య అని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ఉభయసభలకు అధిపతి రాష్ట్రపతి తప్ప ప్రధాన మంత్రి కాదన్నారు. రాష్ట్రపతిని విస్మరించి నూతన పార్లమెంటు భవనాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించడం రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా దేశంలోని 19 రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తూ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరించాయని తెలిపారు. శుక్రవారం విజయవాడలోని ఎంబివికెలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 79లో పార్లమెంటు, రాజ్యసభలను నడిపించేది రాష్ట్రపతే అని స్పష్టంగా రాసుకున్నామని తెలిపారు. రాజ్యాంగ అధిపతి, పార్లమెంటు సమావేశాల ప్రొసీడింగ్స్‌ను, ఉభయసభలను నడిపించేది రాష్ట్రపతే అని అన్నారు. ప్రధాన మంత్రి పార్లమెంటుకు కూడా నాయకుడు కాదు అనేది తెలుసుకోవాలన్నారు. కేవలం అధికార పార్టీకి నాయకుడు మాత్రమేనని అన్నారు. ప్రతిపక్షానికి కూడా క్యాబినెట్ మంత్రి హోదాతో ఒక నాయకుడు వుంటారన్నారు. పార్లమెంటులో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులు చట్టరూపం దాల్చాలంటే రాష్ట్రపతి ఆమోదం వుండాల్సిందేనన్నారు. అన్ని అధికారాలూ రాష్ట్రపతి చేతిలోనే వున్నాయన్నారు. ప్రభుత్వం పార్లమెంట్‌కు జవాబుదారి అయితే ఎంపీలు ప్రజలకు జవాబుదారిగా వుంటారని అన్నారు. గతంలో ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రారంభోత్సవాలు చేశారని చెప్పే బీజేపీ నాయకులు కూడా ఇపుడు పార్లమెంట్‌లో క్యాంటిన్‌లాంటివి ప్రారంభోత్సవం చేసుకోవచ్చన్నారు. రాజ్యాంగ అధిపతిని అగౌరపరిచే చర్యలను...8లో

నోట్ల రద్దు తుగ్లక్ చర్య వివరాలు 8లో



అందరికీ ఒకే విద్య

ఆర్థిక అసమానతలు పెంచొద్దు : డీవైఎఫ్ఐ సదస్సులో ఎమ్మెల్సీ ఏ నర్సిరెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్రప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన విద్యా విధానం(ఎన్ఈపీ)-2020ని చెత్తబుట్టలో వేయాలని ఉపాధ్యాయ...5లో



ప్రభుత్వాలు మాట తప్పినందునే భూపోరాటం

పట్టాభూమి జోలికి పేదలు వెళ్లడం లేదు..

- ప్రభుత్వ భూమినే పంచాలంటున్నారు : సీపీఐ(ఎం) నేతలు జి.నాగయ్య, ఎస్.వీరయ్య
- చెన్నూర్ భూపోరాటానికి మద్దతు

నవతెలంగాణ-జైపూర్

ఎన్నికలకు ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంతోనే పేదలు భూపోరాట మార్గాన్ని ఎంచుకున్నారని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారుల్లో ఇండ్ల స్థలాల కోసం పోరాడుతున్న పేదలకు ఎర్రజెండా...8లో



పార్లమెంట్ కొత్త భవన ప్రారంభోత్సవం ఇలా..

- తొలుత సర్వమత ప్రార్థనలు, తర్వాత జాతీయ గీతాలాపన
- రూ. 75 నాణెం,స్మారక తపాలా బిళ్ల విడుదల 5లో..



9 ఏండ్ల పాలనపై 9 ప్రశ్నలు

- మోడీకి కాంగ్రెస్ సవాల్
- డాక్యుమెంట్ విడుదల

8లో..



పార్ట్‌టైం లెక్చరర్లకు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించాలి

- సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలో పార్ట్‌టైం లెక్చరర్లకు అసిస్టెంట్ ప్రొఫెసర్లు(సి)గా పదోన్నతులు కల్పించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని ...8లో



64 శాతం మంది వద్ద.. రూ.2,000 నోటు లేదు



- పెద్ద నోటును నిరాకరిస్తున్న వ్యాపారస్తులు : లోకల్ సర్కిల్స్ సర్వే 8లో..

లక్ష కోట్ల ఆస్తి రూ.7 వేల కోట్లకే..

ఢిల్లీ లిక్కర్ స్కాం కంటే టోల్ స్కామే పెద్దది



- కన్సెషన్ అగ్రిమెంట్ నిజమా? కాదా? తేల్చాలి
- బీజేపీ, బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలు
- బీఆర్ఎస్ విజయం కోసం బీజేపీ తపిస్తుంది : రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కంటే ఓఆర్ఆర్ టోల్ స్కామ్ వెయ్యి రెట్లు పెద్దదని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్ రెడ్డి విమర్శించారు. 'రూ. లక్ష కోట్ల విలువైన ఔటర్ రింగ్ రోడ్డును కేవలం రూ.7వేల కోట్లకు తెగనమ్మారు. కేటీఆర్ ధన దాహానికి ఓఆర్ఆర్ బలైంది. ఆ టెండర్ల వ్యవహారంలో కల్వకుంట్ల కుటుంబం దారి దోపిడీకి పాల్పడింది. అందులో కేసీఆర్, కేటీఆర్ లబ్దిదారులైతే... సూత్రాధారులు, పాత్రధారులు సోమేష్ కుమార్, అరవింద్ కుమార్' అని వ్యాఖ్యానించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నాయకులు అనిల్‌యాదవ్, సంపత్‌కుమార్, నదీమ్ అహ్మద్, వేణుగోపాల్, జగదీశ్వర్‌తో కలిసి రేవంత్ విలేకర్లతో మాట్లాడారు. ఓఆర్ఆర్ టోల్ స్కామ్‌పై కేంద్రం ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. ఈ కుంభకోణంపై ఎందుకు విచారణ జరిపించట్లేదని నిలదీశారు. టెండర్ దక్కించుకున్న సంస్థ టెండర్ మొత్తం విలువలో 10శాతాన్ని 30 రోజుల్లోగా, మిగతా 90 శాతాన్ని 120 రోజుల్లోగా చెల్లించాల్సి ఉంటుందని ...8లో

కాంగ్రెస్, బీజేపీ విష ప్రచారాలను తిప్పికొట్టాలి

తెలంగాణ పథకాలను కాపీ కొడుతున్న కేంద్రం

- కాంగ్రెస్‌లో పదవుల నిరుద్యోగం
- 40, 50 సీట్లలో కాంగ్రెస్‌కు అభ్యర్థులు కరువు
- అభివృద్ధి, సంక్షేమం దేశానికి దిక్సూచి :ఆస్పత్రి భవన నిర్మాణానికి హరీశ్‌రావు శంకుస్థాపన

వివరాలు 5లో..





అవినాష్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు : హైకోర్టులో సీబీఐ వాదన

నవతెలంగాణ-హైదరాబాద్

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం హైకోర్టులో చోటు చేసుకుంది. వివేకా హత్య సమాచారం ఏపీ సీఎం జగన్‌కు ఉదయం 6.15 గంటలకే ఎలా తెలిసిందో తెలియడం లేదని సీబీఐ చెప్పింది. వివేకా పీఏ కృష్ణారెడ్డి కంటే ముందుగా జగన్‌కు తెలియడం వెనుక ఎంపీ అవినాష్‌రెడ్డి పాత్ర ఏమైనా ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేయాల్సివుందని, అయితే అవినాష్ మాత్రం దర్యాప్తునకు సహకరించడం లేదని చెప్పింది. కర్నూల్‌లో అవినాష్‌ను అరెస్టు చేసేందుకు వెళితే అక్కడ జన సమీకరణ ఉండడంతో శాంతిభద్రతల సమస్య ఎదురౌతుందని అరెస్టు చేయలేదని చెప్పింది.

గిరిజనులపై మతోన్మాద దాడులను అరికట్టాలి : ఆవాజ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మణిపూర్‌లో ఆదివాసీ కుకీ, నాగ గిరిజన తెగలపై విచ్చల విడిగా దాడులు జరుగుతుంటే..కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నదని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ ఆవేదన చేశారు. వాటిని వెంటనే ఆపాలంటూ ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాడులకు పాల్పడుతున్న మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో గత రెండు మాసాలుగా కుకీ,నాగ ఆదివాసీ గిరిజన తెగలపై మతోన్మాద శక్తుల దాడులు కొనసాగుతున్నాయని తెలిపారు. కేంద్రంలో, మణిపూర్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు ఆ దాడులను అరికట్టడంలో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. అక్కడి ఆదివాసీ గిరిజనులపై బీజేపీ అండతో జరుగుతున్న జాతిఉన్మాద, మతోన్మాద దాడులను ప్రజలంతా తీవ్రంగా ఖండించాలని కోరారు.

విధానాల రూపకల్పనలో డేటా అనాలిటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ కీలకపాత్ర :గవర్నర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విధానాల రూపకల్పన, దేశాభివృద్ధిలో డేటా అనాలిటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌దే కీలకపాత్ర అనిగవర్నర్ తమిళిసై అన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ సీఆర్ రావు అడ్వాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటర్ సైన్సెస్‌లో శిక్షణ తీసుకుంటున్న ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీసెస్(ఐఎస్ఎస్) 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన ప్రొబెషనర్లను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. విధానపరమైన నిర్ణయాల్లో డేటా అనాలిటిక్స్ ప్రాధాన్యత ఉందన్నారు. యువ ప్రొబెషనరీ అధికారులతో గవర్నర్ చిట్‌చాట్ చేశారు. అల్యూమినీ డేటాను ఉపయోగించుకోవాలని సూచించారు. అల్యూమినీ డేటాను విద్యార్థులకు ఎంతోగానో ఉపయోగ పడుతుందన్నారు. హెల్త్, న్యూట్రిషన్, గిరిజనల ఆర్థిక సామాజిక స్థితిగతుల గురించి తెలుసుకోవడానికి సమగ్రమైన డేటాబేస్‌ను రూపొందించాలని సూచించారు.

కేసీఆర్ అసలైన ధర్మ రక్షకులు

- బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యులు జోషి గోపాలశర్మ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బ్రాహ్మణ స్థితిగతులు అందరికీ తెలవాలని, అసలైన ధర్మ రక్షకులు కేసీఆరేనని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యులు జోషిగోపాలశర్మ అన్నారు. శుక్రవారం ఆయన సచివాలయం లోని మీడియా సెంటర్‌లో నిర్వహించిన విలేరుల సమావేశంలో మాట్లాడారు. 2016లో బ్రాహ్మణ పరిషత్‌ను ఏర్పాటు చేస్తూ బ్రాహ్మణ కుటుంబాలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని అన్నారు. బ్రాహ్మణ విద్యార్థులకు విదేశీ విద్యకు రూ.20 లక్షలు ఇచ్చారని, కొన్ని కుటుంబాలకు పారిశ్రామిక వేత్తలు కావడానికి కూడా నిధులు ఇచ్చారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు పుష్కరాలు అంటే విజయవాడ, రాజమండ్రి వెళ్ళేవాళ్ళం కానీ రాష్ట్రం వచ్చాక బాసర, భద్రాచలం, గద్వాల్, బీచుపల్లి ప్రాంతాలకు వెళ్లామని చెప్పారు. యాదాద్రి ఆలయాన్ని పునరుద్ధరించి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించారని తెలిపారు. కొండగట్టు, వేములవాడ ఆలయాల పునరుద్ధరణ పనులు చేయాలని సూచించినట్టు చెప్పారు. బ్రాహ్మణులకు హైదరాబాద్‌లో భవనం ఉండాలని భావించి గోపన్‌పల్లిలో 6.18ఎకరాల స్థలం కేటాయించారని, ఈ భవనం ఈనెల 31న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం కానుందని తెలిపారు.

సీఎంఓ కార్యదర్శి స్మితా సభర్వాల్‌ను కలిసిన ట్రెసా బృందం

- పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రెవెన్యూ శాఖలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ల పదోన్నతులు కల్పించాలని ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్‌లతో కూడిన ప్రతినిధి బృందం శుక్రవారం సచివాలయంలో సీఎంఓ కార్యదర్శి స్మితాసభర్వాల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్ పదోన్నతులు కల్పించాలని కోరారు. 2016 తర్వాత ఏడేండ్ల నుంచి డిప్యూటీ కలెక్టర్ ప్రమోషన్లు రాలేదని, దానివల్ల కింద స్థాయి జూనియర్ అసిస్టెంట్ నుంచి డిప్యూటీ తహసీల్దార్ వరకు వివిధ కేడర్లలో పదోన్నతులు రాక స్తబ్దత నెలకొన్నదని తెలిపారు. అన్ని శాఖల మాదిరిగా రెవెన్యూలో కూడా పదోన్నతులు కల్పించాలని కోరగా, స్మితాసభర్వాల్ సానుకూలంగా స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. అనంతరం వివిధ జిల్లాల నుండి వచ్చిన డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు ట్రెసా ఆధ్వర్యంలో రెవెన్యూ ముఖ్యకార్యదర్శి, సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్‌ను సీసీఎల్ఏ కార్యాలయంలో కలిసి ప్రమోషన్ల గురించి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెసా అసోసియేట్ అధ్యక్షులు మన్నె ప్రభాకర్, రాష్ట్ర నాయకులు పి.రమేష్, ఖమ్మం, జగిత్యాల్ జిల్లా అధ్యక్షులు సునీల్, ఎండీ.వకీల్, కార్యవర్గ సభ్యులు సుమ, నిర్మలదేవి, శ్రీలత, మధు, వెంకటేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి : ఏవీఎన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలనీ, ట్రెజరీల్లో ఆమోదం పొంది పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ మంజూరు చేయా లని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారికి ఆయన లేఖ రాశారు. ఎయిడెడ్ టీచర్లకు వేతనాలను రెగ్యులర్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎలాంటి పరిమితులు లేకుండా ఆరోగ్య కార్డులను వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. మోడల్ స్కూల్ టీచర్లను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ 2003 టీచర్లకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని కోరారు. 317 జీవో బాధిత టీచర్లకు న్యాయం చేయాలని విన్నవించారు. పండిట్‌లకు, పీఈటీల కు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీల్లో పారిశుధ్య సిబ్బంది కొరత వల్ల తర గతి గదుల శుభ్రత, మధ్యాహ్న భోజనానంతరం క్లీనింగ్, తదితర పనులను రెగ్యులర్‌గా చేయడం లేదని పేర్కొన్నారు.

సిటీ యూనియన్ బ్యాంక్‌కు రూ.218 కోట్ల లాభాలు

CITY UNION BANK CUB

హైదరాబాద్ : ప్రయివేటు రంగంలోని సిటీ యూనియన్ బ్యాంక్ (సీయూబీ) గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23)లో మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 4.4 శాతం వృద్ధితో రూ.218 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.209 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.506.7 కోట్లుగా ఉన్న నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) క్రితం క్యూ4లో 2.7 శాతం పెరిగి రూ.514.3 కోట్లుగా నమోదయ్యింది. 2023 మార్చి ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 4.37 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం డిసెంబర్ ముగింపు నాటికి స్థూల ఎన్‌పీఏలు 4.62 శాతంగా నమోదయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు 2.67 శాతం నుంచి 2.36 శాతానికి తగ్గాయి. 2022-23లో మొత్తంగా 23 శాతం వృద్ధితో రూ.937 కోట్ల లాభాలు సాధించింది. వడ్డీ ఆదాయం 15 శాతం పెరిగి రూ.4,714 కోట్లుగా చోటు చేసుకుంది. మొత్తం డిపాజిట్లు 10 శాతం వృద్ధితో రూ.52,398 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలం నాటికి రూ.47,690 కోట్ల డిపాజిట్లు నమోదయ్యాయి. అడ్వాన్సులు 7 శాతం పెరిగి రూ.41,156 కోట్ల నుంచి రూ.43,971 కోట్లకు చేరాయి.

సివిల్ సర్వీసుల స్వభావాన్ని మార్చే యత్నం

- బీజేపీ సర్కారుపై మాజీ బ్యూరోకాట్ల ఆరోపణ
- భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు

80 మందికి పైగా మాజీ సివిల్ సర్వెంట్ల బహిరంగ లేఖ

న్యూఢిల్లీ : దేశంలో సివిల్ సర్వీసుల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును మాజీ బ్యూరోక్రాట్లు తప్పుబట్టారు. సివిల్ సర్వీసుల స్వభావాన్ని మార్చేందుకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదని ఆరోపించారు. కేంద్రానికి రాజభక్తిని ప్రదర్శించేలా తమపై ఒత్తిడి తెస్తున్నదని ఆరోపించారు. ప్రత్యేకించి ఐఏఎస్, ఐపీఎస్ సర్వీసుల విషయంలో ఇది కనిపిస్తున్నదని వివరించారు. ఈ మేరకు 80 మందికి పైగా మాజీ సివిల్ సర్వెంట్లు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బహిరంగ లేఖను రాశారు. కేంద్రం చెప్పినట్టు చేయకుంటే సదరు ఉన్నతాధికారులపై ఏకపక్షంగా శాఖాపరమైన చర్యలు చోటు చేసుకున్నాయని వివరించారు. సంబంధిత అధికారులు, వారి రాష్ట్ర ప్రభుత్వాల సమ్మతి లేకుండా కేంద్ర డిప్యూటేషన్‌లను నిర్బంధించటానికి కేంద్రం సర్వీసు నిబంధనలను సవరించాలనుకుంటున్నదని ఆరోపించారు. రాజ్యాంగ అధిపతిగా మీరు మా బాధలను కేంద్రానికి తెలిజేయాలని కోరుతున్నామని లేఖలో వారు పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ స్వభావాన్ని మార్చే ఈ ప్రయత్నం తీవ్ర ప్రమాదంతో కూడుకున్నదని వారిని(కేంద్రాన్ని) హెచ్చరించాలని కోరారు. అయితే, రాజకీయంగా ప్రతిపక్ష నాయకులను కట్టడి చేయడానికి ఈడీ, సీబీఐ వంటి సంస్థలను తన రాజకీయ లబ్ది కోసం వాడుకుంటున్నదన్న వస్తున్న ఆరోపణలకు మాజీ సివిల్ సర్వెంట్ల లేఖ ఇందుకు రుజువు అని రాజకీయ విశ్లేషకులు తెలిపారు.

IDFC FIRST Bank

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది)
CIN : L65110TN2014PLC097792
రిజిస్టర్డు ఆఫీసు: కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హ్యారింగ్టన్ రోడ్, చెట్పేట్, చెన్నై-600031.
TEL: +91 44 4564 4000 | FAX: +91 44 4564 4022.

అనుబంధం 4 (రూల్ 8(1))
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

దిగువ పేర్కొన్న సంతకందారైన **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది)** యొక్క అధీకృత అధికారి ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో పాటు చదవదగిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తాలను చెల్లించాలని కోరుతూ రుణగ్రహీత, సహరుణగ్రహీతలు మరియు హామీదారులకు **17-12-2022** తేదీన డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది. డిమాండ్ నోటీసులో పొందుపర్చిన వివరాల ప్రకారం1) **ఐక్య శ్రీనివాస్, 2) ఐక్య పూర్ణిమ** వారు తేది:**16-12-2022** నాటికి బకాయి ఉన్న **రూ.34,36,281.91/- (రూపాయలు ముప్పై నాలుగు లక్షల ముప్పై ఆరు వేల రెండు వందల ఎనభై ఒకటి మరియు తొంభై ఒకటి పైసలు మాత్రమే)** చెల్లించాల్సి ఉన్నది.

రుణగ్రహీతలు బకాయిలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ప్రత్యేకించి రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న సంతకందారు దిగువ పేర్కొన్న ఆస్తిని పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ 4 మరియు దీనితో పాటు చదవదగిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్,2002 రూల్ 8 ప్రకారం సంక్రమించిన అధికారాల ప్రకారం **24,మే,2023** తేదీన లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ఇందుమూలంగా రుణగ్రహీతలకు ప్రత్యేకించి మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమేమనగా దిగువ పేర్కొన్న ఆస్తితో ఎలాంటి లావాదేవీలు నిర్వహించవద్దు. సదరు ఆస్తి **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది)** ద్వారా ఛార్జ్ చేయబడింది. డిమాండ్ నోటీసులో పేర్కొన్న విధంగా బకాయి ఉన్న **రూ.34,36,281.91/- (రూపాయలు ముప్పై నాలుగు లక్షల ముప్పై ఆరు వేల రెండు వందల ఎనభై ఒకటి మరియు తొంభై ఒకటి పైసలు మాత్రమే)** వడ్డీతో పాటుగా తిరిగి చెల్లించాలని కోరడమైనది.

ఇందుమూలంగా రుణగ్రహీతకు తెలియజేయునది ఏమనగా పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ 8 ప్రకారం తనఖాపెట్టిన సెక్యూర్డ్ ఆస్తులను తనిఖీ చేసుకునేందుకు మరియు విడిపించుకునేందుకు లభ్యమయ్యే కాలపరిమితి తదితర వివరాలను పొందవచ్చును.

స్థిరాస్తుల యొక్క వివరణ:

ఆస్తికి సంబంధించి పాక్షికంగా నిర్మాణం పూర్తయిన మూడు పడకల రూమ్ యొక్క ఫ్లాట్ నెం.404, నాలుగో అంతస్తు, జెపి టవర్స్, సూపర్ బిల్టప్ ఏరియా 1530చ.అ. (కామన్ ఏరియాస్‌తో పాటుగా) మరియు కారు పార్కింగ్ ఏరియాతో పాటుగా కలుపుకొని విస్తీర్ణం 100చ.అ. రెండింటిని కలుపుకొని అవిభాజ్యమైన స్థలం యొక్క విస్తీర్ణంలో వాటా 45.22చ.గ. లేదా 37.80చ.మీ. (మొత్తం విస్తీర్ణం 1048చ.గ., ప్లాట్ నెంబర్లు 8,9& 15, సర్వే నెంబర్లు 13&14, హస్తినాపూరి, అమ్ముగూడ గ్రామం, బ్లాక్ నెం.2, &గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, కాప్రా మున్సిపాలిటీ మరియు మల్కాజ్‌గిరి మండలం, రంగారెడ్డి జిల్లా మరియు హద్దులు: **తూర్పు: 5' కారిడార్ మరియు ఫ్లాట్ నెం.401, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, లిఫ్ట్ మరియు ఫ్లాట్ నెం.405.**

సం/-
అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది)

తేది: 24,మే,2023
ప్రదేశం: రంగారెడ్డి
లోన్ అకౌంట్ నెం.28536739

IL&FS | Engineering Services

IL&FS Engineering and Construction Company Limited
CIN: L45201TG1988PLC008624
Regd. Office: D.No.8-2-120/113, B-Block,1st Floor, Sanali Info Park, Road No. 2, Banjara Hills, Hyderabad - 500033
Ph: 040-40409333; Fax: 040-40409444; Email: cs@ilfsengg.com; Web: www.ilfsengg.com

31 మార్చి,2023తో ముగిసిన త్రైమాసికం మరియు వార్షికానికి సంబంధించి స్టాండ్‌అలోన్ & ఏఎంపి కన్సాలిడేటెడ్ ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాలు

(షేర్ డేటా మినహా మిగతావి రూ.లక్షల్లో)

వివరాలు	స్టాండ్‌అలోన్					కన్సాలిడేటెడ్	
	ముగిసిన త్రైమాసికం			ముగిసిన సంవత్సరానికి		ముగిసిన సంవత్సరానికి	
	31.03.2023 (ఆడిట్‌చేసినవి)	31.12.2022 (ఆడిట్‌చేయనివి)	31.03.2022 (ఆడిట్‌చేసినవి)	31.03.2023 (ఆడిట్‌చేసినవి)	31.03.2022 (ఆడిట్‌చేసినవి)	31.03.2023 (ఆడిట్‌చేసినవి)	31.03.2022 (ఆడిట్‌చేసినవి)
ఆపరేషన్‌ల నుండి పూర్తి ఆదాయం	10763	2236	12909	21565	37868	21565	37868
కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంలకు ముందు)	(7960)	(1915)	(10765)	(11,888)	(20,692)	(11889)	(20602)
పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల &/లేదా అసాధారణ ఐటెంల తరువాత)	(7936)	(2451)	(35064)	(12400)	(38635)	(12401)	(38635)
పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	(7936)	(2451)	(35064)	(12400)	(38635)	(12398)	(38613)
కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/ (నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	(7991)	(2451)	(35081)	(12439)	(38652)	(12437)	(38630)
ఈక్విటీ వాటా మూలధనం	13,112	13,112	13,112	13,112	13,112	13,112	13,112
వాటా ఒక్కింటికి రాబడులు రూ.10/-చొప్పున (కొనసాగుతున్న (ఎ) బేసిక్ (రూ.) (బి) డైల్యూటెడ్ (రూ.)	(6.05)	(1.87)	(26.74)	(9.46)	(29.47)	(9.46)	(29.45)

గమనిక:
2 పైన పేర్కొన్న ఆర్థిక ఫలితాలు రివ్యూ చేయబడినవి మరియు ఆడిట్ కమిటీ ద్వారా రికమండ్ చేయబడినవి మరియు బోర్డు ఆఫ్ డైరెక్టర్లు 25, మే, 2023 తేదీన నిర్వహించిన వారి యొక్క సమావేశంలో ఆమోదించబడినవి.
1 సెబీ (లిస్టింగ్ ఓబ్లిగేషన్స్ అండ్ ఎఎంపి, డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజ్‌తో దాఖలు చేయబడిన 31 మార్చి, 2023తో ముగిసిన కాలవ్యవధి కొరకు త్రైమాసిక మరియు వార్షిక ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్‌కు సారాంశం పై విధంగా ఉన్నవి. దీని యొక్క పూర్తి వివరాలు ఎన్ఎస్ఇ మరియు బిఎస్ఇ వెబ్‌సైట్లు: www.nseindia.com మరియు www.bseindia.com మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.ilfsengg.com పై అందుబాటులో ఉన్నవి.

బోర్డు ఉత్తర్వుల మేరకు
For **IL&FS Engineering and Construction Company Limited**
సం/-
కాజిం రజా ఖాన్
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

తేది: 25-05-2023
ప్రదేశం: న్యూఢిల్లీ

SOUTH INDIAN Bank
ఎల్‌బి నగర్, కొత్తపేట్ బ్రాంచ్, 1-2-84/1, ప్రశాంతి ఆర్కేడ్, కొత్తపేట్, ఎల్‌బి నగర్ మున్సిపాలిటీ, హైదరాబాద్, పిన్-500 035.
Phone 040 24140433. Email Id - br0546@sib.co.in

బంగారం వేలం

ఇందుమూలంగా ద సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న రుణగ్రహీత పొందిన గోల్డ్ లోన్‌కు సంబంధించి పొందిన బకాయిలను తిరిగి చెల్లించాలని కోరుతూ విక్రయానికి సంబంధించిన సేల్ నోటీసు(లు) పంపడం జరిగింది. రుణగ్రహీత బ్యాంక్ నుంచి పొందిన రుణాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు, ఇందుమూలంగా రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న సంతకందారు బంగారు ఆభరణాల యొక్క ఆన్‌లైన్ వేలాన్ని **"ఎక్కడ ఎలా ఉందో అలాగే" & "ఎక్కడైతే ఎలా ఉందో అలాగే" & "రికోర్స్ విధానం లేకుండా"** నిర్వహించనున్నారు. ఆన్‌లైన్ విధానంలో రుణగ్రహీత పేరు: లాజురామ్ పి, గోల్డ్ లోన్ నెంబర్ **0546653000060656** కు సంబంధించి https://egold.auctiontiger.net ద్వారా **30-05-2023** తేదీన మధ్యాహ్నం గం.**12-00** నుండి గం.**3-00** వరకు వేలం నిర్వహించబడును.

అదనపు సమాచారం కోసం దయచేసి ఆక్షన్ టైగర్ వారిని 6359575981/ 9023724780 సెల్ నెంబర్‌లలో సంప్రదించాలి.

సం/- మేనేజర్
ద సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

ఫామ్-ఎ
బహిరంగ ప్రకటన
(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ బోర్డు ఆఫ్ ఇండియా (వాలంటరీ లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్, 2017లోని రెగ్యులేషన్ 14 ప్రకారం)

బిఎఫ్‌టి ఆటోమేషన్ సిస్టమ్స్ ప్రయివేట్ లిమిటెడ్ యొక్క స్టేక్ హోల్డర్లు శ్రద్ధ వహించడం కోసం

1.	కార్పొరేట్ పర్సన్ పేరు	బిఎఫ్‌టి ఆటోమేషన్ సిస్టమ్స్ ప్రయివేట్ లిమిటెడ్
2.	కార్పొరేట్ వ్యక్తి ఇన్‌కార్పొరేషన్ జరిగిన తేది	08.01.2015
3.	కార్పొరేట్ వ్యక్తి వ్యవస్థాపన జరిగిన/ రిజిస్టర్ అయిన అధికారి	ఆర్‌ఓసి - హైదరాబాద్
4.	కార్పొరేట్ ఐడెంటీ నెం./ కార్పొరేట్ వ్యక్తి యొక్క లిమిటెడ్ లయబిలిటీ ఐడెంటీ నెం.	U51900TG2015FTC097199
5.	కార్పొరేట్ వ్యక్తి యొక్క ప్రధాన మరియు రిజిస్టర్ (ఒకవేళ ఉన్నట్లయితే) కార్యాలయం చిరునామా	ప్లాట్ నెం.6, షెడ్ నెం.1, ఐడిఎ బొల్లారం, మియాపూర్ దగ్గర, జిన్నారం మండలం, హైదరాబాద్, తెలంగాణ-502325, ఇండియా.
6.	కార్పొరేట్ వ్యక్తి యొక్క లిక్విడేషన్ ప్రారంభ తేది	24.05.2023
7.	లిక్విడేటర్ యొక్క పేరు, చిరునామా, ఇ-మెయిల్ అడ్రస్, టెలిఫోన్ నెంబర్ మరియు రిజిస్ట్రేషన్ నెంబర్	పవన్ కుమార్ సింగల్, కేరాఫ్: ఎవిఎం రిజల్యూషన్ ప్రొఫెషనల్స్ ఎల్ఎల్‌పి, చిరునామా: 8/28, (మూడో అంతస్తు), డబ్ల్యు.ఇ.ఎ., అబ్దుల్ అజీజ్ రోడ్డు, కరోల్ బాగ్, న్యూఢిల్లీ-110005. Email: vlp.bftautomation@gmail.com Ph No.: 011 41486026/27, Mob. 9560508482 Regn. No.: IBBI/IPA-001/IP-P01172/2018-2019/12229
8.	క్లెయిమ్‌ల సమర్పణ కోసం చివరి తేది	23.06.2023

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా **బిఎఫ్‌టి ఆటోమేషన్ సిస్టమ్స్ ప్రయివేట్ లిమిటెడ్** యొక్క వాలంటరీ లిక్విడేషన్ **24-05-2023** నుంచి ప్రారంభమైనది.
బిఎఫ్‌టి ఆటోమేషన్ సిస్టమ్స్ ప్రయివేట్ లిమిటెడ్ యొక్క స్టేక్‌హోల్డర్లకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా క్లెయిమ్స్ కోసం ఆధారాలను **23-06-2023** తేదీన లేదా అంతకంటేముందుగా క్రమ సంఖ్య 7లో చూపబడిన లిక్విడేటర్ యొక్క చిరునామాలో సమర్పించాలి. ఫైనాన్షియల్ క్రెడిటార్లంతా వారి యొక్క క్లెయిమ్‌ల యొక్క ఆధారాలను ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా మాత్రమే సమర్పించాలి. మిగతా స్టేక్ హోల్డర్లంతా క్లెయిమ్‌ల యొక్క ఆధారాలను వ్యక్తిగతంగా, పోస్ట్ ద్వారా లేదా ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా పంపించవచ్చును.
తప్పుడు పత్రాలతో క్లెయిమ్స్‌ను పొందాలని భావించేవారికి మరియు తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పించిన వారికి జరిమానా విధించబడును.

సం/- పవన్ కుమార్ సింగల్
బిఎఫ్‌టి ఆటోమేషన్ సిస్టమ్స్ ప్రయివేట్ లిమిటెడ్ యొక్క వాలంటరీ లిక్విడేటర్
Registration No.:IBBI/IPA-001/IP-P01172/2018-2019/12229

తేది:26-05-2023
ప్రదేశం: న్యూఢిల్లీ

Agro Tech Foods Limited
CIN: L15142TG1986PLC006957
రిజిస్టర్డ్ ఆఫీస్ : 31, సరోజిని దేవి రోడ్, సికింద్రాబాద్-500003, తెలంగాణ
ఫోన్:91-40-66650240 ఫ్యాక్స్:91-40-2780 0947 వెబ్‌సైట్:www.atfoods.com

విషయం : ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్‌కు (IEPF) ఈక్విటీ వాటాల బదిలీకి సంబంధించిన నోటీసు

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా సమయానుసారం సవరించినట్లుగా ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ (అకౌంటింగ్, ఆడిట్, ట్రాన్స్‌ఫర్ మరియు రిఫండ్) రూల్స్, 2016 ('రూల్స్')తో చదవగల కంపెనీల చట్టం, 2013 ('ది చట్టం') యొక్క సెక్షన్ 124(6) యొక్క నియమాలను అనుసరించి వరుసగా ఏడు సంవత్సరాలు క్లెయిమ్‌చేయకుండా మిగిలియున్న **2015-16 ఆర్థిక సంవత్సరం కొరకు ప్రకటించబడిన తుది డివిడెండ్ 1సెప్టెంబర్, 2023న** లేదా అంతకన్నా ముందు ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ ('IEPF')కు జమచేయ బడును. సంబంధిత వాటాలపై వరుసగా ఏడు సంవత్సరాలు వరకు చెల్లించబడని లేదా క్లెయిమ్ చేయబడని డివిడెండ్ IEPF యొక్క డిమ్యాట్ ఖాతాకు కంపెనీచే బదలాయించబడుతుంది.

కెఫిన్ టెక్నాలజి లిమిటెడ్ ('కెఫిన్‌టెక్'), యూనిట్: అగ్రో టెక్ ఫుడ్స్ లిమిటెడ్, సెలినియం టవర్ బి, ప్లాట్ నెం.లు. 31-32, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రాంగూడ, శేరిలింగంపల్లి మండలం, హైదరాబాద్- 500032, తెలంగాణ, ఇ-మెయిల్:einward.ris@kfintech.com **టెలిఫోన్:91-40-6716 1754** వారికి వారి సంతకంతో ఒక లేఖను పంపించడం ద్వారా **16 ఆగస్టు, 2023న** లేదా అంతకన్నా ముందు క్లెయిమ్ చేయబడని డివిడెండ్‌ను నగదుగా మార్చుకొనుటకు వారిని అభ్యర్థిస్తూ పైన తెలిపిన సదరు రూల్స్ IEPF నకు బదలాయించ వీలు గల వాటాలు కలిగిన సంబంధిత వాటాదారులందరికి కంపెనీ సమాచారాన్ని పంపించాలి. పైన తెలిపిన రూల్స్ ప్రకారం IEPF అథారిటీకి బదలాయించబడనున్న వాటాలు గల సంబంధిత వాటాదారుల యొక్క పూర్తి వివరాలు వెబ్ లింక్ https://www.atfoods.com/unclaimed-dividend-unclaimed-shares.aspx వద్ద కంపెనీ యొక్క వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడినది.

దయచేసి దిగువ అంశాలు గమనించండి :

ఎ) ఒకవేళ మీరు భౌతిక రూపంలో వాటాలను కలిగియుంటే : డూప్లికేట్ షేర్ సర్టిఫికేట్లు జారీచేయబడును మరియు IEPFకు బదిలీచేయబడును. మీ పేరున రిజిస్టర్ అయి నిర్వహించబడిన ఒరిజినల్ షేర్ సర్టిఫికేట్లు, ఆటోమెటిక్‌గా రద్దుచేయబడును.

బి) ఒకవేళ మీరు ఎలక్ట్రానిక్ రూపంలో వాటాలను కలిగియుంటే : IEPFకు బదిలీ చేయబడిన వాటాల కొరకు మీ డిమ్యాట్ ఖాతాకు డెబిట్ చేయబడును.

16 ఆగస్టు, 2023న లేదా ఆలోగా వారి క్లెయిమ్ చేయబడని / చెల్లించబడని డివిడెండ్ మొత్తాలను క్లెయిమ్ చేసుకొనవలసిందిగా సంబంధిత వాటాదారులను అభ్యర్థించ డమైనది. **16 ఆగస్టు, 2023న** లేదా అంతకన్నా ముందు చెలుబాటు అయ్యే క్లెయిమ్ స్వీకరించబడని యెడల ఎటువంటి తదుపరి నోటీసు లేకుండా IEPF అథారిటీకి ఈక్విటీ వాటాల బదలాయింపునకు కంపెనీ చర్యలు తీసుకుంటుంది. ఒకసారి కంపెనీ ద్వారా IEPFకు వాటాలు బదిలీ అయితే నిర్దేశిత ఫారం IEPF-5 ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయుట ద్వారా మరియు కంపెనీ యొక్క నోడల్ అధికారికి IEPF-5లో తెలిపిన అవసరమైన డాక్యుమెంట్లతో పాటు కంపెనీ యొక్క నమోదు కాబడిన నమూనా సంతకాల ప్రకారం సంతకం చేయబడిన దాని యొక్క భౌతిక ప్రతిని పంపించుట ద్వారా IEPF అథారిటీ నుండి మాత్రమే వాటాలు మరియు డివిడెండ్‌ను క్లెయిమ్ చేసుకొనవచ్చును. సదరు రూల్స్ ప్రకారం IEPFనకు బదలాయించబడిన వాటాలు/ క్లెయిమ్ చేయబడని డివిడెండ్‌కు సంబంధించి కంపెనీపై ఎటువంటి బాధ్యత ఉండదని దయచేసి గమనించవలెను.

పై విషయంలో ఏవేని విచారణల కొరకు వాటాదారులు కంపెనీ యొక్క రిజిస్ట్రార్ మరియు వాటా బదిలీ ఏజెంట్‌లు శ్రీ సింగిరెడ్డి శంకర్ రెడ్డి, కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్, యూనిట్ : అగ్రో టెక్ ఫుడ్స్ లిమిటెడ్, సెలినియం టవర్ బి, ప్లాట్ నెం. 31-32, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రాంగూడ, శేరిలింగంపల్లి మండలం, హైదరాబాద్-500032, తెలంగాణ, ఇ-మెయిల్ : einward.ris@kfintech.com, ఫోన్ : **91-40-6716 1754** పై సంప్రదించ వచ్చును.

అగ్రోటెక్ ఫుడ్స్ లిమిటెడ్
సం/-
జ్యోతి చావ్లా
కంపెనీ సెక్రటరీ & సమన్వయ అధికారి

స్థలం :సికింద్రాబాద్
తేది : 26 మే, 2023

లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన

ICICI Bank | **బ్రాంచి ఆఫీసు:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్స్, బొమ్మనహళ్లి హోసూర్ మెయిన్ రోడ్, బెంగుళూరు-560068.

ఏదైతే,
క్రింది సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, డిమాండ్ నోటీసులు జారీచేసి, దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలను, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.
ఆ విధంగా మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు దిగువ పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకున్నారు.**
ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్‌కు చెల్లించుటకులోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీత పేరు/ రుణ ఖాతా నంబరు	ఆస్తి వివరణ/ లాంఛనప్రాయ స్వాధీనం తేది	డిమాండ్ నోటీసు తేదీ/ డిమాండ్ నోటీసులోని మొత్తాలు (రూ)	బ్రాంచి పేరు
1.	మట్టేటి రాజేశ్ / చిప్ప రాధిక/ LBHYD00005200433	**ఆస్తి"ఎ" యొక్క షెడ్యూలు:** రిజిస్ట్రేషన్ జిల్లా ఆదిలాబాద్, ఉప-జిల్లా మంచిర్యాల, మంచిర్యాల జిల్లా, మంచిర్యాల రెవెన్యూ మండలం& మున్సిపాలిటీ పరిధిల్లో కోడ్ నం.98, జన్మభూమి నగర్, మంచిర్యాల శివార్ వద్దగల 1456.80చ.గ.లు = 1218.02చ.మీ.ల విస్తీర్ణంతో సర్వే నం.414& 416నకుగాను కొత్త ఇ.నం.4-101 నుండి 4-103 వరకు వరుసగా పాత ఇంటి నం. 4-21, 4-22, 4-23, 4-24, 4-25& 4-26 (పాత ఇంటి నంబర్లు) యొక్క భాగాన్ని తొలగించుట ద్వారా ఖాళీ ల్యాండ్ మొత్తం మరియు సరిహద్దులు: తూర్పు: 40అ.ల రోడ్డు, పడమర: హౌసింగ్ లాడ్జి, ఉత్తరం: సురేందర్ రావు, ఉపేందర్ రావు మరియు ఇతరుల ఇల్లు, దక్షిణం: రాఘవ రావు హాస్పిటల్, **ఆస్తి యొక్క షెడ్యూలు (బి):** రాఘవేంద్ర రావు హాస్పిటల్, మంచిర్యాల వెనుక, మెసర్స్ మాతృశ్రీ బిల్డర్స్& డెవలపర్స్ ద్వారా నిర్మించబడుచున్న రిజిస్ట్రేషన్ జిల్లా ఆదిలాబాద్, సబ్-డిస్ట్రిక్ట్ మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లా, రెవెన్యూ మండలం మంచిర్యాల, మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని కోడ్ నం.98, జన్మభూమి నగర్, మంచిర్యాల శివార్ వద్దగల 44చ.గ.లు = 36.78చ.మీ.ల విస్తీర్ణంతో విడదీయలేని భాగం మరియు 1600చ.అ. ఆర్‌సిసి ప్లింత్ ఏరియా (ఉమ్మడి ఏరియాతోకలిపి), జన్మభూమి నగర్, "మాతృశ్రీ అపార్టుమెంట్స్" మొదటి అంతస్తులో సంపూర్ణ నివాసిత ఫ్లాట్ నం.204, సర్వే నం.414& 416,నకుగాను కొత్త ఇ.నం.4-101 నుండి 4-103 వరకు వరుసగా పాత ఇంటి నం. 4-21, 4-22, 4-23, 4-24, 4-25& 4-26 (పాత ఇంటి నంబర్లు) యొక్క భాగాన్ని తొలగించుట ద్వారా ఖాళీ ల్యాండ్ మొత్తం, మొదటి అంతస్తులో అసంపూర్తి నివాసిత ఫ్లాట్ నం.204 కొరకు సరిహద్దులు: తూర్పు: ఒపెన్ టు స్కై, పడమర: ఫ్లాట్ నం.203, ఉత్తరం: ఉమ్మడి కారిడార్ & ఒపెన్ టు స్కై, దక్షిణం: ఒపెన్ టు స్కై/ లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 23.05.2023.	03.11.2022 Rs. 33,81,219.00/-	హైదరాబాద్
2.	శివ ప్రసాద్ బాబు నల్లగొండ/ నల్లగొండ కృష్ణవేణి/ LBHYD00001091254	**షెడ్యూలు:** సర్వే నం.లు 81,84,85,86,88,89& 91 తో కవరుచేయబడిన 252.01చ.అ.లు లేదా 23.32చ.మీ.ల ప్లింత్ ఏరియా మరియు పూర్తి ఏరియా 122.22చ.గ.లు లేదా 102.19చ.మీ.లు, మండిపాలెం, ఒంగోలు వద్ద ఎంఐజి ఇంటి నం.344 (ఎం.సి.డి.నం.35-3-69/370/344). సరిహద్దులు: ఉత్తరం: MIG I 328, ఆర్‌సిసి భవనము నిర్మాణము, దక్షిణం: 40' వెడల్పు రోడ్డు, ఈ సరిహద్దుల్లో తూర్పు: MIG I 345. ప్లింత్ ఏరియా 251.01 చ.అ.లు, పడమర: MIG I 343/ లాంఛనప్రాయ స్వాధీనం తేది: 23.05.2023.	27.03.2021 Rs. 4,13,410.00/-	హైదరాబాద్

పై పేర్కొనబడిన రుణగ్రహీతలు/ హామీదారులను బకాయి పడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా ఇందుమూలంగా కోరబడుచున్నది, లేని పిమ్మట తాకట్టుపెట్టబడిన ఆస్తులను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8&9 క్రింది నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 30 రోజులు ముగిసిన వెంటనే విక్రయించబడుతాయి.

తేది: మే 26, 2023
ప్రదేశం: హైదరాబాద్

అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

IDFC FIRST Bank

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది)
CIN : L65110TN2014PLC097792
రిజిస్టర్డు ఆఫీసు: కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హ్యారింగ్టన్ రోడ్, చెట్పేట్, చెన్నై-600031.
TEL: +91 44 4564 4000 | FAX: +91 44 4564 4022.

అనుబంధం 4 (రూల్ 8(1))
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

దిగువ పేర్కొన్న సంతకందారైన **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది)** యొక్క అధీకృత అధికారి ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో పాటు చదవదగిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తాలను చెల్లించాలని కోరుతూ రుణగ్రహీత, సహరుణగ్రహీతలు మరియు హామీదారులకు **08-02-2023** తేదీన డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది. డిమాండ్ నోటీసులో పొందుపర్చిన వివరాల ప్రకారం1) **శ్రీనివాస రావు గుర్జిత్ 2) గుర్జేటి నీరజ రావు** వారు తేది:**08-02-2023** నాటికి బకాయి ఉన్న **రూ.52,55,960.36/- (రూపాయలు యాభై రెండు లక్షల యాభై ఐదు వేల తొమ్మిది వందల అరవై మరియు ముప్పై ఆరు పైసలు మాత్రమే)** చెల్లించాల్సి ఉన్నది.

రుణగ్రహీతలు బకాయిలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ప్రత్యేకించి రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న సంతకందారు దిగువ పేర్కొన్న ఆస్తిని పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ 4 మరియు దీనితో పాటు చదవదగిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్,2002 రూల్ 8 ప్రకారం సంక్రమించిన అధికారాల ప్రకారం **24,మే,2023** తేదీన లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ఇందుమూలంగా రుణగ్రహీతలకు ప్రత్యేకించి మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమేమనగా దిగువ పేర్కొన్న ఆస్తితో ఎలాంటి లావాదేవీలు నిర్వహించవద్దు. సదరు ఆస్తి **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది)** ద్వారా ఛార్జ్ చేయబడింది. డిమాండ్ నోటీసులో పేర్కొన్న విధంగా బకాయి ఉన్న **రూ.52,55,960.36/- (రూపాయలు యాభై రెండు లక్షల యాభై ఐదు వేల తొమ్మిది వందల అరవై మరియు ముప్పై ఆరు పైసలు మాత్రమే)** వడ్డీతో పాటుగా తిరిగి చెల్లించాలని కోరడమైనది.

ఇందుమూలంగా రుణగ్రహీతకు తెలియజేయునది ఏమనగా పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ 8 ప్రకారం తనఖాపెట్టిన ఆస్తులను తనిఖీ చేసుకునేందుకు మరియు విడిపించుకునేందుకు లభ్యమయ్యే కాలపరిమితి తదితర వివరాలను పొందవచ్చును.

స్థిరాస్తుల యొక్క వివరణ:

ఆస్తికి సంబంధించి ప్లాట్ నెం.47, సర్వే నెం.558, 563 మరియు 564, విస్తీర్ణం 181చ.గ. లేదా 151.31చ.మీ. కాప్రా గ్రామం, కాప్రా మున్సిపాలిటీ, కీసర మండలం, రంగారెడ్డి జిల్లా మరియు దీని యొక్క హద్దులు: **తూర్పు: ప్లాట్ నెం.46, పడమర: ప్లాట్ నెం.48, ఉత్తరం:ప్లాట్ నెం.54, దక్షిణం : 30" వెడల్పు రోడ్డు.**

సం/-
అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది)

తేది: 24,మే,2023
ప్రదేశం: కాప్రా
లోన్ అకౌంట్ నెం.15486116, 14519906, 26730759 & 15485574

SIGACHI INDUSTRIES LIMITED
CIN:L24110TG1989PLC009497
Regd. Office: 229/1 & 90, Kalyan's Tulsiram Chambers, Madinaguda, Hyderabad, Telangana, 500049
Telephone:+91 40 40114874, E-mail: cs@sigachi.com Website: www.sigachi.com

31 మార్చి, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు సంవత్సరానికి సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాల సారాంశం ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్‌ను అనుసరించి సిద్ధం చేయబడినది

(రూ.లక్షల్లో)

క్ర. సం.	వివరాలు	స్టాండ్‌అలోన్					కన్సాలిడేటెడ్				
		ముగిసిన త్రైమాసికం			ముగిసిన సం॥నికి		ముగిసిన త్రైమాసికం			ముగిసిన సం॥నికి	
		31.03.2023	31.12.2022	31.03.2022	31.03.2023	31.03.2022	31.03.2023	31.12.2022	31.03.2022	31.03.2023	31.03.2022
		ఆడిట్‌చేసినవి	ఆడిట్‌చేయనివి	ఆడిట్‌చేసినవి	ఆడిట్‌చేసినవి	ఆడిట్‌చేసినవి	ఆడిట్‌చేసినవి	ఆడిట్‌చేయనివి	ఆడిట్‌చేసినవి	ఆడిట్‌చేసినవి	ఆడిట్‌చేసినవి
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	7,762.89	6,661.34	7,259.88	29,699.54	25,203.44	7,396.89	7,013.53	7,427.62	30,871.68	25,291.94
2	కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంలకు ముందు)	1,216.62	1,174.53	1,366.35	5,157.77	4,896.56	1,033.29	1,232.03	1,509.85	5,447.88	5,159.87
3	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/ (నష్టం) (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత)	1,216.62	1,174.53	1,366.35	5,157.77	4,896.56	1,033.29	1,232.03	1,509.85	5,447.88	5,159.87
4	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/ (నష్టం) (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత)	942.93	932.42	1,042.69	4,156.02	3,802.88	731.57	982.49	1,163.64	4,353.62	4,003.73
5	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	927.30	934.41	1,047.09	4,146.35	3,810.11	801.43	981.27	1,107.03	4,365.52	3,939.51
6	ఈక్విటీ వాటా మూలధనం	3,074.25	3,074.25	3,074.25	3,074.25	3,074.25	3,074.25	3,074.25	3,074.25	3,074.25	3,074.25
7	గత సంవత్సరం యొక్క ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్స్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివాల్యూవేషన్ రిజర్వులు మినహాయించి)	-	-	-	23,482.66	19,643.73	-	-	-	23,761.81	19,703.71
8	వాటా ఒక్కింటికి రాబడి (రూ.10/- చొప్పున)										
	బేసిక్ (రూ.)	3.07	3.03	4.02	13.52	14.66	2.38	3.20	4.49	14.16	15.44
	డైల్యూటెడ్ (రూ.)	3.07	3.03	4.02	13.52	14.66	2.38	3.20	4.49	14.16	15.44

గమనికలు: 1. 31 మార్చి, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు సంవత్సరానికి స్టాండ్‌అలోన్ మరియుకన్సాలిడేటెడ్ ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్ సారాంశం పై పేర్కొనట్లు ఉంది. ఇవి ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 25.05.2023న నిర్వహించిన వారి సంబంధిత సమావేశాల్లో బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే రికార్డుపై తీసుకోబడినవి. పై పేర్కొన్న ఫలితాలపై పరిమిత సమీక్షను కంపెనీ యొక్క చట్టబద్ధమైన ఆడిటర్లు నిర్వహించారు.
2. సెబీ (లిస్టింగ్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజిలతో దాఖలుచేయబడిన 31 మార్చి, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు సంవత్సరానికి స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆడిట్‌చేసిన ఆర్థికఫలితాల వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాలకు సంబంధించి పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజీల వెబ్‌సైట్లు: (www.bse.com, www.nse.com) మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్: (www.sigachi.com) పై అందుబాటులో కలవు.

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల తరఫున
For **SIGACHI INDUSTRIES LIMITED**
సం/-
అమిత్ రాజ్ సిన్హా
మేనేజింగ్ డైరెక్టర్ & సిఇఓ

ANJANI PORTLAND CEMENT LIMITED
CIN:L26942TG1983PLC157712 Website Address :www.anjanicement.com
Regd. Office: #6-3-553, Unit No. E3 & E4, 4th Floor,Quena Square Off: Taj Deccan Road, Erramanzil, Hyderabad, Telangana 500082
Tel no: +91-40-23353096

Extract of Audited Consolidated Financial Results for the Quarter and Financial Year ended 31st March, 2023 (Rs. in Lakhs except for EPS)

Sl.No.	Particulars	Consolidated				
		Quarter Ended			Year Ended	
		31-03-2023 Audited	31-12-2022 Un-Audited	31-03-2022 Audited	31-03-2023 Audited	31-03-2022 Audited
1	Total income from operations	13,295	15,103	25,168	66,150	80,126
2	Net Profit for the period (before tax, exceptional/extraordinary items)	(1,831)	(1,551)	468	(6,414)	5,877
3	Net Profit for the period before tax, (after exceptional/ extraordinary items)	(1,831)	(1,551)	468	(6,414)	5,877
4	Net Profit for the period after tax (after exceptional/ extraordinary Items)	(1,690)	(1,416)	173	(5,850)	4,199
5	Total Comprehensive Income for the period (Comprising Profit for the period after tax and Other comprehensive income after tax)	(1,681)	(1,404)	210	(5,791)	4,214
6	Paid up Equity Share Capital	2,937	2,529	2,529	2,937	2,529
7	Reserves Excluding Revaluation Reserve	30,435	24,529	29,303	30,435	29,303
8	Earnings per Share (EPS) (Basic & Diluted)	(5.98)	(5.55)	0.81	(22.35)	16.38

Notes:
The above is an extract of the detailed format of Audited Financial Results filed with the BSE Ltd and NSE Ltd under Regulation 33 of the SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations 2015. The full format of the Audited Financial Results is available on the Stock Exchange website (www.bseindia.com), (www.nseindia.com) and on the Company's website (www.anjanicement.com).
The specified items of the standalone financial results of the Company for the quarter and financial year ended March 31, 2023 are given below:-

Additional Information on Audited Standalone Financial Results is as follows: (Rs. in Lakhs except for EPS)

Sl.No.	Particulars	Standalone				
		Quarter Ended			Year Ended	
		31-03-2023 Audited	31-12-2022 Un-Audited	31-03-2022 Audited	31-03-2023 Audited	31-03-2022 Audited
1	Revenue from Operations	9,589	10,879	13,669	42,218	47,201
2	Profit before Tax (after Exceptional/ Extraordinary Items)	(205)	(417)	336	(2,011)	4,914
3	Profit after tax	(180)	(389)	77	(1,892)	3,497
4	Total Comprehensive Income	(164)	(382)	92	(1,860)	3,503

For and on behalf of the Board of Directors of
Anjani Portland Cement Limited

N.Venkat Raju
Managing Director
(DIN 08672963)

Place : Hyderabad
Date : 26th May, 2023

సంపాదకీయం

రంధ్రాన్వేషణ!

వంద శాతం సంపూర్ణ అక్షరాస్యత. డిజిటల్ విద్యాబోధన. అట్టడుగువర్గాలకు అందుబాటులో వైద్యం. ప్రజలకు ఆర్థిక పరిపుష్టి. కార్మికుల సంక్షేమ నిధి. వ్యవసాయ రంగానికి పెద్దపీట. పెట్రోల్, డీజిల్ ధరలపై సుంకాల తగ్గింపు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సంక్షేమ

ఎందుకింత అనుమానం, అవమానం? ఈప్రశ్నకు సమాధానం జగమంతా తెలిసిందే. కేంద్రం నియంతృత్వ విధానాలను ఎప్పటికప్పుడూ వ్యతిరేకిస్తూ ప్రజలను జాగృతం చేస్తున్నారు విజయన్. రాష్ట్రాల హక్కులు హరిస్తున్న ప్పుడు గొంతెత్తుతున్నా, విపక్షాలను ఐక్యం చేసేదిశగా అడుగులు వేస్తున్నా కేంద్రం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలను తాము అమలు చేయబోమని తేల్చిచెపుతున్నా అందుకు అనేక ఉదాహరణలు మన కండ్లముందే ఉన్నాయి. నాడు వామపక్షాల ఒత్తిడితో పేదలకు పని కల్పించి గౌరవంగా జీవించడానికి తీసుకొచ్చిన మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం పీకనులిమే చర్యలు తీసుకుంది మోడీ సర్కార్.

పథకాలు, మరెన్నో విభిన్నమైన పద్ధతులు అక్కడే సాధ్యం. ప్రగతిశీలమైన సామరస్య పాలనలో దేశంలోనే తమదైన ప్రత్యేకత వారి సొంతం. భారతదేశ చిత్రపటంలో ఎక్కడో అరేబియా సముద్రంవైపు విసిరేసినట్టుగా, శ్రీలంకకు దగ్గరగా కనిపించే కేరళది అన్నింట్లో అగ్రస్థానమే. రాష్ట్రం చిన్నదే అయినా పెద్దపెద్ద లక్ష్యాలతో దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తోంది. ఇది లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ఆధ్వర్యంలో రెండోసారి వరుసగా అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ ఆదర్శ పాలనకు గీటురాయి. ప్రజాసంక్షేమంలో విజయవంతంగా దూసుకెళ్తున్న రాష్ట్రం ఏదని ఎవరినడిగినా కేరళ అని చెప్పే స్థాయికి ఎదగడం వామపక్షాలు అనుసరిస్తున్న విధానాల గొప్పతనం. అలాంటి కేరళలో అమలవుతున్న పథకాలపై కేంద్రం రంధ్రాన్వేషణ చేస్తోంది.

కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బీజేపీ ప్రజల నెత్తిపై ఎప్పుడు ఎలాంటి పిడుగు వేస్తుందో, ఏం రద్దు చేస్తుందో, ఏ నిర్ణయాలు తీసుకుంటుందో తెలియదు. కేంద్ర భారాలు, హెచ్చుతగ్గులు ఎలా ఉన్నా తమ రాష్ట్రానికి నష్టమా, లాభమా అని బేరీజు వేసుకున్న తర్వాతే అక్కడ అమలుకు సిద్ధపడుతుంది కేరళ ప్రభుత్వం.ఇది కదా దేశానికి కావాల్సిన ముందుచూపు. ఇదికదా ప్రజలపట్ల చిత్తశుద్ధిని కనపరచడం. ఇది కదా తమపై నమ్మకం ఉంచి ఓట్లేసిన వారి బతుకులను చక్కదిద్దడం. కానీ ఇవేమీ బీజేపీ-ఆరెస్సెస్ నాయకులకు నచ్చవు. ఏ చిన్నతప్పు దొరుకుతుందా! దాన్ని పట్టుకుని ఎలా లాగుదామా అని గోతికాడి నక్కలా ఎదురుచూస్తుంటుంది. కానీ నిరంతరం పేదల కోసం తపించే కేరళ లాంటి రాష్ట్రాల్లో వీరి ఆటలు సాగవుకదా! అందుకే విద్వేషాలు రెచ్చగొట్టేందుకు తీసిన 'ది కేరళ స్టోరీ' అట్టర్‌ప్లాప్ అయింది. అయినా అక్కడి ప్రభుత్వాన్ని బదనాం చేయాలని ప్రతి విషయాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తోంది. 2022-23లో రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులలో 99 శాతం మందికి మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించామంటూ పినరయి ప్రభుత్వం ప్రకటించింది. కేరళ ప్రభుత్వం వెల్లడించిన వాస్తవాల్ని అక్కడి బీజేపీ-ఆరెస్సెస్ నాయకులు జీర్ణించుకోలేదు. తద్వారా అందులో



నిజానిజాలు తెలుసుకునేందుకు కేంద్రం ఓ కమిటీని నియమించింది. ఈ కమిటీలో కేంద్ర విద్యాశాఖ, కేరళ ప్రభుత్వ అధికారులు సభ్యులుగా చేర్చింది. కేరళ ప్రభుత్వం చేసిన 'అసంభవమైన' ప్రకటనను పరిశీలించాలని కేంద్రం నిర్ణయించిందని విద్యాశాఖ సీనియర్ అధికారి చెప్పడం మోడీ ప్రభుత్వ ధోరణికి అద్దం పడుతోంది. పీఎం పోషణ్ యోజనకు సంబంధించి ఢిల్లీలో పీఏబీ జరిపిన సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రావడంతో క్షేత్రస్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రతినిధులు కొన్ని జిల్లాల్లో పర్యటించాలని పీఏబీ నిర్ణయించింది.

ఎందుకింత అనుమానం, అవమానం? ఈప్రశ్నకు సమాధానం జగమంతా తెలిసిందే. కేంద్రం నియంతృత్వ విధానాలను ఎప్పటికప్పుడూ వ్యతిరేకిస్తూ ప్రజలను జాగృతం చేస్తున్నారు విజయన్. రాష్ట్రాల హక్కులు హరిస్తున్న ప్పుడు గొంతెత్తుతున్నా, విపక్షాలను ఐక్యం చేసేదిశగా అడుగులు వేస్తున్నా కేంద్రం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలను తాము అమలు చేయబోమని తేల్చిచెపుతున్నా అందుకు అనేక ఉదాహరణలు మన కండ్లముందే ఉన్నాయి. నాడు వామపక్షాల ఒత్తిడితో పేదలకు పని కల్పించి గౌరవంగా జీవించడానికి తీసుకొచ్చిన మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం పీకనులిమే చర్యలు తీసుకుంది మోడీ సర్కార్. దాన్ని తిప్పికొట్టేలా ఉపాధి కార్మికులకు సంక్షేమ నిధి బోర్డును ఏర్పాటు చేసి ఊపిరి పోసింది కేరళ ప్రభుత్వం. శాస్త్రీయతను రూపుమాపి పసిహృదయాల్లో మతబీజాలు నాటాలని కేంద్రం ఎన్‌సీఈఆర్‌టీ నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగిస్తే రాష్ట్రంలో మాత్రం తొలగించ బోమని చెప్పింది. సహకార రంగానికి అనేక ప్రోత్సాహకాలిస్తూ పాడిపరిశ్రమలోనూ బలోపేతమైన క్షీరవిప్లవాన్ని తీసుకొచ్చింది. దేశమంతా నిరుద్యోగం తాండవిస్తుంటే కేరళలో మాత్రం గణనీయంగా తగ్గింది. పన్నెండు శాతం ఉన్న నిరుద్యోగరేటు ఐదుకు పడిపోయింది. మోడీ మాత్రం అధికారంలోకి రాకముందు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పి స్తామని చెప్పి ఇప్పుడు దాని ఊసే మరిచారు. ఇందుకు భిన్నంగా అనునిత్యం ప్రజల కోసం తపిస్తూ అనేక పథకాలు తీసుకొచ్చి అభివృద్ధిలో దేశంలోనే ముందంజలో ఉంది కేరళ ప్రభుత్వం. అలాంటిచోట బీజేపీ చేస్తున్న ఈ రంధ్రాన్వేషణ స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం కాకపోతే దేనికోసం?

కార్మికవర్గ ఐక్యతతోనే మతతత్వ విధానాల్ని తిప్పికొట్టగలం!



భూపాల్
9490098034

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన ప్రతిసారి మతతత్వ, కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాల వల్ల కార్మికవర్గ ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నది. ఆర్‌ఎస్ఎస్ భావజాలం మనువాదాన్ని అమలు చేయడం కోసం కేంద్రంలో అధికారాన్ని దుర్వినియోగ పరుస్తున్నది. మోడీ 2019లో రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రమాదం మరింత పెరిగింది. హిందూ, ముస్లిం, క్రిస్టియన్‌ల పేరిట మత విద్వేషాలను రెచ్చగొట్టడం, రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాయడం, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలను అవలంభించడం, దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం చూస్తూనే ఉన్నాం. ప్రజల సమస్యలు, కార్మికవర్గ సమస్యలు పరిష్కరించకుండా వచ్చిన అసంతృప్తి, ప్రతిఘటనలను పక్కదారి పట్టించడం కోసం మతోన్మాదాన్ని ప్రోత్సహించడం పరిపాటిగా మారింది. ప్రభుత్వ విధానాల వల్లనే కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదనేది నగ్నసత్యం. వాటి వెనకాల పాలకవర్గాల రాజకీయ విధానాలు కీలకం. ఈ విషయం కార్మికులు అర్థం చేసుకోవడం ఇప్పుడున్న పరిస్థితుల్లో అనివార్యం. దీంతోనే కార్మికవర్గ ఐక్యత సాధించి బీజేపీ-ఆర్‌ఎస్ఎస్ మతతత్వ విధానాల్ని తిప్పికొట్టొచ్చు. కార్మికుల్లో చైతన్యాన్ని పెంచేందుకుగాను సీఐటీయూ బృహత్తరమైన కార్యక్రమాన్ని తన భుజాలమీద వేసుకున్నది. మే 1నుంచి దేశవ్యాప్తంగా క్యాంపెయిన్ చేపట్టింది. ఇది మే 30 సిఐటియు ఆవిర్భావ దినోత్సవం వరకు కొనసాగుతుంది.

ప్రజల త్యాగాలతో 200 సంవత్సరాలు పరిపాలించిన బ్రిటిషోడిని తరిమికొట్టి దేశానికి స్వాతంత్రం సాధించుకున్నాం. భారతదేశ పరిపాలనకు దిక్సూచిగా నిలిచే రాజ్యాంగాన్ని నిర్మించుకున్నాం. లౌకిక పునాదుల మీద ప్రజాస్వామ్యం, సార్వభౌమత్వం, స్వావలంబన విధానాలతో ముందుకు సాగుతున్నాం. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి అనుసరిస్తున్న విధానాల వల్ల దేశం అభద్రతలో కూరుకుపోయింది. మత, విద్వేషాలతో కాలం గడుపుతూ ప్రజా సమస్యలు చర్చకు రాకుండా చూస్తున్నది. అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి బీజేపీ యథేచ్ఛగా తూట్లు పొడుస్తున్నది. భారత రాజ్యాంగం స్థానంలో మనుధర్మ శాస్త్రం చేర్చాలని వాళ్ల అభిలాష. బ్రాహ్మణ భావజాల అధిక్యతతో కూడిన కుల వ్యవస్థ యథావిధిగా కొనసాగాలని దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, బలహీన వర్గాలు అణగదొక్కబడి ఉండాలనేది వారి అభిమతం. మనుధర్మ శాస్త్రం ప్రకారం స్త్రీలకు స్వేచ్ఛ హక్కులు ఉండకూడదు కాబట్టి వీరు మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా పెండింగ్‌లో పెట్టారు. ఉత్తరప్రదేశ్ అత్రాస్ ఘటనను చూశాం. మహిళలపై వేధింపులు హత్యలు, దాడులు ఈ కాలంలో పెద్దఎత్తున పెరిగాయి. బీజేపీ ఎంపి కిరణ్ మోరే లైంగికదాడులు మన సంస్కృతిలో భాగం అనేదాక వీళ్ళ వికృత చేష్టలు పెరిగిపోయాయి. విద్యను కాషాయీకరించి ఆర్‌ఎస్ఎస్ భావ జాలాన్ని చిన్న పిల్లల మెదళ్లలో ఎక్కించి శాస్త్రీయత స్థానంలో అశాస్త్రీయతను ప్రవేశపెట్టడం, అజ్ఞానాన్ని పెంపొందించడం, చరిత్రను వక్రీకరించడం, రాబోయే తరాల్లో దేశభక్తి లేకుండా చేయటం, వాస్తవాలు తెలియకుండా చేయడం లక్ష్యంగా ఉంది. ఈ చర్యలు, దాడుల వెనుక ఉన్న ఉద్దేశమంతా ఒకటే. భారత కార్మిక వర్గాన్ని, ఐక్యతను విచ్ఛిన్నం చేసి తమ కార్పొరేట్ విధానాలను కొనసాగించడం.

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలు

కార్పొరేట్ శక్తులు బీజేపీకి అండగా నిలబడుతున్నాయి. రూ. వేల కోట్లు అందజేస్తున్నాయి. అందుకే కేంద్రం వారి చెప్పు చేతల్లో పాలన సాగిస్తున్నది చెప్పేది నిజం! 2014 నుండి ఇప్పటివరకు బీజేపీ ప్రభుత్వంతో ఆశ్రిత పెట్టు బడిదారుల విధానాన్ని నిస్సిగ్గుగా కొనసాగిస్తూ దేశ సంపదను లూటీ చేసేలా కొద్దిమంది కార్పొరేటర్ శక్తుల్ని శతకోటీశ్వరులను చేసింది.ఎన్నో సంవత్సరాలుగా కార్పొరేట్ శక్తులు డిమాండ్ చేస్తున్నట్టుగా కార్మిక చట్టాల మార్పులను మోడీ ప్రభుత్వం విజయవంతంగా చేస్తున్నది. 44 కేంద్ర చట్టాల స్థానంలో 29 చట్టాలను కలిపి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారు. వీటివల్ల కనీస వేతన నిర్ణయం ప్రభుత్వాల చేతుల్లోకి పోయి యజమానిచ్చినంత తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. 8గంటల పని దినం స్థానంలో 12గంటలు పని దినం చట్టం వస్తుంది. కేంద్ర చట్టాలు అమల్లోకి రాకముందే బీజేపీ ప్రభుత్వం మధ్యప్రదేశ్ ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో గతంలో హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ ప్రస్తుతం కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు 12గంటల పనిదినం అమలుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. యూనియన్లు పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు లేకుండా చేస్తున్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థను వ్యవస్థీకృతం చేస్తూ ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్‌ను తీసుకువస్తున్నారు. 300 మందిలోపు

కేంద్ర బీజేపీ ఎత్తుగడలను ఆర్ఎస్ఎస్ సిద్ధాంత అమలు కార్మికవర్గం సమిష్టిగా అడ్డుకోకపోతే కార్మికవర్గ ఐక్యత విచ్ఛిన్నం అవుతుంది. కార్మికులు మరింత దోపిడీకి గురవుతారు. దీన్ని ప్రతిఘటించేలా ఎక్కడికక్కడ ఉద్యమాలు నిర్మించాలి. కార్మికుల కష్టాన్ని కార్పొ రేట్లకు దోచిపెట్టేందుకు బీజేపీ అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా వ్యతిరేకించాలి. అందుకు కార్మికులు మరింత చైతన్యవంతంగా, సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు మే నెలంతా కూడా సీఐటీయూ నిర్వహిస్తున్న క్యాంపె యిన్‌ను విజయవంతం చేయాలి. అందుకు వాడవాడలా ప్రచారం చేయాలి. కార్మికుల్లో, పని ప్రదేశంలో, నివాస ప్రాంతాల్లో విస్తృతంగా తీసుకెళ్లి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలి.





పనిచేసే కార్మికులు గల పరిశ్రమలను మూసివేసు కోవడానికి, తొలగించుకోవడానికి యజమానులకు సర్వహక్కులు ఇచ్చారు. తనిఖీల వ్యవస్థను పూర్తిగా మార్చివేసి యజమానులు అన్ని చట్టాలు అమలు చేస్తామని రాసిస్తే సరిపోతుందని చెపుతున్నారు. దేశంలోని పారిశ్రామిక రంగంలో ఆటవిక రాజ్యాన్ని తీసుకురావడానికి బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. భారత కార్మికవర్గం తీవ్రంగా ప్రతిఘటిస్తున్నది కాబట్టే ఇంకా ఈ కోడ్‌లు అమల్లోకి రాలేదు.

ప్రభుత్వ ఆస్తులు ప్రయివేటుకు ధారాదత్తం

మేక్ ఇన్ ఇండియా పేరిట ఆర్థిక అభివృద్ధిని సాధిస్తామని, ఉద్యోగాలు సృష్టిస్తామని, జీడీపీని పెంచుతామని, తయారీ రంగం వాట పెంచుతామని ఇలా అనేక వాగ్దానాలు చేశారు. ఏవీ నెరవేరలేదు. పైగా ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రయివేటీకరణ విధానాలు యథేచ్ఛగా అమలు చేస్తున్నారు. రక్షణ రంగంలో 49శాతం, అంతరిక్షంలో 74శాతం, ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 10 నుండి 74శాతం, 100 రంగాల్లో 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతించారు. గతంలో వాజ్‌పాయి ప్రభుత్వం గానీ, ఇప్పటి నరేంద్ర మోడీ ప్రభుత్వం గానీ 23 ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించారు. నూతన ఆర్థిక విధానాలను అమలు చేయడానికి ప్రభుత్వరంగ సంస్థలను అమ్మడం కోసం గతంలో బీజేపీ ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణశాఖ అరుణ్ శౌరి ఆధ్వర్యంలో పనిచేసిన విషయం గమనించాలి. 2000 నుండి 2004 మధ్యన, తర్వాత 2014 నుండి 2023 మధ్యన బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థల విధ్వంసానికి పాల్పడింది. బాల్కో మొదలు ఎయిర్ ఇండియా, సిఎంసి, హిందుస్తాన్, జింక్, హెచ్‌టిఎల్, పిపిఎల్, పవన్ హాన్స్, విదేశీ సంచార నిగం లిమిటెడ్, హోటల్ కార్పొరేషన్, ఐటీడీసీలను అమ్మారు. ప్రస్తుతం షిప్పింగ్ కార్పొరేషన్, ఎన్ఎండీసీ, హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్ కేర్, కంటైనర్ కార్పొరేషన్, ఆర్ఐఎన్ఎల్ లేదా వైజాగ్ స్టీల్, ఐడిబిఐలను అమ్మకానికి పెట్టారు. 2018-19లో మొత్తం ప్రభుత్వరంగ సంస్థల ఆదాయం 24.43లక్షల కోట్లు. 2019-20 మధ్యలో టాప్ టెన్ ప్రభుత్వ రంగ సంస్థల లాభం రూ.1,38,112 కోట్లు. బంగారు బాతు లాంటి ప్రభుత్వరంగ సంస్థలను తెగనరికి కార్పొరేట్ వ్యక్తులకు నైవేద్యంగా మోడీ పెట్టబోతున్నాడు. అందుకోసం మరింత దూకుడును పెంచి 2025 నాటికి రూ.60 లక్షల కోట్ల విలువైనటువంటి ప్రభుత్వ ఆస్తులను రూ.6 లక్షల కోట్లకే నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరిట అప్పగించడానికి ప్రభుత్వం నిర్ణయం చేసింది.

సింగరేణిని ప్రయివేటీకరించే కుట్ర!

ఇందులో దేశ ఆర్థిక వ్యవస్థకు జీవనాడులుగా ఉన్నటువంటి రైల్వేలో 1,52,000 కోట్లకు 400 రైల్వేస్టేషన్లు, 90ప్యాసింజర్ రైళ్లు, 1,400 కిలోమీటర్ల రైల్వే లైను, 741కిలోమీటర్ల కొంకన్ రైల్వే లైను, 15 రైల్వే స్టేడియంలో, 265 గోదాములు, కొండ ప్రాంతాల్లో ఉన్నటువంటి రైల్వే లైన్‌లు అప్పగిస్తున్నారు. 26,700 కిలోమీటర్ల నేషనల్ హైవేను రూ.1,60,000 కోట్లు, విమానాశ్రయాలను రూ.20,782 కోట్లకు, పవర్ ట్రాన్స్‌మిషన్‌ను రూ.45,200 కోట్లకు, 160 బొగ్గు బావులు, 761 మినరల్ బ్లాకులను కేవలం 28,747 కోట్లకు అప్పగిస్తున్నారు. రూ.3,500 కోట్లకు టెలికాం ఆస్తులను విక్రయిస్తున్నారు. రూ.20,900 కోట్ల విలువైన గిడ్డంగులు, రూ.12,828 కోట్లు విలువైన షిప్పింగ్ ఆస్తులు కూడా అమ్మకానికి పెట్టారు. మానిటైజేషన్ కాకుండా ఇప్పటికే ప్రభుత్వ వాటాలు విక్రయించడం వల్ల అనేక సంస్థల్లో ప్రయివేటు వాళ్లకు అవకాశం కల్పించారు. కోల్ ఇండియాలో 29.4శాతం వాటాను ప్రభుత్వం కోల్పోయింది. మన సింగరేణిలో 49శాతం కేంద్రం చేతులు ఉండడం వల్ల ప్రయివేటీకరణకు ప్రయత్నం చేస్తున్నది. రక్షణ రంగంలో 41 సంస్థలను కార్పొరేషన్లుగా మార్చివేశారు. దేశ ఆర్థిక స్వావలంబన స్థానంలో అమెరికా అనుకూల, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తూ పరాధీనతకు బాటలు వేస్తున్నారు.

మోడీ తెస్తానని చెప్పిన నల్లధనం ఏది?

పెద్దనోట్ల రద్దు సమయంలో నల్లధనంపై మోడీ ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరలేదు. విదేశాల్లో దాచిన డబ్బును తీసుకొచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15లక్షలు జమచేస్తానని చెప్పిన పెద్దమనిషి ఆ ఊసే మరిచారు. నోట్లు రద్దు చేసింది వాళ్లే, కొత్త నోట్లు తెచ్చింది వాళ్లే, ఆ తెచ్చిన కొత్త నోట్లను కూడా రద్దు చేస్తున్నది మళ్లీ వాళ్లే. ఇదంతా బడాపెట్టుబడిదారుల మేలుకే! దేశంలో నిరుద్యోగం ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగినా పట్టింపు లేదు. విద్వేష పాలనపై ప్రజలు పెద్ద ఎత్తున తిరుగుబాటు చేస్తున్నారు. వ్యవసాయ కార్మికులు, రైతులు, అసంఘటిత, కాంట్రాక్టు, కార్మికులు, స్కీం వర్కర్లు, ప్రభుత్వ ఉద్యోగులు దేశంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తున్నారు. వాటిని అణిచివేయడానికి మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు కాషాయ పరిపాలకులు. కేంద్ర బీజేపీ ఎత్తుగడలను ఆర్‌ఎస్ఎస్ సిద్ధాంత అమలు కార్మికవర్గం సమిష్టిగా అడ్డుకోకపోతే కార్మికవర్గ ఐక్యత విచ్ఛిన్నం అవుతుంది. కార్మికులు మరింత దోపిడీకి గురవుతారు. దీన్ని ప్రతిఘటించేలా ఎక్కడికక్కడ ఉద్యమాలు నిర్మించాలి. కార్మికుల కష్టాన్ని కార్పొ రేట్లకు దోచిపెట్టేందుకు బీజేపీ అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా వ్యతిరేకించాలి. అందుకు కార్మికులు మరింత చైతన్యవంతంగా, సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు మే నెలంతా కూడా సీఐటీయూ నిర్వహిస్తున్న క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలి. అందుకు వాడవాడలా ప్రచారం చేయాలి. కార్మికుల్లో, పని ప్రదేశంలో, నివాస ప్రాంతాల్లో విస్తృతంగా తీసుకెళ్లి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలి.



నైరుతి నేస్తం

ఉక్కపోతలతో
ఊపిరి సలపని రోజులు
ఎంతగానో మనిషిని
ఉక్కిరి, బిక్కిరి చేశాయో
భూమి అంటకాగుతూ
దేహాలు మరెంతగా అల్లాడాయో

చెట్టు నిర్జీవం అవుతూ
పక్షులు సైతం ఎండ వేడికి అల్లాడుతూ
ఎంతగా పరితపించి పోయాయో
కొండలు పగిలే వేడి ఉద్రితికి
ఎన్ని ఉదయాలు ఊపిరి సలపని గంటలతో
భారంగా మనిషి బతుకుని
ఎంత దుర్భరంగా మోసాయో

ఒక చిన్న తీపి కబురు
ఊపిరి పిట్టలా
నైరుతి నడయాడుతూ వస్తోందనీ...
ఆహా... ఎంత తియ్యని అనుభూతో
వినడానికే మనసు ఎంత త్రుళ్ళి పడుతోందో
నైరుతి నాలుగు దిక్కుల్ని పలకరిస్తే
పండు వెన్నెల స్పర్శ మదిని మీటిపోదూ...

కొన్ని చినుకులు ఆత్మీయమైన రాలితే
మరికొన్ని చిటపటలు నేలను ముద్దాడి మురిపిస్తే
నేల పచ్చని ఆకృతులతో
మురిసి తబ్బిబ్బి పోదూ...
కాళీ కుండలైన బావులూ, నదులూ నవ్వుతూ
రైతు కలల్ని మీటి మురిసిపోవూ...
రైతన్న ఏరువాక నడకలో
నైరుతి నేస్తం పలరింపులో హాలం హర్షంతో
ఉప్పొంగి పోదూ...

- మహబూబ్ బాషా చిల్లెం
సెల్: 9502000415

ఎంతమంది ఉసురు పోసుకుంటారు?



ఎస్. పుణ్యవతి

'మాకు ప్రాణ హాని ఉంది. మేము నిత్యం వేధింపులకు గురవుతున్నాం'. ఈ ప్రకటన చేసింది వినేష్ ఫోగట్. దేశానికి పతకాల మీద పతకాలు సంపాదించి పెట్టిన, దేశం పరువు నిలబెట్టిన క్రీడాకారిణి. 'భారత కుస్తీ సమాఖ్య అధ్యక్షుడి మీద ఫిర్యాదు ఇచ్చిన వారితో సహా మా అందరి జీవితాలు ప్రమాదంలో ఉన్నాయి. మా కుటుంబాలకు బెదిరింపులు వస్తున్నాయి'. ఈ మాటలు వినేష్ జనవరి 18వ తేదీన మొట్టమొదట జంతర్‌మంతర్ దగ్గర ధర్నా చేసిన రోజే చెప్పింది. 'నేను ప్రధానమంత్రిని కలిసినప్పుడు కూడా ఇంత వివరంగా కాకపోయినా... మేం వేధింపులను ఎదుర్కొం టున్నాం. మాకు సహాయం చేయండి... అని విన్నవించుకున్నాన'ని కూడా చెప్పింది. తిరిగి ఏప్రిల్ 25వ తేదీన, మే 18వ తేదీన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాకు చెప్పింది. అయితే ఇవన్నీ ప్రభుత్వానికి ఎందుకు అర్థం కావడం లేదు. ఇప్పటికి ఐదు నెలలుగా వాళ్ళు ఆందోళన చేస్తున్నారు. ఈ మహిళా క్రీడాకారులు నిజంగానే జీవితం ప్రమాదంలో పడేంత తీవ్రమైన ఇబ్బందులు అనుభవిస్తున్నారా. అంటే గతంలో జరిగిన ఘటనలు నూటికి నూరు శాతం నిజమనే చెప్తున్నాయి. ఒకసారి గతంలో ఏం జరిగిందో చూద్దాం.

రుచిక గిర్హోత్రా. గూగుల్ తల్లిని అడిగితే ఈమె గురించి అన్ని వివరాలు చెబుతుంది. అభం శుభం తెలియని 14ఏండ్ల బాలిక. టెన్నిస్ నేర్చుకునేది. అప్పటి పోలీస్ అధికారి అయిన టెన్నిస్ అసోసియేషన్ నాయకుడి వేధింపులకు బలైంది. న్యాయం దొరకక, తన కారణంగా తమ్ముడు, మొత్తం కుటుంబం వేధింపులకు గురైన కారణంగా మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. అయితే సదరు పోలీస్ అధికారి మాత్రం డిజిపిగా పదోన్నతి పొందాడు. ఇదీ మన ఆడపిల్లలకు న్యాయం జరిగే తీరు. రుచిక టెన్నిస్ క్రీడాకారిణి. చండీగఢ్ లోని సేక్రెడ్ హార్ట్ గర్ల్స్ హైస్కూల్లో 10వ తరగతి చదివేది. తండ్రి యూకో బ్యాంక్ మేనేజర్. తల్లి చిన్నప్పుడే చనిపోయింది. సోదరుడు అషు. స్నేహితురాలు ఆరాధనతో కలిసి హర్యానా లాన్ టెన్నిస్ అసోసియేషన్‌లో టెన్నిస్ నేర్చుకునేది. ఇది ఎక్కడ ఉన్నదంటే, అప్పటి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పనిచేస్తున్న ఎస్‌పిఎస్ రాథోడ్ నివాస గృహం పక్కనే ఉండేది. అప్పట్లో ఇతగాడు హర్యానా లాన్ టెన్నిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పని చేసేవాడు. ఆ హోదాలోనే రుచిక ఇంటికి వెళ్లి ఆ అమ్మాయి తండ్రితో మాట్లాడాడు.

ఇది జరిగింది 1990 ఆగస్టు 11వ తేదీన. 'అమ్మాయి బాగా పైకి వస్తుంది. నా ఇంటికి పంపించండి. కోచింగ్ ఇస్తాను' అని చెప్పి వచ్చాడు. 12వ తేదీన స్నేహితురాలు ఆరాధనతో కలిసి రుచిక రాథోడ్ ఆఫీస్‌కి వెళ్లి కలిసింది. ఆ ఇద్దరు అమ్మాయిల్ని చూసిన ఈ పెద్ద మనిషి టెన్నిస్ కోచ్‌ని తీసుకురమ్మని చెప్పి ఆరాధనను బయటకు పంపించాడు. ఆ అమ్మాయి బయటకు వెళ్లిందో లేదో ఒంటరిగా ఉన్న రుచికను గట్టిగా పట్టుకొని దగ్గరకు తీసుకొని చెప్పరాని విధంగా ప్రవర్తించసాగాడు రాథోడ్. ఏదో విధంగా అమ్మాయి అతన్ని బయటకు నెట్టేసి ఇవతలకు వచ్చింది. అయినా అతని ధోరణి మారలేదు. బయటికి వెళ్లిన ఆరాధన లోపలికి వచ్చి జరిగిందంతా చూసింది. జరిగిన విషయం ఆడపిల్లలు ఇంట్లో వాళ్లకి చెప్పలేదు. అందరు ఆడవాళ్లు, ఆడపిల్లల్లాగే భయపడ్డారేమో. ఆ తర్వాత రోజున మళ్లీ టెన్నిస్ నేర్చుకోవడానికి వెళ్లారు. ఆ పిల్లలిద్దరినీ తన ఆఫీసుకు పిలిపించాడు రాథోడ్. ఇక దీంతో వారిద్దరు ఇంట్లో వాళ్లకి చెప్పారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఏదో ఒకటి చేయాలని నిర్ధారణకు వచ్చారు. పైఅధికారుల దృష్టికి తీసుకురావాలనుకున్నారు. ఆగస్టు 17 తేదీన హోం సెక్రటరీకి ఫిర్యాదు ఇచ్చారు. అధికారులు చర్యలు తీసుకుంటారని భ్రమపడతాం కదా! వారూ అలాగే అనుకున్నారు. అయితే కథ అక్కడితో ఆగలేదు. ముఖ్యమంత్రులు, హోంమంత్రులతో కలిసి నేరస్తుడ్ని రక్షించడానికి నాటకాలు మొదలెట్టారు.

ఆ తర్వాత జరిగినదంతా తెలుసుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది. క్రైమ్‌స్టోరీని తలపిస్తుంది. న్యాయం జరగకపోగా రుచిక కుటుంబాన్ని, మద్దతునిచ్చిన స్నేహితురాలు ఆరాధన కుటుంబాన్ని సర్వనాశనం చేశారు. ఇదంతా అధికారంలో ఉన్న పెద్దల అండతోనే సాగింది. సెప్టెంబర్ 17వ తేదీన హోం సెక్రటరీకి ఫిర్యాదు ఇచ్చాక... హోం సెక్రటరీ ఆర్.ఆర్. సింగ్ నివేదిక ఇచ్చారు. దాంట్లో స్పష్టంగా నేరం జరిగినట్లు చెబుతూ ఎఫ్ఐఆర్ తక్షణమే నమోదు చేయాలని సిఫార్సు చేశారు. ఆ కొద్ది కాలానికి ఆర్.ఆర్.సింగ్ స్థానంలో దుగ్గల్ హోం సెక్రటరీగా వచ్చాడు. సింగ్ ఇచ్చిన రిపోర్టు ఎక్కడ చెదలు పట్టిపోయిందో తెలియదు. నేరం చేసిన రాథోడ్‌కి స్థానిక ఎమ్మెల్యేతో సహా అప్పటి ముఖ్యమంత్రి హుకుమ్ సింగ్, ఆ తరువాత వచ్చిన ఓం ప్రకాష్ చౌతాలా ప్రభుత్వాల అండదండలు దండిగానే ఉన్నాయట. బాలిక కుటుంబానికి




మాత్రం వేధింపులు తారాస్థాయికి చేరాయి. మొదట స్కూల్ ఫీజు ఎగ్గొట్టిందని ఆరోపించి ఆ పిల్లని స్కూలు నుంచి బహిష్కరించారు. ఫీజులు కట్టని 135 మంది మీద మాత్రం ఒంటి మీద ఈగ వాల లేదు. ఈ బహిష్కరణను అడ్డం పెట్టుకొని ఆ పిల్ల మీద నిందా ప్రచారం తారాస్థాయిలో చేశారు. ఆ తల్లి లేని పిల్ల ఒకవైపు మానసిక వేదనతో గది నాలుగు గోడల మధ్య మగ్గిపోయింది. రాథోడ్ చెప్పుచేతల్లో ఉన్న పోలీస్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు తెల్ల చొక్కాల ముసుగులో ఆ కుటుంబం మీద ఒక కన్నువేశారు. తండ్రి మీద, పది సంవత్సరాల తమ్ముడి మీద మర్డర్ కేసు, దొంగతనం కేసుతో సహా పెట్టని కేసులు అంటూ లేవు. కేసులు పెట్టి వేధించారు. పోలీస్ స్టేషన్లో పెట్టి చిత్రహింసలకు గురిచేశారు. సినిమాల్లో తప్ప మరెక్కడ చూడం ఇట్లాంటి చిత్రహింసలు. ఆ పిల్లాడు ఎట్లా బతికి బయటపడ్డాడో తెలియదు.

మరో బాలిక ఆరాధన మీద పదికి పైగా కేసులు పెట్టారట. ఆమెను తండ్రి హర్యానా ప్రభుత్వంలో చీఫ్ ఇంజనీరుగా పనిచేసేవాడు. మచ్చలేని మనిషి. అటువంటి ఆయన మీద కేసులు మీద కేసులు పెట్టి చివరికి ఉద్యోగంలో నుంచి సస్పెండ్ చేయించారు.ఇవన్నీ చూసిన బాధితురాలు రుచిక మూడేళ్ల తర్వాత అంటే 1993 డిసెంబర్ 28న విషం తిని చనిపోయింది. అక్కడికి ఆ దుర్మార్గుడు కక్ష తీరలేదు. తండ్రి చేత బలవంతంగా తెల్ల కాగితాల మీద సంతకాలు పెట్టించుకుని గాని ఆ అమ్మాయి మతదేహాన్ని తండ్రికి అప్పగించలేదు. ప్రభుత్వం ఈ కేసు ఫైలు మూసివేసింది. వేధింపులు తట్టుకోలేక కుటుంబం చండీగఢ్ నుంచి సిమ్లా దగ్గరకు పోయి మట్టి పని చేసుకుని బతికిందట. రాథోడ్ మాత్రం సంవత్సరం తర్వాత 1994లో అడిషనల్ డిజిపిగా పదోన్నతి పొందాడు. ఆ తర్వాత 1999లో ఓం ప్రకాష్ చౌతాలా ప్రభుత్వంలో డిజిపిగా పదోన్నతి వచ్చింది. ఈ మొత్తం ఘటన మీద అప్పటి రాష్ట్ర స్థాయి బీజేపీ నాయకుడు స్పందించాడట. అయితే కేంద్రంలో ఉన్నది వాజ్‌పేయి ప్రభుత్వమే కదా. వాజ్‌పేయి ప్రభుత్వానికి ఓం ప్రకాష్ చౌతాలా ప్రభుత్వం మద్దతు ఉంది కాబట్టి అన్ని రకాల మద్దతులు కలిపి ఒక ఆడపిల్లకి, ఒక భావి భారత క్రీడాకారిణికి అన్యాయం చేశారు. ఇదంతా పార్లమెంట్ వేదికగా కూడా చర్చ జరిగింది. అప్పుడు పార్లమెంటు సభ్యురాలుగా ఉన్న బందాకరత్ కూడా రుచికకు న్యాయం జరగాలని పార్లమెంటును వేదికగా చేసుకుని పోరాడారు. ఇవన్నీ ఆనాటి ఇంగ్లీషు, హిందీ అన్ని పత్రికల్లోనూ ప్రముఖంగా ప్రచురించబడ్డాయి. చివరికి కేసు సిబిఐ చేతుల్లోకి వెళ్ళింది. సుప్రీంకోర్టు దాకా వచ్చింది. నేరం జరిగిన 20 సంవత్సరాల తర్వాత 2010లో రాథోడ్ నేరం చేశాడని అంగీకరిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. ఏమైనప్పటికీ నేరస్తుడికి పదోన్నతి, బాధితురాలికి మరణం సంప్రాప్తించాయి.

ఇదంతా చూశాక...బాధితులైన క్రీడాకారులు, వాళ్ళ కుటుంబాలు భయభ్రాంతులకు గురవుతున్నాయని అనడంలో ఏమైనా ఆశ్చర్యం ఉన్నదా. పుండు మీద కారం చల్లినట్లు 'వాళ్లు రోడ్డెక్కింది న్యాయం కోసం కాదు. రాజకీయాల కోసం' అన్న దుష్ప్రచారాలను సోషల్ మీడియా వేదికగా చూసిన వాళ్లకి బుర్ర వేడెక్కిపోవాల్సిందే. ప్రస్తుతం కుస్తీ క్రీడాకారిణులు పోరాడుతున్నది ఒక అధికార మదగజంతో అన్నది దేశ ప్రజలందరికీ అర్థం కావాలి. దేశానికి పతకాలు సాధించి పెట్టి, దేశం పరువు నిలబెట్టిన ఆడపిల్లల్ని రక్షించుకోవడానికి ఈ దేశ ప్రజ ఏం చేస్తున్నది? ఇది మనందరి ముందు ఉన్న ప్రశ్న!

ఇదంతా చూశాక...బాధితులైన క్రీడాకారులు, వాళ్ళ కుటుంబాలు భయభ్రాంతులకు గురవుతున్నాయని అనడంలో ఏమైనా ఆశ్చర్యం ఉన్నదా. పుండు మీద కారం చల్లినట్లు 'వాళ్లు రోడ్డెక్కింది న్యాయం కోసం కాదు. రాజకీయాల కోసం' అన్న దుష్ప్రచారాలను సోషల్ మీడియా వేదికగా చూసిన వాళ్లకి బుర్ర వేడెక్కిపోవాల్సిందే. ప్రస్తుతం కుస్తీ క్రీడాకారిణులు పోరాడుతున్నది ఒక అధికార మదగజంతో అన్నది దేశ ప్రజలందరికీ అర్థం కావాలి. దేశానికి పతకాలు సాధించి పెట్టి, దేశం పరువు నిలబెట్టిన ఆడపిల్లల్ని రక్షించుకోవడానికి ఈ దేశ ప్రజ ఏం చేస్తున్నది? ఇది మనందరి ముందు ఉన్న ప్రశ్న!

ప్రేమా.. వ్యామోహం...



ఐద్వా అదాలత్
సెల్: 9490098024

ప్రేమ ఓ స్వచ్ఛమైన అనుభూతి. మనం ప్రేమను నిర్వచించలేం. అది మాటల్లో చెప్పలేని అనుభూతి. చాలా వరకు ప్రేమలో పడితే వారిని గుడ్డిగా నమ్మేస్తాం. వారి గురించి ఎవరైనా చెడుగా చెప్పినా నమ్మలేం. ప్రేమ కోసం పోరాడతాం. ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉంటాం. వారు లేకుండా జీవితాన్ని ఊహించలేం. మన సొంత జీవితాన్ని మరిచిపోయి ఎప్పుడూ వారి కోసమే ఆలోచిస్తాం. వారి పట్ల శ్రద్ధ వహిస్తారు. అయితే నేటి యువత ప్రేమ విషయంలో చాలా గందరగోళంగా ఉన్నారు. ప్రేమంటే ఏంటో తెలుసుకోలేకపోతున్నారు. సాధన అలాంటి సమస్యతోనే ఈ వారం ఐద్వా అదాలత్‌కు వచ్చింది. తనది ప్రేమో, వ్యామోహమో తేడా తెలియక ఎన్ని ఇబ్బందులు పడిందో తెలుసుకుందాం.

సాధన డిగ్రీ చివరి ఏడాదిలో ఉంది. వాళ్ళది కో ఎడ్యుకేషన్ కాలేజీ. సాధన స్నేహితుల్లో అబ్బాయిలు కూడా ఉన్నారు. ఈ రోజుల్లో అమ్మాయిలూ, అబ్బాయిలు స్నేహంగా ఉండడం కామన్. అందుకే తమ కూతురు అబ్బాయితో మాట్లాడినా, స్నేహితులు ఇంటికి వచ్చినా అడ్డు చెప్పే వారు కాదు. వాళ్ళకు కూతురిపై అంత నమ్మకం. వాళ్ళకు చిన్న టీ షాప్ ఉంది. కాలేజీకి సెలవు వచ్చినప్పుడల్లా సాధన కూడా ఆ టీ షాప్‌కి వెళ్ళి కూర్చొనేది. తనకు ఓ తమ్ముడు కూడా ఉన్నాడు. పెద్దగా ఆర్థిక ఇబ్బందులు లేవు. కాకపోతే సాధన తండ్రి మద్యం తాగేవాడు. ఎంతమంది చెప్పినా వినడు. ప్రతి రోజు ఎంతో కొంత తాగి పడుకునేవాడు. అయితే పండుగలకు, బంధువులు ఇంటికి వెళ్ళినపుడు ఎక్కువగా తాగుతాడు. అప్పుడు భార్యాభర్త ఇద్దరూ బాగా గొడవపడేవారు. ఇది ఓ సమస్యగా ఉండేది సాధనకు.

కాలేజీకి వెళ్ళొచ్చి ఇంట్లో ఎవరితో మాట్లాడేది కాదు. ఫోన్ చూసుకుంటూ కూర్చునేది. అప్పటికి కరోనా ప్రభావం ఇంకా పోలేదు. కరోనా వచ్చిన తర్వాత చిన్న వారి నుంచి పెద్ద వారి వరకు అందరూ ఫోన్‌కి అలవాటయ్యారు. అలానే అనుకుంది సాధన తల్లి కూడా. కానీ తండ్రి అలా కాదు, ఆమె ఫోన్‌లో ఎందుకు అంత టైం గడుపుతుందనే అనుమానం వచ్చింది. అప్పటి నుంచి కూతురిని గమనించడం మొదలుపెట్టాడు. సాధనకు తండ్రి అంటే విపరీతమైన అభిమానం, ప్రేమ. అలాంటిది ఆ మధ్య కాలంలో తండ్రితో కూడా మాట్లాడటం మానేసింది. ప్రతి విషయానికి చిరాకు పడేది. అందుకే తండ్రికి అనుమానం వచ్చింది.

ఇంట్లో అందరూ పడుకున్న తర్వాత ఫోన్ మాట్లాడేది. బయట నుండి తలుపుకు గడియ పెట్టి వెళ్ళేది. రెండు, మూడు గంటల తర్వాత తిరిగి వచ్చేది. ఇదంతా తండ్రి గమనించాడు. ఈ విషయమే భార్యకు చెప్పాడు. ఆమె భర్త మాటలు నమ్మకుండా కూతురికే సపోర్ట్ చేసింది. కొంత కాలానికి ఇంట్లో డబ్బులు కనిపించకుండా పోయేవి. అప్పుడప్పుడు బంగారం కూడా కనిపించేది కాదు. టీ షాప్‌లో డబ్బులు కూడా మాయం అవుతుండేవి. ఇంట్లో ఉండేది నలుగురు మాత్రమే. ఏ వస్తువు ఎక్కడ ఉండేది తెలిసేది కూడా ఆ నలుగురికే. అబ్బాయి చిన్నవాడు. భర్త తీసుకోడు. తీసుకున్నా చెప్పి తీసుకుంటాడు. ఇక మిగిలింది సాధన. తల్లి ఆమెను అడిగింది. కోపగించుకుంది. అప్పటి నుంచి సాధన తల్లిదండ్రులపై కోపం పెంచుకుంది.

ఇంట్లో వారితో మాట్లాడటమే మానేసింది. అందరినీ శత్రువుల్లా చూస్తుంది. ఒకసారి వాళ్ళ అమ్మ ఫోన్‌లో బ్యాలెన్స్ అయిపోయేది. దాంతో భర్తకు ఫోన్ చేయడానికి సాధన ఫోన్ తీసుకుంది. అప్పుడు సాధన ఆమెతో పెద్ద గొడవ చేసి తల్లిపైనే చేయి చేసుకుంది. అయినా చిన్న పిల్ల కదా అని ఆ తల్లి ఊరుకుంది. ఆ విషయం మాత్రం ఎవరితోనూ చెప్పలేదు. కొన్ని రోజుల తర్వాత ఇంట్లో నుంచి 20 గ్రాముల బంగారం పోయింది. ఆ విషయంపై భార్యాభర్తలు గొడవ పడ్డారు. అదే అవకాశంగా తీసుకుంది సాధన.

అందరూ పడుకున్న తర్వాత ఇంట్లో నుండి వెళ్ళిపోయింది. తెల్లారి చూస్తే కూతురు ఇంట్లో లేదు. మొత్తం వెతికారు. పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ చేశారు. సాధనకు ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఎత్తడం లేదు. కొద్దిసేపటికి ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. కూతురు ఎటువెళ్ళిందో తెలియదు. ఏమైందో తెలియదు. సర్వం కోల్పోయిన మనుషులుగా మిగిలిపోయారు ఆ తల్లిదండ్రులు. 11:00 గంటల సమయంలో ఫోన్ మోగింది. ఎత్తి మాట్లాడితే 'డాడీ నేను దిలీప్‌ను పెండ్లి చేసుకుంటున్నాను' అంది. తండ్రి గుండె బద్దలయింది.

ఎలాగో తేరుకొని 'నీవు ఇంటికి రా, అందరితో మాట్లాడి నేను నీ పెండ్లి చేస్తాను' అని చెప్పాడు. కానీ సాధన వినలేదు. 'నేను ఇంటికి వస్తే మీరు నాకు వేరే వ్యక్తితో పెండ్లి చేస్తారు' అని ఫోన్ పెట్టేసింది. గుడిలో దిలీప్‌ను పెండ్లి చేసుకుని వచ్చింది. దిలీప్‌కు తండ్రి లేడు. తల్లి మాత్రమే ఉంది. వాళ్ళ అక్క కూడా ప్రేమ వివాహం చేసుకుంది. దిలీప్ ఓ జులాయ్. ఏ పనీ చేయడు. తల్లి సంపాదించిన డబ్బులతో జల్సా చేస్తాడు. అతనికి లేని అలవాటు అంటూ లేదు. మద్యం తాగడం, గుట్కా తినడం.. ఇలా చెడు అలవాట్లు అన్నా ఉన్నాయి. వాటికి తోడు ఇంతకు ముందు ఇద్దరు అమ్మాయిలను పెండ్లి చేసుకుని కొన్ని రోజులు గడిపి వదిలేశాడు. పోలీస్ స్టేషన్‌లో అతనిపై రెండు కేసుకు ఉన్నాయి. జైలుకు వెళ్ళి రెండేండ్లు గడిపి వచ్చాడు. అలాంటి అబ్బాయిని సాధన ఇప్పుడు పెండ్లి చేసుకొని వచ్చింది.

సాధన తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళారు. పోలీసులు దిలీప్ తల్లిని పిలిస్తే 'మీ ఇష్టం మీకు నచ్చినట్లుగా చేసుకోండి. వాడిపైన కేసైనా పెట్టండి. లేకపోతే వాళ్ళిద్దరికీ పెండ్లి చేయండి. మీరేం చేసినా నాకు సంబంధం లేదు. నేను ఇంక వాడిని భరించలేను' అంటూ పోలీసులకు చెప్పి వెళ్ళిపోయింది. సాధనకు నచ్చజెప్పడానికి కుటుంబ సభ్యులతో పాటు పోలీసులు కూడా ప్రయత్నించారు. కానీ ఆమె ఒప్పుకోలేదు. 'నేను దిలీప్‌తోనే వుంటాను' అంటూ మొండికేసింది. అందరి సమక్షంలో పెండ్లి చేస్తామన్నా వినలేదు.

దిలీప్‌పై అదే పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నాయి. 'సాధనకు ఇప్పుడు 18 ఏండ్లు నిండాయి కాబట్టి మేము ఏం చేయలేము. మేము ఆమెను మీతో బలవంతంగా పంపించలేము. ఆమె మీతో వస్తాను అంటే తీసుకువెళ్ళండి. అంతేకానీ మేము మాత్రం ఏం చేయలేము' అంటూ పోలీసులు చేతులు దులుపుకున్నారు. తల్లిదండ్రులు ఎంత ప్రయత్నించినా ఉపయోగం లేకుండా పోయింది. సాధన దిలీప్‌తో వెళ్ళిపోయింది. ఇక చేసేది ఏమీలేక వాళ్ళు కూడా ఇంటికి వెళ్ళారు. దిలీప్ కుటుంబ సభ్యులతో మాట్లాడటానికి ప్రయత్నించినా ఉపయోగం లేదు. ఏ ఒక్కరూ దిలీప్ బాధ్యత తీసుకోవడానికి ముందుకు రాలేదు. చివరికి అతని స్నేహితులను పిలిచి మాట్లాడినా ఎలాంటి ఉపయోగం లేదు.

'మేము పెండ్లి చేసుకుని వచ్చాం. మీతో మాకు ఎలాంటి సంబంధం లేదు. మీ వల్ల నా భర్తకు ప్రాణహాని ఉంది. మా దగ్గరకు మీరు రావద్దు. మీ దగ్గరకు నేను రాను' అని సాధన పోలీస్ స్టేషన్‌లో రాసి ఇచ్చింది. 'ఎంత చెప్పినా ఇంకా ఎందుకు నన్ను ఇలా వేధిస్తున్నారు. ఇలాగే ఇబ్బంది పెడితే చనిపోతాను' అని బెదిరించింది. తల్లిదండ్రులు ఏం చేయలేక వదిలేశారు. దిలీప్ సాధనతో ఓ నెల వరకు బాగానే ఉన్నాడు. ఆమె దగ్గర ఉన్న డబ్బులు, బంగారం మొత్తం అయిపోయింది. ఇక అప్పటి నుండి 'నీవు ఉద్యోగానికి వెళ్ళి డబ్బులు సంపాదించి ఇవ్వు. నీవు చదువుకున్నావు కాబట్టి మంచి ఉద్యోగం వస్తుంది. నాకు ఎలాంటి చదువు లేదు' అంటూ మూడు నెలల్లో సాధనకు నరకం చూపించాడు.

ఎవరితో ఫోన్ మాట్లాడనిచ్చేవాడు కాదు. సూటిపోటి మాటలతో ఇబ్బంది పెట్టేవాడు. తాగొచ్చి కొట్టేవాడు. 'ఎందుకు ఇలా చేస్తున్నావు' అంటే 'నా గురించి నీకు మొత్తం తెలుసు. అయినా నన్ను పెండ్లి చేసుకున్నాడు. మా అమ్మ నన్ను భరించలేక వదిలేసింది. నీ కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినలేదు. ఇప్పుడు అనుభవించు. నేను ఇలాగే చేస్తాను. ఇంతకు ముందు ఇద్దరు అమ్మాయిలతో కూడా ఇలానే చేశాను. అందుకే వాళ్ళు నన్ను వదిలేసి వెళ్ళిపోయారు. నీకు ఇష్టం లేకపోతే వెళ్ళిపో' అని ఇంట్లో నుండి నెట్టేశాడు. అవమానంతో ఇక్కడ (లీగల్ సెల్)కు వచ్చింది సాధన.

> **ఎవరితో ఫోన్ మాట్లాడనిచ్చేవాడు కాదు. సూటిపోటి మాటలతో ఇబ్బంది పెట్టేవాడు. తాగొచ్చి కొట్టేవాడు. 'ఎందుకు ఇలా చేస్తున్నావు' అంటే 'నా గురించి నీకు మొత్తం తెలుసు. అయినా నన్ను పెండ్లి చేసుకున్నాడు. మా అమ్మ నన్ను భరించలేక వదిలేసింది. నీ కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినలేదు. ఇప్పుడు అనుభవించు. నేను ఇలాగే చేస్తాను. ఇంతకు ముందు ఇద్దరు అమ్మాయిలతో కూడా ఇలానే చేశాను. అందుకే వాళ్ళు నన్ను వదిలేసి వెళ్ళిపోయారు. నీకు ఇష్టం లేకపోతే వెళ్ళిపో' అని ఇంట్లో నుండి నెట్టేశాడు.**

లీగల్ సెల్ సభ్యులు సాధన తల్లిదండ్రులను పిలిచి మాట్లాడితే 'మా కూతురు మాకు బరువు కాదు. కావాలంటే దిలీప్‌ను కూడా మేము ఇంట్లో కూర్చోబెట్టి పోషిస్తాము. ఎంతగా చెప్పినా వినకుండా అతనితో వెళ్ళిపోయింది' అంటూ వాళ్ళు ఏడ్చేశారు. 'సాధన నీకు ఇప్పుడు 18 ఏండ్లు మాత్రమే. ముందు జీవితం చాలా ఉంది. నీవు దిలీప్ కోసం ఆలోచిస్తూ నీ జీవితం పాడుచేసుకోకు. మీ తల్లిదండ్రులతో ఇంటికి వెళ్ళు. నీ భవిష్యత్తును తీర్చిదిద్దుకో. అతని వల్ల ఇద్దరమ్మాయిల జీవితం నాశనం అయ్యింది. అతనితో ఉంటే నీ జీవితం కూడా అలాగే అవుతుంది. నువ్వే ఆలోచించుకో. అతనితో వుండి నాశనం చేసుకుంటావో? నీ తల్లిదండ్రులతో వెళ్ళి జీవితాన్ని బాగుచేసుకుంటావో? నిర్ణయం నీదే. అతను ఎంత చెప్పినా వినడు, మారడు. ఇప్పుడైతే మీ ఇంటికి వెళ్ళు, బాగా ఆలోచించుకొని రా' అని చెప్పి పంపించారు.

ఆరు నెలల తర్వాత సాధన తిరిగి వచ్చింది. 'మేడమ్ నేను డిగ్రీ పూర్తి చేశాను. ప్రస్తుతం ఉద్యోగం చేసుకుంటూ పీజీ చేస్తున్నాను. నా తల్లిదండ్రులు చాలా సంతోషంగా ఉన్నారు. మీరు ఆ రోజున నన్ను నా తల్లిదండ్రుల దగ్గరకు పంపించకపోతే ఈ రోజు నేను ఇలా ఉండేదాన్ని కాదు. దిలీప్ లాంటి వాడి కోసం నాలాంటి అమ్మాయిలు తమ జీవితాలు ఎలా నాశనం చేసుకుంటున్నారో ఈ ప్రపంచానికి తెలియాలి. వాళ్ళు కూడా నాలాగే మారి వారి జీవితాలను తీర్చిదిద్దుకోవాలి. అదే నా కోరిక' అని చెప్పి వెళ్ళిపోయింది.

- వరలక్ష్మి, 9948794051

కలబందతో అందం, ఆరోగ్యం...

ప్రతి ఇంట్లో కలబందను పెంచుకుంటూనే ఉంటాం. ఈ మొక్క చాలా సులువుగా, నీడలో కూడా పెరుగుతుంది. దీనిని అందానికి ఎక్కువగా ఉపయోగిస్తుంటాం. దీని వల్ల అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలూ ఉన్నాయి. ఇందులో నీటిని పీల్చుకునే గుణం ఎక్కువగా వుంది. ఉదయం పరకడుపున కలబందను తింటే ఉదర సంబంధ సమస్యలు తొలగిపోతాయి. కలబంద



రసాన్ని ముఖానికి పట్టిస్తే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. చర్మంపై ఎక్కడైనా కాలిన గాయాలైతే కలబంద రసాన్ని వాటిపై పూతలా పూస్తే గాయాలు త్వరగా తగ్గుతాయి. కలబంద రసంలో కొద్దిగా కొబ్బరి నూనె పోసి కలుపుకుని, ఆ మిశ్రమాన్ని మోచేతులు, పాదాల వద్ద నల్లగా ఉన్న ప్రాంతాల్లో పూతలా అప్లై చేసి కాసేపటి తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే చర్మంపైనున్న నల్లటి మచ్చలు తొలగిపోతాయి. పొడి చర్మానికి రోజ్ వాటర్‌లో కలబంద రసాన్ని కలుపుకుని ఈ మిశ్రమాన్ని చర్మంపై పూస్తే ఫలితం ఉంటుంది. కలబంద రసంలో ముల్తానీ మట్టి లేక చందపు పొడి కలుపుకుని మొటిమలకు పూస్తే మొటిమలు పోయి చర్మం కాంతివంతంగా మారుతుంది.

కాంగ్రెస్, బీజేపీ విష ప్రచారాలను తిప్పి కొట్టాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ

కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న గ్లోబల్ విష ప్రచారాలను తిప్పికొట్టాలని ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఏరియాస్పత్రిలో శుక్రవారం వందపడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.5.80కోట్లతో నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో నిర్మించనున్న 20 ప్రాథమిక, పీహెచ్‌సీ కేంద్రాల నిర్మాణాలకు కలిపి ఎన్‌ఎస్‌పీ క్యాపు మైదానంలోనే శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. ఇందుకుగాను ఢిల్లీలో అనేక అవార్డులు వచ్చాయన్నారు. ఢిల్లీలో అవార్డు ఇస్తున్నవారే గల్లీలో అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. పంచాయతీరాజ్, పట్టణం, అటవీ, ఆరోగ్య, విద్యుత్ పరిశ్రమ రంగాల్లో ఎన్నో అవార్డులు వచ్చాయని చెప్పారు. ఐటీ రంగం దేశంలో ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్‌పై విష ప్రచారం చేస్తున్నారని, వాటిని గులాబీ కార్యకర్తలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. దేశానికే తెలంగాణ దిక్సూచిగా నిలిచిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒక్క మెడికల్ కాలేజీని ఆ బడా నాయకులు తీసుకురాలేదని, కానీ నేడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జగదీశ్ అన్న నేతృత్వంలో రెండు మెడికల్ కాలేజీలు మంజూరు చేశారని చెప్పారు. రాష్ట్రంలో 9 ఏండ్ల కాలంలో తొలివిడతో లక్షా 52 వేలు, రెండో దశలో 85 వేల ఉద్యోగాలు కల్పించినట్టు వివరించారు. ప్రయివేటు రంగంలో 17 లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వీటన్నింటినీ మరిచి హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి తెలంగాణలో నిరుద్యోగ సమస్య ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే పదవుల నిరుద్యోగం ఉందని ఎద్దేవా చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఉపాధి లేక అక్కడి ప్రజలు హైదరాబాద్‌కు వలస వచ్చి కడుపు నింపుకుంటున్నారని, ముందుగా తన రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తీర్చి ఆపై పక్క రాష్ట్రంపై విమర్శలు చేయాలని హితవు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 40, 50 సీట్లలో అభ్యర్థులు లేరని చెప్పారు. ముమ్మాటికీ బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చి దిద్దిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. తొమ్మిదేండ్ల పాలనలో ఆకలి రాజ్యాన్ని పారదోలారని చెప్పారు. దేశానికి తెలంగాణ అన్నం పెడుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులకు నమ్మకం లేకనే ఒక్కొక్క చోట ఒక్కొక్క మాట మాట్లాడుతున్నారన్నారు. ఉమ్మడి జిల్లాలో పెద్ద నాయకులుగా చలామణి అవుతున్న ఆ నలుగురు పదవులు అనుభవించినప్పుడు జిల్లాలో ఫ్లోరిన్, కరువు పెరిగిపోయిందన్నారు. నేడు రాష్ట్రంలో అవి కనుమరుగయ్యాయని, ఆ ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 12 స్థానాల్లో గులాబీ జెండా ఎగురుతుందన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ బండ నరేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు రవీంద్ర కుమార్‌నాయక్, కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భగత్, శానంపూడి సైదిరెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఆగ్రోస్ చైర్మెన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు చింత రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తో నేడు కేజ్రీవాల్ భేటి...


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ శనివారం హైదరాబాద్‌లో భేటీ కానున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో గ్రూప్-ఏ అధికారుల బదిలీలు, నియామకాలు, క్రమశిక్షణ చర్యలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఈనెల 19న ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేసిన సంగతి విదితమే.ఈ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ కేజ్రీవాల్ విపక్షాల మద్దతు కూడగడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన కేసీఆర్‌తో సమావేశం కానున్నారు. ఈ అంశంపై కేజ్రీవాల్ ఇప్పటికే పలువురు విపక్ష నేతలను కలిసి మద్దతు కోరిన సంగతి తెలిసిందే.

పార్లమెంట్ కొత్త భవన ప్రారంభోత్సవం ఇలా..

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవాన్ని ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆదివారం (28న) ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం రెండు దశలుగా ఉండబోతోంది. తొలుత సర్వ మత ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం ఆ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులంతా లోక్‌సభ, రాజ్యసభ ప్రాంగణాలను పర్యవేక్షిస్తారు. కార్యక్రమంలోని రెండో భాగం రాజ్యసభ ఛాంబర్‌లో జాతీయ గీతాలాపనతో మధ్యాహ్నం ప్రారంభమవుతుంది. పార్లమెంట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసే పందిరిలో సంప్రదాయ పూజలు, హోమంతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఇందులో ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయన్ సింగ్, మాజీ ప్రధాని హెచ్ డి దేవగౌడ, సీనియర్ మంత్రులు పాల్గొంటారు. పూజా కార్యక్రమాలు పూర్తికాగానే ఇందులో పాల్గొనే ప్రముఖులంతా కలిసి లోక్‌సభ, రాజ్యసభ ప్రాంగణాలను పర్యవేక్షిస్తారు. ఉదయం ఏడింటికి హోమం జరుగుతుంది. ఆ తరువాత సర్వ మత ప్రార్థనలు జరుగుతాయి. ఉదయం 9:30 గంటల కల్లా తొలి విడత ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తవుతుంది. అనంతరం హోమం వేదిక వద్దే తమిళనాడు తంజావూరు శైవ మఠ పెద్దలు చోళుల రాజదండమైన సెంగాల్‌ను ప్రధాని మోడీకి అందజేస్తారు. లోక్‌సభ ఛాంబర్‌లో స్పీకర్ కుర్చీ వద్ద పవిత్రమైన రాజదండాన్ని (సెంగాల్) ప్రతిష్టిస్తారు. మధ్యాహ్నం రెండో విడత కార్యక్రమం మొదలవుతుంది. మధ్యాహ్న కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ ప్రసంగం ఉంటుంది. రాజ్యసభ చైర్మెన్ జగ్దీప్ ధన్కర్ తరపున అభినందన సందేశాన్ని ఆయన చదివి వినిపిస్తారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లిఖితపూర్వక సందేశాన్ని కూడా ఇదే సందర్భంగా సభలో వినిపిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రూ. 75 నాణేన్ని, ఒక స్మారక తపాలా బిళ్లను ప్రధాని విడుదల చేస్తారు.





కార్యక్రమాన్ని ముగిస్తూ లోక్‌సభ సెక్రెటరీ జనరల్ 'ఓట్ ఆఫ్ థాంక్స్' చెబుతారు.పార్లమెంటు భవనం ప్రధాన ఆర్కిటెక్ట్ బిమల్ పటేల్, పారిశ్రామికవేత్త రతన్ టాటా, పలువురు సినీ, క్రీడా ప్రముఖులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. దాదాపు 20 రాజకీయ పార్టీలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు ప్రకటించాయి. ఎన్డీయే భాగస్వామ్య పార్టీలైన అన్నాడీఎంకే, అప్నాదళ్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, శివసేన షిండే వర్గం, ఎన్‌పీపీ, ఎన్‌పీఎఫ్, ఎన్‌డీపీపీ, ఎస్కెఎం, ఎంఎన్ఎఫ్, జేజేపీ, ఎజెఎస్‌యూ, ఆర్ఎల్జేపీ, ఐఎంకెఎంకె, తమిళ్ మనిలా కాంగ్రెస్, ఎల్జేపీ, ఎస్ఏడీ, వైసీపీ, టీడీపీ, బీజేడీ, బీఎస్పీ పార్టీలు పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంలో పాల్గొంటాయి.

కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంపై పిటిషన్‌ను తిరస్కరణ

నూతన పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేత ప్రారంభించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించింది. అడ్వకేట్ జయ సుకిన్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను శుక్రవారం న్యాయమూర్తులు జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ పిఎస్ నరసింహ ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్‌ను ఎందుకు దాఖలు చేశారో తమకు తెలుసునని పేర్కొంది. దీనిని రాజ్యాంగంలోని అధికరణ 32 ప్రకారం విచారణ జరిపేందుకు నిరాకరించింది. రాజ్యాంగంలోని అధికరణ 79 ప్రకారం దేశానికి కార్యనిర్వాహక అధిపతి రాష్ట్రపతి అని పిటిషనర్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించి ఉండవలసిందన్నారు. రాష్ట్రపతికి కొన్ని అధికారాలు ఉంటాయని, రకరకాల కార్యకలాపాలను నిర్వహిస్తూ ఉంటారని చెప్పారు. ద్రౌపది ముర్మును ఆహ్వానించకపోవడం సరికాదని, ఆదివారం జరిగే పార్లమెంటు భవన ప్రారంభోత్సవం చట్ట ప్రకారం జరగడం లేదని పేర్కొన్నారు. పార్లమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతిని దూరంగా ఉంచడం వెనుక మాల్‌ప్రాక్టీస్ ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించకుండా రాష్ట్రపతిని లోక్‌సభ సచివాలయం, కేంద్ర ప్రభుత్వం అవమానించాయన్నారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేంద్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తూ, ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతిస్తే, దానిని తిరిగి హైకోర్టులో దాఖలు చేస్తారన్నారు. దీంతో ధర్మాసనం ఈ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

అందరికీ ఒకే విద్య

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. దీనివల్ల విద్యావ్యవస్థలో అసమానతలు పెరుగుతాయనీ, అగ్రకులాలు, సంపన్నవర్గాలకే విద్య అందుబాటులో ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మనుస్మృతి ప్రకారం పరిపాలన చేస్తున్నదనీ, ఫలితంగా నిచ్చెనమెట్ల కులవ్యవస్థతో అట్టడుగు కులాలు, వర్గాల ప్రజలు విద్యకు దూరమవుతారని చెప్పారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) కేంద్ర కమిటీ సమావేశాలు ఈనెల 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం 'విద్య, ఉపాధి, పర్యావరణం' అంశాలపై సదస్సును నిర్వహించారు. డీవైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. దేశ సమస్యలపై యువతరం స్పందించాలని చెప్పారు. డీవైఎఫ్ఐ చారిత్రక నేపథ్యం గురించి వివరించారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదం ద్వారా ప్రజల మధ్య విభజన సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నదనీ, రాచరికి, నిచ్చెన మెట్ల వ్యవస్థలకు వ్యతిరేకంగా డీవైఎఫ్ఐ సమరశీల పోరాటాలు చేపట్టాలని ఆకాంక్షించారు. సమాజంలోని ప్రతి అంశంపై యువతరం స్పందించాలని అన్నారు. సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు, లింగవివక్ష లేని విద్యావిధానం ద్వారానే పురోభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కానీ అందుకు భిన్నంగా నూతన విద్యావిధానం-2020 పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యను కొందరికే పరిమితం చేసే కుట్రలు చేస్తున్నదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన పరిధిలో విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం అవుతున్నదని గుర్తుచేశారు. ఇంటర్మీడియట్ కళాశాలల్లో తక్షణం గెస్ట్ లెక్చరర్స్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొఠారి కమిషన్ సిఫార్సుల్ని అమలు చేయాలని కోరారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో కేవలం రంగురంగుల కరపత్రాలు, ప్రకటనలతో విద్యార్థులకు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారనీ,అక్కడ ఉపాధ్యాయులుగా పనిచేసేవారు ఎవరో కూడా విద్యార్థులకు తెలీదన్నారు. నాణ్యమైన విద్యను అందరికీ ఒకే రూపంలో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో గ్రేడింగ్ తేవడం ద్వారా విద్యానాణ్యతను వర్గీకరించే చర్యలకు పాల్పడుతున్నారనీ, ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. రాజ్యాంగం ప్రకారం సమాజంలో అందరికీ సమాన అవకాశాలు లభించాలనీ, దాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ మాట్లాడుతూ విద్య కాషాయీకరణ జరుగుతున్న తీరును వివరించారు. స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రల్ని పాఠ్యపుస్తకాల నుంచి తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మనువాద విద్య సమాజంలో అన్నిరకాల అసమానతల్ని పెంచుతుందని విశ్లేషించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై డీవైఎఫ్ఐ చిత్తశుద్ధితో కూడిన పోరాటాలను చేస్తుందని చెప్పారు. ఈ పోరాటాల్లో ప్రజలు, యువతరం కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ కార్యదర్శి ఏ వెంకటేష్, ఉపాధ్యక్షులు బషీర్, సహాయకార్యదర్శి జావేద్‌తో పాటు ఆఫీస్ బేరర్లు అందరూ పాల్గొన్నారు.

కొత్త పార్లమెంట్ ఎదుటే నిరసన

(మొదటిపేజీ తరువాయి)

భవనం ముందు మహిళా సమ్మాన్ మహాపంచాయత్ జరుగుతుందని, ఇందులో హర్యానా, పంజాబ్ నుంచి వచ్చే రైతు, కూలీ సంఘాల తరపున వేలాది మంది ఉదయం 11:00 గంటలకు సింఘు సరిహద్దుకు చేరుకుంటారని తెలిపారు. మరోవైపు, హర్యానాలోని ఖాప్ పంచాయతీలు, టోల్ ప్లాజాల పోరాట కమిటీల తరపు వేలాది మంది ఉదయం 11:00 గంటలకు టిక్రీ సరిహద్దుకు చేరుకుంటారు. ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చే రైతు సంఘాలు, ఖాప్ పంచాయితీల తరపున వందలాది మంది ఉదయం 11:00 గంటలకు ఘాజీపూర్ సరిహద్దుకు చేరుకుంటారు. వీరే కాకుండా దేశం నలుమూలల నుంచి రైలు, బస్సుల్లో వచ్చే సహచరులు ఉదయం 11:00 గంటలకు జంతర్ మంతర్ వద్ద నిరసన స్థలానికి చేరుకుంటారు. ఢిల్లీలోని అన్ని ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాల నేతలు, కార్యకర్తలు కూడా జంతర్ మంతర్ చేరుకుంటారు. ఉదయం 11:30 గంటలకు పార్లమెంట్ ముందుకు ప్రతిపాదించిన మహిళా సమ్మాన్ మహాపంచాయత్ కోసం మార్చ్ శాంతియుతంగా ప్రారంభమవుతుంది. ఇది పార్లమెంట్ ముందు చేరిన తరువాత సభ జరుగుతుంది. శాంతియుతంగా ఉంటామని, పూర్తి క్రమశిక్షణతో నడుచుకుంటామని రెజ్లర్లు తెలిపారు. పోలీసులు లాఠీ చార్జీ చేసినా, టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించినా, వాటర్ క్యానన్ ప్రయోగించినా, మేం ఎలాంటి హింసా పద్ధతిని అవలంబించం, అన్నింటినీ సహిస్తామని స్పష్టం చేశారు. పోలీసులు అరెస్టు చేస్తే మేమంతా కూడా శాంతియుతంగా అరెస్టు అవుతామని తెలిపారు.

మహాపంచాయత్‌లో మహిళలను సత్కరించాలని మహిళా క్రీడాకారులు దేశవ్యాప్తంగా ఉన్న మహిళలకు పిలుపునిచ్చారు. అంతే కాకుండా దేశంలోని మహిళా ఎంపీలు, ఎమ్మెల్యేలు ఏ పార్టీకి చెందిన వారైనా, ఏ రాష్ట్రానికి చెందిన వారైనా ఈ మహిళా సమ్మాన్ మహాపంచాయత్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపు ఇచ్చారు. ఈ మహాపంచాయత్‌లో ఐదుగురు మహిళా క్రీడాకారులు, మహిళా సంఘాల నాయకులు, గ్రామీణ మహిళలు తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేసి, దేశంలోని మహిళలు పెద్ద నిర్ణయం తీసుకుని న్యాయం చేయాలని కోరనున్నారని తెలిపారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మెజారిటీపై గొప్పలు చెప్పుకుంటోందని అన్నారు. దేశంలోని ఆడబిడ్డలు తమకు న్యాయం చేయాలని వీధుల్లో తిరుగుతున్నా పట్టించుకోవడంలేదుఅని విమర్శించారు. పతకాలు తెచ్చినప్పుడు ఇక్కడ ఆడబిడ్డలకు ఎంతో గౌరవం ఉండేదని, ఇప్పుడు తమను ఎవరూ పట్టించుకోవడం లేదని వీధుల్లో కూర్చునే పరిస్థితి నెలకొందని మహిళా రెజ్లర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన ఎంపీ కావడం వల్లనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ కు స్వేచ్ఛ లభించిందని విమర్శించారు. నిందితుడైనా.. బహిరంగంగా మీడియాలో రెచ్చగొట్టే ఇంటర్వ్యూలు ఇస్తూ దేశ పుత్రికల పరువు తీస్తున్నాడని దుయ్యబట్టారు. ప్రభుత్వ ప్రోద్బలం, రక్షణ వల్లే నిందితులు మహిళలపై దూషణలకు దిగుతున్నారని పేర్కొన్నారు.

పోస్టర్ డిజైన్ పోటీల్లో పాల్గొనండి..

- వికలాంగుల శాఖ ఎండీ శైలజ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆసక్తి గల వికలాంగ అభ్యర్థులు, వయో వృద్ధుల, ట్రాన్స్ జెండర్స్ పోస్టర్ డిజైన్ పోటీల్లో పాల్గొనాలని వికలాంగుల శాఖ సంచాలకులు బి శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15ఏండ్ల వయస్సు వారు అర్హులని తెలిపారు. పాటలు, పద్యరచన పోటీలు కూడా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 18ఏండ్ల వయస్సు పైబడిన వారికి షార్ట్ వీడియో మేకింగ్ పోటీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు జూన్ 20లోగా https//forms.gle/eEQCsVdvQbvH8z2tzనందు ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తులు పంపాలని సూచించారు. నోటిఫికేషన్‌ను రద్దు పర్చేందుకు,మార్చేందుకు కూడా పూర్తి అధికారం సంచాలకులకు ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం www.wdsc.telangana.gov.inలోనూ, 9652394751 ను సంప్రదించవచ్చు.

జూన్ 2న సోనియా చిత్రపటానికి పాలాభిషేకం

మధుయాష్కీగౌడ్ పిలుపు

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించిన ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ చిత్రపటానికి జూన్ 2న పాలాభిషేకం చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీగౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఆ నెలలో 20 రోజులపాటు కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానా లను ఏవిధంగా విస్మరించిందో ప్రజలకు వివరిస్తామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీనియర్లతో సమావేశమయ్యారు. అనంతరం మధుయాష్కీ విలేకర్లతో మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి నెల మొదటి వారంలో పార్టీ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రాన్ని దోచుకుని, దాచుకున్న కేసీఆర్ కుటుంబం రాష్ట్ర ప్రజలను విస్మరించిందన్నారు. గతంలో ఆంధ్రా వాళ్ళు దోచుకున్నారని విమర్శలు చేసిన సీఎం కేసీఆర్ ఇప్పుడు వాళ్లకే దోచిపెడుతున్నారని ఎద్దేవా చేశారు. రానున్న కాలంలో ఇరవై రోజులపాటు ప్రతీ ఇంటిపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. త్వరలో బీసీ గర్జన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ సభకు కర్నాటక సీఎం సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను ఆహ్వానిస్తామన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని చూపిస్తూ కేసీఆర్ దళితులను మోసం చేసే విధానాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు.

పార్లమెంటు భవన ప్రారంభోత్సవాన్ని బహిష్కరిస్తున్నాం : ఉత్తమ్

పార్లమెంట్ నూతన భవనం ప్రారంభోత్సవాన్ని కాంగ్రెస్ పార్టీ బహిష్కరిస్తున్నట్టు ఎంపీ ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. మోడీ భారత రాజ్యాంగాన్ని అవమానపరుస్తున్నారని విమర్శించారు. భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకపోవడం దారుణమని చెప్పారు. పార్లమెంట్ భవన శంకుస్థాపన సమయంలో కూడా ఆనాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఆహ్వానించ లేదని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రధాని కించపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ పార్లమెంట్‌కు రావడం అరుదుగా జరుగుతున్నదని ఎద్దేవా చేశారు.

గోల్కొండ కోటలో బీజేపీ జెండా ఎలా ఎగురవేస్తారు : వీహెచ్

నిజాంను వ్యతిరేకి స్తున్న బీజేపీ నేతలు ... గోల్కొండ కోటలోవారి పార్టీ జెండా ఎలా ఎగుర వేస్తారని మాజీ ఎంపీ వి హనుమంతరావు ప్రశ్నిం చారు. తెలంగాణ తెచ్చింది ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. హైదరాబాద్ పాతబస్తీలోనూ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణలోనూ కర్నాటక ఫలితాలు : శ్రీధర్‌బాబు

మన రాష్ట్రంలో కూడా కర్నాటక ఫలితాలు పునరావృత్తం అవుతాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు.

దేశంలో బీజేపీపై వ్యతిరేకత ఉందన్నారు. తొమ్మిదేండ్లకాలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేసిందో చెప్పేందుకు కార్యా చరణ రూపొందిస్తామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలతో పాటు, కాంగ్రెస్ చేయబోయే కార్యక్రమాలను ప్రజల్లో కి తీసుకెళతామన్నారు.

జీవో 111 రద్దుపై

కాంగ్రెస్ నిజనిర్ధారణ కమిటీ చైర్మెన్‌గా కోదండరెడ్డి

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

జీవో 111 రద్దు నేపథ్యంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటైంది.

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సూచనమేరకు కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

కమిటీకి పార్టీ సీనియర్ నేత కోదండరెడ్డి చైర్మెన్‌గా వ్యవహరించ నున్నారు. సభ్యులుగా రామ్మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్, ఆర్థిక వేత్త లుబ్నా శర్వాట్, డా. జస్వీన్ జైరథ్ తదితరులు వ్యవహరించనున్నారు.

నేడు, రేపు మహానాడు

- భారీ ఏర్పాట్లు
- తెలంగాణ ప్రతినిధులూ హాజరు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

తెలుగుదేశం జాతీయ మహానాడు చరిత్రలో నిలిచిపోయేలా ఈ ఏడాది ఆ పార్టీ ఏర్పాట్లు చేసింది. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరి నాలుగు లైన్ల జాతీయ రహదారి చెంతనే శని, ఆదివారాల్లో ఈ మహానాడును అద్భుతంగా నిర్వహించేందుకు ఆ పార్టీనాయకత్వం సన్నాహాలు చేపట్టింది. తెలంగాణ నుంచి కూడా భారీస్థాయిలో మహానాడు కు హాజరుకానున్నారు. ఆ పార్టీ అధినేత ఎన్. చంద్రబాబు నాయుడు తోపాటు తెలంగాణ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఇప్పటికే రాజమండ్రికి చేరుకున్నారు. అదీగాక టిడిపి పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు శతజయంతి ముగింపు కార్యక్రమం కూడా ఈ మహానాడులోనే నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతిష్టాత్మకంగా ఈ మహానాడును చేపడుతున్నారు. గోదావరి జిల్లాలో టీడీపీని బలోపేతం కావడానికి ఈ మహానాడు దోహదపడనుందని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.ఎన్నికల సంవత్సరంలో జరిగే ఈ మహానాడులో టీడీపీ తొలి మ్యానిఫేస్టోను రాజమండ్రి మహానాడులో ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో 2006 మే 27,28,29 తేదీల్లో మహానాడు నిర్వహించారు. గత మహానాడు నిర్వహణలో కీలక పాత్ర పోషించిన రాజ మహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి ఆ అనుభవంతో ఇప్పుడు ఏర్పాట్లు చేస్తున్నారని ఆపార్టీ నేతలు అంటున్నారు. 38 ఎకరాల విశాలమైన స్థలంలో ఆదివారం మహానాడు సభ జరగనుంది. ఆరోజు 10 నుంచి 15 లక్షల మంది హాజరవుతారని ఆ పార్టీ నాయకత్వం అంచనా వేస్తున్నది. శనివారం భూ లోకమ్మ గుళ్ళ సమీపంలో టీడీపీ ప్రతినిధుల సభ సుమారు 15 వేల మందితో నిర్వహిస్తున్నారు. అక్కడ అధునాతన సౌకర్యాలతో హైదరాబాద్‌కు చెందిన కేకే ఈవెంట్ సంస్థ టెంట్లు ఏర్పాట్లు చేసింది.వర్షాన్ని, ఎండను తట్టుకునేలా రూపొందించారు. రక్తదానం శిబిరం, ఫోటో ఎగ్జిబిషన్, ప్రెస్ గ్యాలరీ, భోజన హాళ్లను అద్భుతంగా తీర్చిదిద్దారు. గోదావరి రుచులను, ఆతిథ్యాన్ని ఈ మహానాడులో రుచి చూపించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి టీడీపీ అభిమానులు, నాయకులు తరలిరానుండగా రాజమహేంద్రవరంతో పాటు పరిసర ప్రాంతాల్లోని హెూటళ్ళు, కళ్యాణ మండపాలు, గెస్ట్ హౌస్‌లన్నీ పది రోజులు క్రితమే బుక్కైపోయాయి. ఇదిలా ఉండగా మహానాడు జరిగే ప్రదేశాలతో పాటు జాతీయ రహదారి పొడవునా భారీ ఫ్లెక్సీలను కటౌవుట్లను ఏర్పాటు చేశారు. అలాగే రాజ మహేంద్రవరం నగరమంతా టీడీపీ జెండాలు రెపరెపలాడుతున్నాయి.

పొలిట్‌బ్యూరో భేటీ

శని, ఆదివారాల్లో జరగనున్న మహానాడు నేపథ్యంలో రాజమండ్రి సరోవర్ హెూటల్లో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, ఏపీ అధ్యక్షులు ఎ.అచ్చెన్నాయుడుతో ఇతర పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అరవింద్‌కుమార్ గౌడ్ తదితరులు సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా మహానాడు షెడ్యూల్‌ను ఖరారు చేశారు. అందులో చేయాల్సిన తీర్మానాలపై చర్చించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, పునర్విభజన ఇబ్బందులు మహానాడులో చర్చించే అవకాశం ఉంది.

బీఆర్‌ఎస్‌లోకి ప్రవీణ్ షిండే

కేసీఆర్ సమక్షంలో చేరిన శివసేన నేత కండువా కప్పి ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

బీఆర్‌ఎస్ పార్టీలోకి మహారాష్ట్ర నుంచి చేరికల పరంపర కొనసాగుతూనే ఉన్నది. మహారాష్ట్ర సౌత్ వెస్ట్ నాగపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన, ఆ ప్రాంత ప్రజల్లో రాజకీయ పట్టున్న శివసేన పార్టీ (షిండే గ్రూపు) సీనియర్ నేత ప్రవీణ్‌షిండే శుక్రవారం బీఆర్‌ఎస్ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సమక్షంలో చేరారు. వారితో పాటు పలువురు మహారాష్ట్ర నేతలకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సీఎం ఆహ్వానించారు. కాగా నాగ్‌పూర్ సౌత్ ఈస్ట్ నియోజకవర్గం నుంచి ప్రస్తుతం బీజేపీ నేత మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రాతినిథ్యం వహిస్తున్నారు. దాంతో ప్రవీణ్ షిండే చేరిక ప్రాధాన్యత సంతరించుకున్నది.

వీరితో పాటు ధవలయన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విక్రమ్ పిస్కే, పద్మశాలి యువసేన వ్యవస్థాపకుడు గౌతమ్‌సంగ, వ్యాపారవేత్త రఘురాములు కందికట్ల, సామ్రాట్ మౌర్యసేన అధ్యక్షుడు మహారాష్ట్ర అర్జున్ సల్గర్, బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు వైభవ్ షెట్, వదార్ సమాజ్ మహారాష్ట్ర కార్యదర్శి రాజు లింబోల్, శివానంద్ దారేకర్, మోచి సమాజ్ కార్యదర్శి మార్కండే షెర్ల, రాజుఅసడే, రవి మేత్రే, సిద్రామ్ మైత్రే, శ్రీకాంత్ రౌత్, మనోజ్ డిగే, కిసాన్ నై, బాలకృష్ణ నై, మహేష్ డోలారే, రూపేష్ రాక్రే, మనీష్ గావండే, గిరిరాజ్ మర్దా, అభిజిత్ పవార్, ఆశిష్ షిండే, అంబాదాస్ తాడ్గొపుల్, ఆకాశ్ భవర్ తదితరులు చేరారు.

మహారాష్ట్ర సాంప్రదాయ పద్ధతిలో సీఎం కేసీఆర్‌ను వారు గొంగడితో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, దండేవిఠల్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్కసుమన్, మర్రి జనార్ధన్‌రెడ్డి, మహారాష్ట్ర బీఆర్‌ఎస్ సీనియర్ నేత శంకరన్న డోంగ్రే తదితరులు పాల్గొన్నారు.

ఇండియా-అమెరికా వాణిజ్యం భారీగా పెరుగుతోంది

- అమెరికా అంబాసిడర్ ఎరిక్ గ్రాసెటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇండియా, అమెరికా మధ్య వ్యాపారం విపరీతంగా పెరుగుతోందని ఇండియాలో అమెరికా అంబాసిడర్ ఎరిక్ గ్రాసెటీ అన్నారు. ఇందుకు రెండు దేశాలు తీసుకున్న చొరవ కారణమని అన్నారు. టీ-హబ్‌లో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..'ఇండియా ఎకానమీ అద్భుతంగా ఎదుగుతోంది. హైదరాబాద్ సాధించిన ప్రగతి ఇందుకు నిదర్శనం. ఒకప్పుడు మన దేశాల మధ్య వ్యాపారం దాదాపు సున్నాగా ఉండేది. అమెరికా గతేడాది భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ఇరు దేశాల బిజినెస్ విలువ 191 బిలియన్ డాలర్లు దాటింది. మా దేశంలో రెండు లక్షల మంది భారతీయ విద్యార్థులు చదువుతున్నారు. త్వరలో జరగబోయే మోడీ-బైడెన్ భేటీలో వాణిజ్యంపై ప్రధానంగా చర్చ జరగనుంది. టీ-హబ్ ప్రపంచంలోనే అతిపెద్ద ఇంక్యుబేటర్. ఐడియాలను ఇది బిజినెస్‌లుగా మార్చుతోంది. పెద్ద ఎత్తున ఉద్యోగాలను కల్పిస్తోంది' అని ఆయన వివరించారు. తాను టీనేజ్‌లో ఉన్నప్పుడే భారతదేశానికి వచ్చానని, ఈ దేశం గురించి ఎంతో తెలుసుకున్నానని చెప్పారు. గతంలో భారత్ ప్రపంచానికి ఎన్నో ఇచ్చిందని, ఇప్పుడూ ఇస్తోందని అన్నారు. అమెరికా వీసాలకు భారీగా డిమాండ్ ఉందని, వీటిని త్వరగా జారీ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా రాబోయే మూడు నెలల్లో అపాయింట్‌మెంట్ల సంఖ్యను భారీగా పెంచుతున్నామని, హైదరాబాద్‌లో వీసా ఆఫీసర్ల సంఖ్యను రెట్టింపు చేస్తామని ఎరిక్ వెల్లడించారు.

మరో 20 మంది బాలలను రక్షించినఏహెచ్‌టీ అధికారులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం అధికారులు మరో 20 మంది బాల, బాలికలను వెట్టిచాకిరి నుంచి రక్షించారు. వీరిని అక్రమంగా తీసుకొచ్చి పని చేయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా శ్రీరామపురంలో ఇసుక బట్టీల్లో అక్రమంగా బాల,బాలికల చేత వెట్టి చాకిరి చేయిస్తున్నారనీ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం అధికారులకు సమాచారమందింది. దీంతో అక్కడ దాడులు నిర్వహించిన అధికారులు మొత్తం 20 మంది బాలలను రక్షించారు. ఇటు బట్టీల్లో పని చేస్తున్న వీరిలో 13 మంది బాలికలు, ఏడుగురు బాలురు ఉన్నారు. వీరిని బయటి రాష్ట్రాల నుంచి నరసింహ అనే కాంట్రాక్టర్ అక్రమంగా తీసుకొచ్చి పని చేయిస్తున్నారని విచారణలో తేలింది. దీంతో అధికారులు నరసింహతో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పొంగులేటి హస్తం వైపేనా..?

చర్చనీయాంశంగా అనుచరుడు కాని అనుచరుడి చేరిక

రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో మట్టా దయానంద్ చేరిక

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అనుచరుడిగానీ అనుచరుడిగా ఉన్న సత్తుపల్లి నియోజకవర్గ నేత మట్టా దయానంద్, రాగమయి దంపతులు శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, మరికొందరు నేతల సమక్షంలో దయానంద్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కారణాలు ఎలా ఉన్నా కొంతకాలంగా పొంగులేటికి దూరంగా ఉంటున్న దయానంద్ కాంగ్రెస్‌లో చేరడంపై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. శ్రీనివాసరెడ్డి రాజకీయ వ్యూహంలో భాగంగా దయానంద్ ముందుగానే హస్తం గూటికి చేరాడా? లేక సొంత ఎత్తుగడలో భాగంగా చేరారా.. అన్నది తెలియాల్సి ఉంది. దయానంద్ చేరికతో పొంగులేటి అడుగులు కాంగ్రెస్ వైపు పడనున్నాయనే దానికి సంకేతంగా పలువురు భావిస్తున్నారు. దయానంద్‌తో పాటు ఆయన భార్య రాగమయి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, ఆత్మ కమిటీ మాజీ చైర్మెన్ రామకృష్ణ, మరికొందరు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

కాగా, ఒక దశలో పొంగులేటి బీజేపీలో చేరతారానే వాదన బలంగా వినిపించడంతో ఆయన ప్రధాన అనుచరగణంలో ఒకరైన మట్టా దయానంద్ దాన్ని వ్యతిరేకించారు. బీజేపేతర పార్టీ అయితేనే తన పయనం పొంగులేటితో కొనసాగుతుందని కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. అయితే రాజకీయం కంటే ఆర్థిక అంశాలే శ్రీనివాసరెడ్డికి దయానంద్‌కు మధ్య దూరాన్ని పెంచాయని ఆయన అనుచరగణం అంటోంది. పొంగులేటి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన నాటి నుంచి ఆయన వెంట నడిచేందుకు సిద్ధమైన పెనుబల్లి మండలానికి చెందిన పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ కొల్లూరు సుధాకర్ ఇటీవల ఉద్యోగానికి రాజీనామా చేశారు. మట్టా దయానంద్‌కు ప్రత్యామ్నాయంగా సుధాకర్‌ను ముందుకు తెచ్చినట్టు ప్రచారం ఉంది. దయానంద్ కాంగ్రెస్‌లో చేరడంతో పొంగులేటి కూడా అటువైపే పయనిస్తారా? కాంగ్రెస్‌లో చేరితే సత్తుపల్లి టిక్కెట్ ఎవరికి ఇప్పిస్తారు? ఇప్పటికే మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అక్కడి నుంచి టిక్కెట్ ఆశిస్తున్నారు. పొంగులేటి గ్రూపులో ఉన్న ఎస్సీ కమిషన్ మాజీ చైర్మెన్ పిడమర్తి రవి కూడా గతంలో ఇక్కడి నుంచే పోటీ చేశారు. పొంగులేటి కాంగ్రెస్‌లో చేరితే సత్తుపల్లి అసెంబ్లీ టిక్కెట్‌కు తీవ్ర పోటీ తప్పేలా లేదు. ఒకవేళ పొంగులేటి కాంగ్రెస్‌లో చేరితే మాత్రం కొల్లూరు సుధాకర్‌కే తొలి ప్రాధాన్యం ఉంటుందని ఆయన అనుచరగణం అంటోంది.

లక్ష కోట్ల ఆస్తి రూ.7 వేల కోట్లకే..

(మొదటిపేజీ తరువాయి)

ఆయన వ్యాఖ్యానించారు. అటువంటి నిబంధనలు లేవంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బుకాయించారని ఎద్దేవా చేశారు. డబ్బు చెల్లింపులకు సంబంధించి కన్సెషన్ అగ్రిమెంట్‌లో స్పష్టంగా ఈ నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నారు. 'అగ్రిమెంట్‌లోని 20, 21 పేజీలో మేం చెప్పిన నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. నేను చెప్పింది 10 శాతమే కానీ వాస్తవంగా 30 రోజుల్లో 25 శాతం టెండర్ పొందిన సంస్థ చెల్లించాలి. మిగతా 75 శాతాన్ని 120 రోజుల్లో చెల్లించాలి.ఒకవేళ నిబంధనలు ఏమైనా మార్చి ఉంటే, ఆ మార్చిన నిబంధనలు ఏమిటో బయటపెట్టాలి. నేను బయట పెట్టిన కన్సెషన్ అగ్రిమెంట్ నిజమా? కాదా? చెప్పాల్సిన బాధ్యత అరవింద్ కుమార్, సోమేశ్ కుమార్‌పై ఉంది' అని ఈ సందర్భంగా రేవంత్ డిమాండ్ చేశారు. ఒక వేళ టెండర్ నిబంధనలు మారిస్తే ఇది కూడా ఢిల్లీ లిక్కర్ స్కాం తరహా కుంభకోణం అవుతుందన్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ రూపొందించినప్పుడు మొదట్లో నిబంధనలు కఠినంగా ఉంటే, బీఆర్ఎస్ నాయకు రాలు కవిత వెళ్లి లాబీయింగ్ చేసి సౌత్ గ్రూపునకు అనుకూలంగా నిబంధ నలు మార్చేలా చేశారని ఆరోపించారు. లక్ష కోట్ల విలువైన ప్రాజెక్టు లను రూ. 7 వేల కోట్లకే అప్పగించారని విమర్శించారు. దీని మీద బీజేపీ ప్రభు త్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంత బహిరంగంగా దోపిడీ జరుగుతుంటే, బీజేపీ నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈడీ,సీబీఐ దాడులు ఎందుకు నిర్వహించడం లేదని నిలదీశారు.

బీజేపీ, బీఆర్ఎస్ గూడుపుఠానీ

లక్షల కోట్ల ప్రాజెక్టును కేసీఆర్ కుటుంబం దోచుకుంటోందని రేవంత్ విమర్శించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉండి విచారణకు ఎందుకు ఆదేశం ఇవ్వడం లేదని కిషన్ రెడ్డిని నిలదీశారు. ఈ వ్యవహారం వెనుక బీజేపీ, బీఆర్ఎస్ గూడుపుఠానీ ఏమిటి? అని ప్రశ్నించారు. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఓఆర్ఆర్ టెండర్‌పై సీబీఐకి ఫిర్యాదు చేశారనీ, ఆ ఫిర్యాదును బండి సంజయ్, కిషన్‌రెడ్డి నమ్ముతున్నారా? లేదా? స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఓఆర్ఆర్ టెండర్ వ్యవహారాన్ని అంత తొందరగా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒకే తాను ముక్కలని విమర్శించారు. 'తెలంగాణలో బీజేపీది మూడో స్థానమే అని వాళ్ల జాతీయ నాయకులే చెబు తున్నారు. గట్టి నాయకులు 40 మంది లేకుండా ఎలా గెలుస్తామని బీజేపీ నాయకులు అంటున్నారు. కాంగ్రెస్‌ను గెలవకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. ఇప్పటికైనా ప్రజలు ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. బీఆర్ఎస్ ఓడించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే' అని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు.

ప్రభుత్వాలు మాట తప్పినందునే భూపోరాటం

(మొదటిపేజీ తరువాయి)

అండగా నిల్చిందని చెప్పారు. శుక్రవారం వారు భూపోరాట ప్రాంతాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ క్రమంలో పేదలు నాయకులకు స్వాగతం పలికి తాము గుడిసెలు వేసుకున్న స్థలం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో నాగయ్య, వీరయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు నిలువ నీడ లేని పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. బాపురావుపేట్‌లో మాత్రమే కాదు రాష్ట్ర వ్యాప్తంగా పేదలు భూపోరాటం చేస్తున్నారని చెప్పారు. బాపురావుపేట్ శివారులో 27 రోజులుగా ఇండ్ల స్థలాల కోసం పేద కుటుంబాలకు చెందిన మహిళలు వీరోచిత పోరాటం చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పోలీసుల లాఠీలకు వెరవకుండా పేదలు గుడిసెలు వేసుకుని పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జక్కలొద్దిలో 2022 మే 22న ప్రారంభమైన భూపోరాటం రాష్ట్రమంతటా విస్తరించిందని వివరించారు. ఇల్లు లేని ప్రతి కుటుంబానికీ ఇల్లు కట్టిస్తామని చెప్పిన పీఎం మోడీ హామీ ఏమైందని ప్రశ్నించారు. పేదలు పట్టా భూముల జోలికి పోవడం లేదని, ప్రభుత్వ భూములే పంచాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. వారి న్యాయమైన డిమాండ్‌కు సీపీఐ(ఎం) అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అడగక ముందే అన్నీ ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ పేదలకు ఇప్పటి వరకు చేసిందేమీ లేదని విమర్శించారు. పేద కుటుంబాలకు 3ఎకరాల భూమి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వలేదన్నారు. బాపురావుపేట్‌లో ఎప్పుడో 40ఏండ్ల కింద ఎవరికో ఇచ్చిన భూమి, దాన్ని తీసుకున్న వారెవ్వరూ ఇప్పుడు లేరని తెలిపారు. బడాబాబులు ఈ భూమి ద్వారా లబ్ధిపొందాలని చూస్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 58 ద్వారా ఈ భూమిలో పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రకటించిన రూ.3లక్షలకు బదులుగా రూ.5లక్షలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలం దక్కే వరకూ ఇక్కడి నుంచి కదలొద్దని, సీపీఐ(ఎం) అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం కొత్త పథకాలు : వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఓట్ల కోసం కొత్త, పాత పథకాలకు కేసీఆర్ తెరలేపుతున్నారని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు.ఇండ్లకు పైసలిస్తామంటూ, పోడు పట్టాలిస్తామంటూ నమ్మబలుతున్నారని విమర్శించారు. బీసీలకు ఆర్థిక సాయం చేస్తామంటూ కొత్త మోసానికి తెరలేపారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎన్నికల జిమ్మిక్కులను తాము బయట పెడుతామని హెచ్చరించారు.

హైదరాబాద్‌లో స్టీల్‌కేస్ డీలర్‌షిప్ ప్రారంభం

సీటింగ్ వరల్డ్ భాగస్వామ్యంతో ఏర్పాటు

హైదరాబాద్ : అంతర్జాతీయ ఫర్నీచర్ ఉత్పత్తుల తయారీ, రిటైలర్ అయినా స్టీల్‌కేస్ హైదరాబాద్‌లో తన నూతన డీలర్‌షిప్‌ను ప్రారంభించింది. దీన్ని సీటింగ్ వరల్డ్ భాగస్వామ్యంతో అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. జూబ్లిహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ అవుట్‌లెట్‌ను శుక్రవారం స్టీల్‌కేస్ ఆసియా, పసిఫిక్ ప్రెసిడెంట్ ఉలి గ్వినెర్, సీటింగ్ వరల్డ్ రాజేష్ మంగ్నాని లాంచనంగా ప్రారంభించారు.

అమ్మాయిలదే హవా



అబ్బాయిల కంటే 8.01 శాతం అధికంగా ఉత్తీర్ణత

- పాలిసెట్‌లో 82.17 శాతం మంది అర్హత
- ఎంపీసీలో సురభి శరణ్య టాపర్
- ఎంబైపీసీలో చీర్ల ఆకాశ్ ప్రథమం
- ఫలితాలు విడుదల చేసిన నవీన్ మిట్టల్
- జూన్ 14 నుంచి పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2023-24 విద్యాసంవత్సరంలో పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్) ఫలితాలను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ శుక్రవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. పాలిసెట్‌కు 1,05,742 మంది దరఖాస్తు చేస్తే, 98,274 మంది అభ్యర్థులు రాతపరీక్షకు హాజరయ్యారని వివరించారు. వారిలో 80,752 (82.17 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత పొందారని చెప్పారు. ఇందులో అబ్బాయిలు 58,520 మంది దరఖాస్తు చేయగా, 54,700 పరీక్షకు హాజరయ్యారని వివరించారు. వారిలో 43,006 మంది (78.62 శాతం) మంది అర్హత సాధించారని అన్నారు. 47,222 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే, 43,574 మంది పరీక్ష రాశారని చెప్పారు. వారిలో 37,746 (86.63 శాతం) మంది ఉత్తీర్ణత పొందారని అన్నారు. పాలిసెట్‌లోనూ అమ్మాయిలే హవా కొనసాగించారు. అబ్బాయిల కన్నా అమ్మాయిలు 8.01 శాతం అధికంగా ఉత్తీర్ణత పొందడం గమనార్హం. పాలిసెట్‌లో కనీసం 30 శాతం అంటే 36 మార్కులొస్తేనే అర్హత సాధిస్తారని నవీన్ మిట్టల్ చెప్పారు. ఎస్సీ,ఎస్టీలు మాత్రం ఒక మార్కు సాధించినా అర్హులవుతారని వివరించారు. 17,093 మంది ఎస్సీలు పరీక్ష రాయగా, 17,091 మంది అర్హత పొందారని, ఇద్దరు అర్హత పొందలేదని చెప్పారు. 7,861 మంది ఎస్టీలు పరీక్ష రాస్తే, వారందరూ ర్యాంకులు సాధించారని అన్నారు. ఎంపీసీ విభాగంలో సూర్యాపేటకు చెందిన సురభి శరణ్య 120కి 119 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారని చెప్పారు. అదే జిల్లాకు చెందిన షేక్ అబుబాకర్ సిద్దిఖ్ 119 మార్కులతో రెండు ర్యాంకు, 118 మార్కులతో మెదక్ చెందిన గౌడిచర్ల ప్రియాన్ష్ కుమార్, హైదరాబాద్‌కు చెందిన ప్రొద్దటూరి ప్రణీత్, సూర్యాపేటకు చెందిన కైరోజు శశివర్ధన్ మూడో ర్యాంకు పొందారని వివరించారు. ఎంబైపీసీ విభాగంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన చీర్ల ఆకాశ్ 120కి 116 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించారని చెప్పారు. 116 మార్కులతో సూర్యాపేటకు చెందిన మిరియాల అక్షయతార రెండో ర్యాంకు, అదే జిల్లాకు చెందిన కైరోజు శశివర్ధన్ మూడో ర్యాంకు పొందారని అన్నారు. పాలిసెట్ ఫలితాల కోసం https://polycet.sbtet.telangana.gov.in https://polycetts.nic.in వెబ్‌సైట్లను చూడాలని కోరారు. పాలిసెట్ ర్యాంకు ఆధారంగా పాలిటెక్నిక్ కాలేజీలు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవ సాయ విశ్వవిద్యాలయం (పీజేఎస్టీఏయూ), శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ), పివి నరసింహారావు తెలంగాణ పశుసంవర్ధక విశ్వవిద్యాలయం (పీవీఎన్ ఆర్ టీవీయూ) లో డిప్లొమా కోర్సులతోపాటు నాన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామని వివరించారు.

జూన్ 14 నుంచి పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియ వచ్చేనెల 14వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని నవీన్ మిట్టల్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ వంటి ప్రక్రియను వచ్చేనెల 14 నుంచి 18వ తేదీ వరకు చేపట్టాలని సూచించారు. వచ్చేనెల 16 నుంచి 19వ తేదీ వరకు ధ్రువపత్రాల పత్రాల పరిశీలన నిర్వహిస్తామని వివరించారు. 16 నుంచి 21వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని అన్నారు. వచ్చేనెల 25న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. 25 నుంచి 29వ తేదీ వరకు ఫీజు చెల్లింపు, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. జులై ఒకటి నుంచి తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. రెండో తేదీన ధ్రువ పత్రాల పరిశీలన, ఒకటి నుంచి మూడు వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియను చేపట్టాలని కోరారు. ఏడో తేదీన సీట్లు కేటాయిస్తామన్నారు. ఏడు నుంచి పదో తేదీ వరకు ఫీజు చెల్లింపుతోపాటు వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. జులై 12వ తేదీ వరకు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలని కోరారు. అదేనెల ఏడో తేదీ నుంచి విద్యాసంవత్సరం ప్రారంభమవుతుందని వివరించారు. 14వ తేదీ వరకు ఓరియెంటేషన్ తరగతులుంటాయని చెప్పారు. జులై 15 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని అన్నారు. అదేనెల ఏడో తేదీన స్పాట్ అడ్మిషన్ల మార్గదర్శకాలను విడుదల చేస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు https:// tspolycet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండలి (ఎస్‌బీటీఈటీ) కార్యదర్శి పుల్లయ్య, సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ డాక్టర్ సి శ్రీనాథ్, ప్రవేశాల క్యాంపు అధికారి శ్రీనివాస్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొత్తగా మూడు పాలిటెక్నిక్ కాలేజీలు

రాష్ట్రంలో కొత్తగా మూడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు మంజూరయ్యాయని నవీన్ మిట్టల్ చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్, మహేశ్వరంలో ఈ కాలేజీలను ప్రారంభిస్తామని అన్నారు. గత విద్యాసంవత్సరంలో 56 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 12,090 సీట్లు, 64 ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 17,600 సీట్లు కలిపి మొత్తం 29,690 సీట్లున్నాయని వివరించారు.

రాష్ట్రపతిని విస్మరించడం రాజ్యాంగ వ్యతిరేక చర్య

(మొదటిపేజీ తరువాయి)

అంతా వ్యతిరేకించాలని ఖండించాలని కోరారు.

రాజదండం చేతబట్టడం ఫాసిస్ట్ చర్య

ప్రధాని నరేంద్రమోడీ రాజదండంను చేత బట్టడం పూర్తి ఫాసిస్ట్ చర్య అని అన్నారు. రాజరిక వ్యవస్థలో అధికారం దేవుడు ఇచ్చాడనేందుకు గుర్తుగా పండితులు రాజదండంను రాజుకు ఇచ్చే వారని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో రాజదండం ఎలా వాడుతారని అన్నారు. నాడు స్వాతంత్ర్య వచ్చిన కొత్తలో చాలామంది రాజులు ప్రధాని నెహ్రూకు బహుమతులు ఇచ్చారని అందులో బాగంగానే చోళ రాజవంశీయులు రాజదండాన్ని నెహ్రూకు ఇచ్చారని తెలిపారు. తనకు ప్రజలు అధికారం ఇచ్చారు తప్ప దేవుడుకాదని వారు ఇచ్చిన రాజదండాన్ని అలహాబాద్‌లోని మ్యూజియంలో పెట్టించారని అన్నారు. ఇపుడు మోడీ అధికారం దేవుడు ఇచ్చాడని చాటుకునేందుకు మళ్లీ రాజదండం చేతబట్టడం సరైంది కాదన్నారు. హిందూరాజ్యంను పునర్నించాలనే కుట్రలో బాగంగానే రాజదండంను తెరపైకి తెచ్చారని అన్నారు.

అదానీ వ్యవహారంపై జేపీసీ తప్ప మరో మార్గం లేదు

అదానీ కుంభకోణాల విషయంలో ప్రధాని సమాధానం చెప్పకపోవడం బాధ్యతా రాహిత్యమని అన్నారు. లక్షల కోట్ల ప్రజాధనం ఎస్‌బీఐ, ఎల్ఐసీ ద్వారా అదానీకి కట్టబెట్టారని అన్నారు. సుప్రీంకోర్టు వేసిన కమిటీకి సెబి ఆధారాలు ఇవ్వాల్సి వుండగా, సెబి అధికారాలపై మోడి కోత పెట్టారని అలాంటపుడు ఎలా ఆధారాలు వస్తాయని ప్రశ్నించారు. అధికారాలులేని సెబీని అడ్డంపెట్టుకొని క్లీన్‌చిట్ తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. అదానీ వ్యవహారంలో జాయింట్ పార్లమెంటరీ కమిటీ తప్ప మరో మార్గంలేదని తెలిపారు. సెబీకి లేని అధికారాలు కూడా జేపీసీకి వుంటాయని అన్నారు. క్రోనిక్యాపిటల్‌తో దేశంలో పెద్ద దోపిడీ జరుగుతోందని అన్నారు.

నిరంకుశవాదం పెరుగుతోంది

దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వ నిరంకుశవాదం ప్రమాదకరంగా పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ, పాండిచ్చేరి లాంటి రాష్ట్రాలలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల స్థానంలో లెఫ్టినెంట్ గవర్నర్‌ల ద్వారా పాలించుకోవాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీం కోర్టు వ్యతిరేకిస్తూ జడ్జిమెంట్ ఇచ్చిందన్నారు. ఇపుడు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆ తీర్పును నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చి మళ్లీ అధికారాలన్నీ లెఫ్టినెంట్ గవర్నర్‌ల చేతికే ఇచ్చింది. ఇది ప్రమాదకర చర్య అని అన్నారు. ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు.

నోట్ల రద్దు తుగ్లక్ చర్య అని నిరూపణ అయ్యింది

దేశంలో అవినీతిని అరికడతామని, నల్లడబ్బును వెలికి తీస్తామని నరేంద్రమోడీ ప్రభుత్వం చేసిన పెద్దనోట్ల రద్దు ప్రక్రియ తుగ్లక్ చర్య అని నిరూపణ అయ్యిందని తెలిపారు. ఐదు వందల రూపాయలు, వెయ్యి రూపాయల నోట్లు రద్దుచేసి రెండువేల రూపాయల నోటును తేవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించామని అన్నారు.

నోట్లరద్దు ప్రక్రియతో అవినీతి తగ్గకపోగా అవినీతి విలువ పెరిగిపోయిందని అన్నారు. గతంలో వెయ్యి రూపాయలుండేది ఇపుడు రెండువేలు అయ్యిందన్నారు.

9 ఏండ్ల పాలనపై 9 ప్రశ్నలు

- మోడీకి కాంగ్రెస్ సవాల్
- డాక్యుమెంట్ విడుదల

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ నేతృత్వంలోని ప్రస్తుత కేంద్రప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సవాల్ విసిరింది. కాంగ్రెస్.. ప్రధాని మోడీని 9 ప్రశ్నలు అడగాలనుకుంటున్నదని ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ జైరాం రమేశ్ అన్నారు. అలాగే, మోడీ 9 ఏండ్ల పాలనలపై '9 సంవత్సరాలు 9 ప్రశ్నలు' (నౌ సాల్, నౌ సవాల్) డాక్యుమెంట్‌ను తాము విడుదల చేస్తున్నామని చెప్పారు. మోడీ నేతృత్వంలోని తొమ్మిదేండ్ల కేంద్ర ప్రభుత్వ పాలన దేశాన్ని వైఫల్యం, కష్టాలతో నింపిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ప్రభుత్వం తానిచ్చిన హామీలను నెరవేర్చలేదనీ, దేశ ప్రజలు నిరుద్యోగం, జీఎస్టీ, ద్రవ్యోల్బణం, నియంతృత్వ నిర్ణయాలు వంటి వాటిని భరించాల్సి వచ్చిందని తెలిపింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేసింది. "2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని వాగ్దానం చేశారు. అందరికీ ఇండ్లు కల్పిస్తాన్నారు. నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి రూ. 15 లక్షలు ఇస్తామన్నారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు" అని కాంగ్రెస్ పార్టీ గుర్తు చేసింది. గొంతెత్తితే నొక్కేస్తున్నారనీ, ప్రతిపక్ష నాయకులపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఇవి 9 ఏండ్ల పాలనలో వైఫల్యాలు. ప్రజలు వారి(మోడీ ప్రభుత్వం) పట్ల విసుగు చెందారు. మోడీని, ఆయన అవినీతి ప్రభుత్వాన్ని తిరస్కరించిన కర్నాటక ఎన్నికలే దీనికి రుజువు. దక్షిణాది మొదలైన ఈ అసంతృప్తి దేశ మొత్తం వ్యాపిస్తుంది. ప్రజలు ఎదురు చూస్తున్నారు. సరైన సమాధానం ఇస్తారు" అని కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నది. 2014, మే 26న తొలిసారి, 2019, మే 30న రెండో సారి ప్రధానిగా మోడీ ప్రమాణస్వీకారం చేసిన విషయం విదితమే.

పార్ట్‌టైం లెక్చరర్లకు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలో సుమారు 755 మంది పార్ట్‌టైం లెక్చరర్లు పనిచేస్తున్నారని తెలిపారు. వారిలో ఓయూలో 427 మంది, కేయూలో 180 మంది, ఎంజీయూలో 28 మంది, టీయూలో 48 మంది, పీయూలో 52 మంది, ఎస్‌యూలో 20 మంది ఉన్నారని వివరించారు. వారందరినీ సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన సెలెక్షన్ కమిటీ పార్ట్‌టైం లెక్చరర్లుగా ఎంపిక చేసిందని గుర్తు చేశారు. వర్క్‌లోడ్, సరిపడా తరగతుల్లేవనే సాకుతో వారిని పార్ట్‌టైం ప్రాతిపదికనే కొనసాగిస్తున్నారని తెలిపారు. వాస్తవాన్ని పరిశీలిస్తే వివిధ విభాగాల్లో రెగ్యులర్ ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వల్ల పార్ట్‌టైం లెక్చరర్లపై తీవ్ర పనిభారం పెరిగింది తప్ప, తగ్గలేదని పేర్కొన్నారు. వారంతా ఓయూ రూపొందించిన సెలెక్షన్ కమిటీ ద్వారానే నియమించబడినందున తగిన అర్హతలన్నీ కలిగి ఉన్నారని వివరించారు. కావున వారానికి 16 గంటల వర్క్‌లోడ్ ఉన్నచోట పార్ట్‌టైం లెక్చరర్లుగా పనిచేస్తున్న వారందరికీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు (సి)గా పదోన్నతి కల్పించి విద్యాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

64 శాతం మంది వద్ద.. రూ.2,000 నోటు లేదు



న్యూఢిల్లీ : దేశంలో దాదాపు మూడింట రెండు వంతుల మంది వద్ద ఒక్క రూ.2,000 నోటు కూడా లేదని ఓ సర్వేలో వెల్లడయ్యింది. కమ్యూనిటీ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో 64 శాతం మంది తమ వద్ద ఒక్కటి కూడా రూ.2,000 నోటు లేదని తెలిపారు. ఆరు శాతం మంది మాత్రం తమ వద్ద రూ.1 లక్ష అంతకంటే ఎక్కువ ఉన్నట్టు వెల్లడించారు. రూ.2000 నోట్లు ఎంత మంది కలిగి ఉన్నారనే దానిపై లోకల్ సర్కిల్ దేశంలోని 341 జిల్లాల్లోని 57,000 పైగా మంది నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఇందులో 64 శాతం మంది పురుషులు, మిగిలినవారు మహిళలు ఉన్నారు.రూ.2,000 నోటును ఉపసంహరించుకుంటున్నట్లు మే 19న ఆర్‌బిఐ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రజలు తమ వద్ద ఉన్న ఈ నోట్లను బ్యాంకు శాఖలలో మార్చుకోవడానికి లేదా డిపాజిట్ చేయడానికి సెప్టెంబర్ 30 వరకు గడువు ఇచ్చింది. లోకల్ సర్కిల్స్ సర్వే రిపోర్ట్ ప్రకారం.. 15 శాతం మంది వద్ద రూ.20,000 వరకు పెద్ద నోట్లు ఉన్నాయి. ఏడు శాతం మంది వద్ద రూ. 20,000 నుంచి రూ.40,000 మధ్య ఆరు శాతం మంది వద్ద రూ. 40 వేల నుంచి రూ.లక్ష వరకు ఉన్నట్టు తెలిపారు.

రద్దు చేయాలి..

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటన తర్వాత వ్యాపారస్తులు పెద్ద నోట్ల స్వీకరణకు వెనుకాడుతున్నారు. వినియోగదారులు రూ.2,000 నోటుతో చేసే చెల్లింపులను 91 శాతం మంది వ్యాపారస్తులు నిరాకరిస్తున్నారని లోకల్ సర్వేలో వెల్లడయ్యింది. రిటైల్ దుకాణాలు, కెమిస్ట్‌లు, ఆస్పత్రులు, సర్వీస్ ప్రొవైడర్లు, పెట్రోలు పంపుల యాజమానుల వద్ద పెద్ద నోటు చెలామణీకి ఇబ్బందులు పడుతున్నారని తేలింది. రూ.2,000 నోట్లను ఉపసంహరించుకోవాలని ఆర్‌బిఐ నిర్ణయించినప్పటికీ.. దీనికి చట్టబద్ధమైన కరెన్సీగా హామీ ఇవ్వడం జరిగింది. అయినా కొందరు వ్యాపారస్తులు నిరాకరించడం గమనార్హం. రూ.2000 నోటు ఉపసంహరణకు 64 శాతం మంది మద్దతు పలకగా.. 22 శాతం మంది వ్యతిరేకిస్తున్నారు. సెప్టెంబర్ 30 తర్వాత కూడా రూ.2,000 నోటు చట్టబద్ధంగా చెల్లుబాటు కావొచ్చని 68 శాతం మంది అభిప్రాయపడ్డారు. అంతే మంది పెద్ద నోటును రద్దు చేయాలని.. చెలామణీకి అవకాశం ఇవ్వకుండా.. డిపాజిట్‌కు మాత్రమే అనుమతించాలని కోరారు. దాంతో నల్ల ధనం ఉన్న వారు బయటపడుతారని అభిప్రాయపడ్డారు.

ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలి

సమ్మె నివారణకు చొరవ తీసుకోవాలి

- సీఎం కేసీఆర్‌కు సీఐటీయూ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఐకేపీ వీఓఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలనీ, నిరవధిక సమ్మె నివారణకు చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌ను సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ముఖ్యమంత్రికి వారు బహిరంగ లేఖ రాశారు. 'రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో గ్రామ స్థాయిలో 17,606 మంది వీఓఏలు(గ్రామ సంఘాల సహాయకులు) పని చేస్తున్నారు. 19 ఏండ్ల నుంచి మహిళలు ఆర్థికంగా ఎదిగేలా, సామాజికంగా చైతన్యం పొందేలా కృషి చేస్తున్నారు. చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునే విధంగా ప్రభుత్వం ద్వారా లోన్స్ ఇప్పిస్తున్నారు. తిరిగి ఆ రుణాలను సక్రమంగా చెల్లించే విధంగా ప్రోత్సహిస్తున్నారు. డ్వాక్రా మహిళా సంఘాలు నిర్వహిస్తున్న లావాదేవీలన్నీ పుస్తక నిర్వహణ చేస్తూ ఎస్‌హెచ్‌జీ లైవ్ మీటింగ్ పెట్టి అన్ని సంఘాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నారు. ఈ పనులే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇంత శ్రమిస్తున్నా ఐకేపీ వీఓఏలకు సెర్ప్ నుంచి రూ.3,900 గౌరవ వేతనమే చెల్లిస్తున్నారు. ఇటీవల సర్వేలతో వారిపై మరింత భారం పెరిగింది. అతి తక్కువ వేతనం బతకడం వారికి కష్టంగా మారింది. వారి సమస్యలు పరిష్కరించాలని అనేక సార్లు యూనియన్లు, కార్మిక సంఘాలు ప్రభుత్వం దృష్టికి తెచ్చినప్పటికీ పనికి తగిన గుర్తింపు గానీ, శ్రమకు తగిన వేతనం గానీ లభించడం లేదు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న వీఓఏలతో ప్రభుత్వ చర్చలు జరపాలి. వారిని ఉద్యోగులుగా గుర్తించాలి. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి. రూ.10 లక్షల సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి. ఐడీ కార్డులివ్వాలి. అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోషన్స్ కల్పించాలి. యూనిఫామ్ ఇవ్వాలి' అని లేఖలో కోరారు.

ఉక్రెయిన్‌కు 65బిలియన్ల విలువైన ఆయుధ సాయం

అమెరికా రక్షణ కార్యదర్శి



న్యూయార్క్: రష్యాకు, ఉక్రెయిన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు కొమ్ముకాస్తున్న అమెరికా, దాని మిత్ర దేశాలు ఇప్పటివరకు 65 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను సరఫరా చేశాయని అమెరికా రక్షణ కార్యదర్శి లాయిడ్ ఆస్టిన్ ఉక్రెయిన్ డెఫెన్స్ కాంటాక్ట్ గ్రూపు సమావేశంలో చెప్పారు. 31నాటో దేశాలు, కొన్ని అలీన దేశాల కలయిక తో ఏర్పడిన ఈ గ్రూపు 12వ సమా వేశంలో అమెరికా రక్షణ కార్యదర్శి ఈ అంశాన్ని వివరించారు. ఉక్రెయిన్ రష్యాతో చేయనున్న సుదీర్ఘ యుద్ధానికి కావలసిన ఆయుధాలను అందించటానికి అమెరికా సిద్ధంగా ఉందన్నారు.

ఉక్రెయిన్‌కు ఎఫ్-16రకం యుద్ధ విమానాలను కూడా సరఫరా చెయ్యటానికి, వాటిని నడపటానికి ఉక్రెయిన్ పైలట్లకు కావలసిన శిక్షణను ఇవ్వటానికి అమెరికా సిద్ధంగా ఉందని బైడెన్ గతవారం ప్రకటించారు. యుద్ధ విమానాలనే కాకుండా వాయు రక్షణ వ్యవస్థలను, అందుకు కావలసిన ఆయుధాలను సరఫరా చేయటానికి కూడా అమెరికా వెనకాడదని అన్నారు.

ఉక్రెయిన్‌ను సమర్థి స్తున్న పశ్చిమ దేశాలు ఇలా ఆయుధా లను సరఫరా చేస్తూపోతే యుద్ధం మరింత కాలం కొనసాగుతుందనీ, అది ఉక్రెయిన్ సర్వనాశనం కావటా నికి మాత్రమే దారితీస్తుందని రష్యా పదేపదే హెచ్చరిస్తున్నది.

11 లక్షల ఎకరాలకూ ఒకే విడతలో పోడు హక్కులివ్వాలి

తెలంగాణ గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని మొత్తం 11లక్షల ఎకరాల పోడు భూములకు ఒకే విడతలో హక్కు పత్రాలివ్వాలని తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం అధ్యక్షులు ఎం ధర్మానాయక్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు వచ్చినందుకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. జూన్ 24 నుచి 30 వరకు హక్కుపత్రాలు పంపిణీ చేయనున్న నేపథ్యం లో దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ వాటిని పంపిణీ చేయాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ శాసన సభ్యులు జూలకంటి రంగారెడ్డి హాజరై ప్రసంగించారు. 'గిరిజన సంఘాలు, వామపక్ష పార్టీలు సుదీర్ఘకాలం చేసిన పోరాటాల ఫలితంగానే పోడు భుము లకు హక్కుపత్రాలు అందించేందుకు ప్రభుత్వం ముందు కొచ్చింది. రైతులపై పెట్టిన కేసులన్నింటిని బేషరతుగా ఎత్తివేయాలి. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించినట్టుగానే 11 లక్షల ఎకరాల పోడు భూములకు మొదటి విడతలోనే పట్టాలు పంపిణీ చేయాలి. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొంత మందికి మాత్రమే హక్కుపత్రా లు ఇచ్చి చేతులు దులుపు కావాలని చూస్తే మరో పోరాటానికి సిద్ధమవుతాం' అంటూ జూలకంటి ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇప్పటి వరకు జిల్లాలనుంచి అందిన సమాచారం మేరకు కేవలం 4లక్షల ఏకరాలకు మాత్రమే హక్కుపత్రాలు సిద్ధం చేసినట్టు తెలుస్తున్నదని ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ తెలిపారు. శాటిలైట్ మ్యాపులను చూపెట్టి వేలాదిమంది పోడు రైతుల దరఖాస్తులను తిరస్కరించారని ఆరోపించారు. జూన్ 5 నుంచి నెలరోజులపాటు పోడు భూముల ప్రాంతాల్లో పర్యటించి ఎంఆర్వో, కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలనీ, హక్కు పత్రాలు పంపిణీ కార్యక్రమంలో గిరిజన సంఘం కార్యకర్తలు ఎక్కడికక్కడ పాల్గొని హక్కు పత్రాలు సక్రమంగా అందే విధంగా చూడాలని పిలుపు నిచ్చారు.

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లోనే గిరిజన బంధును ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జూన్ 16న రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసనలు తెలపాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వాలని రాష్ట్ర కమిటీలో తీర్మానించినట్టు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై జూలైలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, నాయకులు గుగులోత్ ధర్మ, భూక్యా వీరభద్రం, వాంకడోత్ వీరన్న, కొర్ర శంకర్, ఎం రవి నాయక్, ఎం బాలు, పాండు, గన్యా, శ్రీకాంత్, బాల్యానాయక్, అశోక్, పార్వతి, జ్యోతి పాల్గొన్నారు.

నెలాఖరున హైదరాబాద్‌కు కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యూకే, యూఎస్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ ఈ నెలాఖరున హైదరాబాద్‌కు తిరిగిరానున్నారు. ఈ నాలుగు రోజుల పాటు కేటీఆర్ తన కుటుంబంతో అక్కడ గడపనున్నారు. ఆ తర్వాత ఆయన రాష్ట్రానికి బయలుదేరతారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పెట్టుబడుల ఆకర్షణ కోసం ఈ నెల 16న విదేశాలకు వెళ్లిన కేటీఆర్.. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించి 42 వేల ఉద్యోగాల కల్పనకు కృషి చేశారు. ఇంతకు మూడు రెట్లు పరోక్షంగా ఉపాధి లభించేలా పాటుపడ్డారు.

మంత్రి కేటీఆర్ తన రెండు వారాల పర్యటనలో వివిధ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలతో బిజీగా గడిపారు. ఈ సందర్భంగా 80కిపైగా బిజినెస్ సమావేశాలు, వివిధ అంశాలపై నిర్వహించిన 5 రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పాల్గొన్నారు.

గుడిసెల పోరు ఉధృతం

- పేదలకు అండగా సీపీఐ(ఎం), ప్రజాసంఘాలు
- ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వజాగాల్లో ఉద్యమం
- 50 కేంద్రాలు 850 ఎకరాల్లో గుడిసెలు వేసిన 48 వేల కుటుంబాలు
- పలుచోట్ల పక్కా ఇండ్ల నిర్మాణం, కాలనీల ఏర్పాటు
- పోలీసు బలగాలతో గుడిసెల కూల్చివేత
- అయినా వెనక్కి తగ్గని పేదలు
- 'జాగా వచ్చుడో.. మేం సచ్చుడో' నినాదంతో పోరాటం



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

కూడు, గూడు, గుడ్డ మనిషి కనీస అవసరాలు. కానీ రాష్ట్రంలో పేదల జీవితాలు గూడు లేని పక్షుల వలె చిన్నాభిన్నం అవుతున్నాయి. పల్లె విధ్వంసంతో పట్నాల బాట పట్టిన పేదలది మరీ దయనీయ స్థితి. గూడు లేక నానా అవస్థలు పడుతున్న పేదలు తమకు ఇంటి జాగాలు ఇవ్వాలని గతంలోనూ, ప్రస్తుతమూ ప్రభుత్వాలకు మొర పెట్టుకున్నారు. పెత్తందారులకు, రియల్ఎస్టేట్ వ్యాపారులకు అండగా నిలిచిన పాలకులు పేదల సమస్యను పెడచెవిన పెట్టారు. దీంతో ఎర్రజెండా అండతో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఉక్కుపాదం మోపినా, పోలీసులను ఉసిగొల్పి బుల్ డోజర్లతో దాడి చేసినా.. కుట్రలు పన్ని స్థలాల నుంచి తరిమేందుకు దౌర్జన్యానికి పాల్పడుతున్నా పేదలు వెనక్కి తగ్గటంలేదు. 'జాగా వచ్చుడో.. మేం సచ్చుడో' అనే నినాదంతో పోరును మరింత తీవ్రతరం చేస్తున్నారు. ఎర్రజెండా అండతో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న గుడిసెల పోరాటంపై ప్రత్యేక కథనం.

ఇల్లు లేని నిరుపేదలు రాష్ట్ర వ్యాప్తంగా సర్కారు జాగాల్లో గుడిసెలు వేసి పోరు సాగిస్తున్నారు. ఈ పోరులో రాష్ట్ర వ్యాప్తంగా 50 కేంద్రాలు 850 ఎకరాల్లో సుమారు 48 వేల కుటుంబాలు ఉన్నాయి. ఇంకా కొత్తగా ప్రభుత్వ జాగాల్లో గుడిసెలు వేసుకునేందుకు పేదలు సిద్ధమవుతున్నారు. వారికి అండగా సీపీఐ(ఎం), వ్యవసాయకార్మికసంఘం, ఇతర ప్రజాసంఘాలు అండగా నిలిచాయి. పోరాటంలో భాగస్వాములయ్యాయి. రంగారెడ్డి జిల్లాలోని అబ్దులాపూర్‌మెట్ రెవెన్యూ పరిధిలో సుమారు వంద ఎకరాల భూదాన్ భూముల్లో పేదలు 18 వేల గుడిసెలు వేశారు. ఇక్కడ సుమారు 30 వేల మంది నివాసం ఉంటున్నారు. వీరిని ఖాళీ చేయించేందుకు తాగునీరు అందకుండా ప్రభుత్వం నిర్బంధాలు ప్రయోగిస్తోంది. తాగునీరు ఇచ్చే వారిపై కేసులు పెడుతామని బెదిరింపులకు దిగుతోంది. అయినా ఇంటి జాగా సాధించే వరకూ పోరాడుతూనే ఉంటామని గుడిసెవాసులు ప్రతినబూనారు.

జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రాంతంలో పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్నారు. ఖరీదైన జాగా పేదలకు దక్కొద్దన్న దురుద్దేశంతో స్థానిక ప్రజాప్రతినిధుల అనుచరులు పలుమార్లు గుడిసెలపై దాడులు చేశారు. పోలీసు బలగాలతో గుడిసెలు తొలగించినప్పటికీ అక్కడ గుడిసెవాసులు పట్టు వీడలేదు. ప్రాణాలు పోయినా పర్వాలేదు.. ఇక్కడ నుంచి కదిలేది లేదని తెగేసి చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జక్కలొద్దిలో సర్కారు భూమిలో సుమారు పది వేల గుడిసెలు వేసి ఏకంగా ఆ ప్రాంతానికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రగతినగర్ అని నామకరణం చేశారు. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి, సంగారెడ్డి జిల్లా కంది, జగిత్యాల కోర్టు ప్రాంతం, చెన్నూరు, పెద్దపల్లి, రామగుండం, మహబూబాబాద్ ఇలా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 50 కేంద్రాల్లో పేదలు గుడిసెలు వేసుకున్నారు. ఆ ప్రాంతాల్లోనూ నిత్యం పోలీసులు లాఠీలు ప్రయోగించినా రౌడీలు దౌర్జన్యాలకు పాల్పడినా పేదలు పోరాటం ఆపటం లేదు.

బతుకంతా వీధుల్లోనే ..

ఈ పోరాటంలో కడు పేదరికాన్ని అనుభవిస్తూ అర్థాకలితో అలమటిస్తున్న అసంఘటిత కార్మిక కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయి. పట్టణాలకు వలస వచ్చిన కార్మికుల బతుకంతా వీధి గుడిసెల్లోనే కొనసాగుతోంది. 'నా 70 ఏండ్ల జీవితంలో నేను చేసిన కష్టం పిల్లలను సాకడానికే సరిపోయింది. నాకు ముగ్గురు బిడ్డలు, ఒక కొడుకు. నేను బొంతలు కుడితే వచ్చే ఆదాయంతో పిల్లలకు సరిగ్గా తిండిపెట్టలేని జీవితాన్ని గడిపాను. ఇలాంటి పరిస్థితిలో గూడు కట్టుకునే పరిస్థితి ఎక్కడిది. ఏ ప్రభుత్వం గుంటెడు జాగా ఇచ్చింది లేదు. ఇంటి అద్దె చెల్లించలేక గిప్పుడు ఎర్రజెండోల్లు పేదోల్లకు గుడిసెలు ఇవ్వాలని చేస్తున్న పోరాటంలో ఇక్కడ గుడిసె వేసుకున్నా. నాలుగు నెలలుగా ఈ గుడిసెల్లో ఉంటూ బొంతలు కుడుతూ జీవనం సాగిస్తున్నా. ప్రభుత్వం మా పేదోళ్ల గోస చూసైనా మా గుడిసె జాగాలకు పట్టాలు ఇవ్వాలి' అని బక్కయ్య వేడుకుంటున్నాడు. ఇది కేవలం బక్కయ్య పరిస్థితే కాదు గుడిసెలు వేసుకున్న అందరి పరిస్థితి ఇలాగే ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం తమపై దయ చూపి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గుడిసెవాసులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లా	గుడిసెల కేంద్రాలు	ఎకరాలు	గుడిసెలు
ఖమ్మం	7	29	3656
నల్లగొండ	13	50	830
వరంగల్	19	179	18593
మహబూబ్‌నగర్	3	424	950
మెదక్	1	1.5	138
కరీంనగర్	3	47	5000
నిజామాబాద్	2	13	212
రంగారెడ్డి	1	100	18000
ఆదిలాబాద్	1	7	1000

పలుచోట్ల విజయాలు :

- హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలకేంద్రంలో వ్యకాస ఆధ్వర్యంలో ఎకరన్నర స్థలంలో 250 ఇండ్లు నిర్మించుకుని గృహ ప్రవేశం చేశారు. ఇక్కడ ప్రభుత్వంతో పోరాడి విద్యుత్ కలెక్షన్లు పొందారు.
- కామారెడ్డి జిల్లా జంగపల్లిలో వ్యకాస ఆధ్వర్యంలో 270 ఇండ్లు నిర్మించుకున్నారు.
- కొత్తగూడెంలో 28 ఎకరాల్లో 3,800 గుడిసెలు వేయగా ఇందులో కొందరు పక్కా ఇండ్లు నిర్మించుకున్నారు.
- వరంగల్ జక్కాలొద్దిలో ప్రగతినగర్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీలు ఏర్పడ్డాయి.

ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇంటి జాగాలు ఇవ్వాలి

రాష్ట్రంలో కనీసం తలదాచుకోవడానికి గూడు లేని నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇంటి జాగాలు ఇవ్వాలి. ఇంటి నిర్మాణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలి. కేంద్రప్రభుత్వం పదిలక్షలు ఇవ్వాలి. గతంలో పట్టాలు ఇచ్చి జాగాలు చూపని వారికి కూడా జాగాలు చూపించాలి. రాష్ట్ర వ్యాప్తంగా గూడిసెల పోరాటం చేస్తున్న వారిలో వంద శాతం నిరుపేదలు ఉన్నారు. ప్రభుత్వం వారి దీనస్థితిని అర్థం చేసుకుని అర్హులైన వారందరికీ ఇంటి జాగాలు ఇవ్వాలి.

- బుర్రి ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు

'డబుల్' ఇండ్లలో అక్రమాలపై నిరసన తెలిపిన సీపీఐ(ఎం) నాయకులపై ఎస్ఐ దౌర్జన్యం

- మహిళలను ఈడ్చిపడేసిన పోలీసులు



నవతెలంగాణ-మోతె

డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో అనర్హులను చేర్చారని, అర్హులకు న్యాయం చేయాలని నిరసన తెలిపిన పేదలు, సీపీఐ(ఎం) నాయకులపై ఎస్ఐ దౌర్జన్యం చేశారు. ఇండ్ల వద్ద బైటాయించిన మహిళలను ఈడ్చిపడేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..

సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని విభాలపురం అవాసంనాగయ్యగూడెం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను శుక్రవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వస్తారని తెలిసింది. లబ్దిదారుల లిస్టులో అనర్హులున్నారన్న సమాచారంతో మామిళ్లగూడెం నుంచి వచ్చే దారిలో విభాలపురం ముందు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో లబ్దిదారులు నిరసన తెలిపారు. ఎమ్మెల్యే బుర్కచర్ల నుంచి వస్తున్నారని తెలిసి లబ్దిదారులు డబుల్ బెడ్ రూమ్స్ ముందు నిరసన వ్యక్తం చేశారు. తమకు ఇండ్లు ఇవ్వాలని మహిళలు డిమాండ్ చేశారు. వారిని పోలీసులు ఈడ్చిపడేశారు. ముందుగా అర్హులైన లబ్దిదారులకు లిస్ట్ తయారు చేసి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అతికించారని, ఆ తర్వాత దాన్ని రద్దు చేసి 12 మంది అనర్హులను చేర్చినట్టు ఆరోపించారు. వారికి అండగా ఉన్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, నాయకులపై పోలీసులు దాడి చేశారు. ఈడ్చుకెళ్తూ పిడిగుద్దులు గుద్దారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ రాకపోయినా స్థానిక నాయకులు అధికారులు లేకుండానే ఇండ్లను ప్రారంభించారు. పని ముగించుకొని బయటికి వెళ్తున్న స్థానిక అధికార పార్టీ నాయకులను లబ్దిదారులు అడ్డుకుని.. తమకు న్యాయం చేయాలని అంతవరకు బయటికి పోనీయమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు మాట్లాడుతూ.. తనపై, ప్రజలపై దాడి చేసిన మోతె ఎస్ఐ మహేష్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విభాలపురం, రావిపహాడ్, మోతెలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్దిదారుల నుంచి రూ.7వేలు వసూలు చేశారని ఆరోపించారు. 'డబుల్' ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో అవినీతి, అక్రమాలు జరిగాయని అధికారులకు అనేకసార్లు విన్నవించినప్పటికీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పట్టించుకోలేదన్నారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేసే వరకు పేదల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ముల్కూరు గోపాల్‌రెడ్డి, సభ్యులు నాగంమల్లయ్య, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షులు వెలుగుమధు, చేగువేరా, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు మైనంపాటి వీరారెడ్డి, ఉపాధ్యక్షులు సామిరెడ్డి నవీన్‌రెడ్డి, పనస శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

29న చలో ఇందిరాపార్కు

- మహాధర్నాను వీఓఏలు జయప్రదం చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఐకేపీ వీఓఏల పట్ల రాష్ట్ర సర్కారు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఈ నెల 29న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రకటించారు. దాన్ని ఐకేపీ వీఓఏలంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించి సమ్మెను నివారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కె. రాజ్‌కుమార్ అధ్యక్షతన ఆన్‌లైన్‌లో జరిగింది. అందులో భాస్కర్ మాట్లాడుతూ.. ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలనీ, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సెర్ప్ నుంచి ఐడీ కార్డులివ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. 40 రోజులు సమ్మె చేస్తున్నప్పటికీ రాష్ట్ర సర్కారు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు మహాధర్నాకు పిలుపునిచ్చామని తెలిపారు. ఐకేపీ వీఓఏల యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్వీ. రమ మాట్లాడుతూ 19 ఏండ్ల నుంచి గ్రామాల్లో మహిళల అభ్యున్నతికి వీఓఏలు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. పేదరిక నిర్మూలన కోసం కృషి చేస్తున్న వీఓఏలు మాత్రం పేదరికంలోనే మగ్గుతున్నారని చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్ మాట్లాడుతూ మహిళా సంఘాల పనులే కాకుండా ప్రభుత్వం చేపడుతున్న అన్నిరకాల సంక్షేమ పథకాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని వివరించారు. తక్షణమే వీఓఏల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్న ముఠా అరెస్ట్

- 2.65 టన్నుల నకిలీ విత్తనాలు సీజ్
- అందమైన ప్యాకెట్ల లేబుల్స్‌తో బురిడీ
- అగ్రికల్చర్, సైబరాబాద్ పోలీసుల సంయుక్త ఆపరేషన్
- వివరాలను వెల్లడించిన సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీందర్





నవతెలంగాణ-మియాపూర్

నకిలీ పత్తి విత్తనాలను అందమైన ప్యాకెట్లు లేబుల్స్‌తో రైతులను బురిడీ కొట్టించే ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 2.65 టన్నుల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీందర్ శుక్రవారం వెల్లడించారు. సదాశివారెడ్డి, తాయప్ప, రాంచందర్, సురేష్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. కర్నాటకకు చెందిన కొందరు ఒక బులెరా వాహనం ద్వారా మేడ్చల్-మల్కాజిగిరిలో నకిలీ విత్తనాలను మార్కెట్‌లో అమ్ముతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బాలానగర్, బాచుపల్లి, షాబాద్ తదితర ప్రాంతాల్లో సైబరాబాద్ కమిషరేట్ సిబ్బంది, మేడ్చల్, రంగారెడ్డి వ్యవసాయ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నకిలీ విత్తనాలు అమ్ముతున్న ముఠాను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 85 లక్షల విలువ చేసే నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. బీటీ కాటన్‌కు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉండటంతో ఈ విత్తనాలపై నకిలీ విత్తన తయారీదారులు దృష్టి సారించి, కర్టన్ విత్తనాల పేరుతో వీటిని మార్కెట్‌లో విక్రయిస్తున్నట్టు గుర్తించారు.

షాబాద్‌లో మరో ముఠా అరెస్ట్

ఇదే తరహా షాబాద్‌లో నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుండి 25బాగ్స్‌లో 1,250 కేజీల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. దౌల్తాబాద్‌కు చెందిన గట్టమానేని వెంకట్ రమణను ప్రధాన నిందితుడిగా గుర్తించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ ఆఫీసర్స్ మాట్లాడుతూ.. రైతులను మోసం చేయడానికి ఇలాంటి నకిలీ విత్తనాలను మార్కెట్లోకి తీసుకొస్తున్నారని తెలిపారు. అందమైన ప్యాకింగ్ లేబుల్స్‌తో రైతులను బురిడీ కొట్టిస్తున్నారన్నారు. రైతులు కేవలం గుర్తింపు పొందిన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత విత్తన ప్యాకెట్ కొనుగోలుకు సంబంధించిన రసీదును భద్రపరచాలని తెలిపారు, పంటలో ఏదైనా తేడా వస్తే విత్తన యాక్ట్ ప్రకారం ఆయా డీలర్స్‌పై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఎట్టి పరిస్థితిలో ఇలాంటి లూజు విత్తనాలు లేదా గుర్తింపులేని కంపెనీలకు సంబంధించిన విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని సూచించారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీత, మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి మేరి రేఖ, చేవెళ్ల సహాయ సంచాలకురాలు రమాదేవి, మండల వ్యవసాయ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు జిల్లాల కలెక్టరేట్లను ప్రారంభించనున్న కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్మాణం పూర్తి చేసుకున్న మరో నాలుగు జిల్లాల కలెక్టరేట్లను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రారంభించనున్నారు. జూన్ 4న నిర్మల్‌జిల్లా కలెక్టరేట్, జూన్ 6న నాగర్‌కర్నూల్ జిల్లా కలెకరేట్, జూన్ 9న మంచిర్యాల జిల్లా, జూన్ 12న గద్వాల జిల్లా సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని కేసీఆర్ ప్రారంభించనున్నారు.

యువతకు స్కిల్స్ ఎంతో అవసరం

హైదరాబాద్‌లో జూన్ 3, 4 తేదీల్లో జాబ్ మేళా : కిషన్‌రెడ్డి

నవతెలంగాణ-అంబర్‌పేట

దేశంలో యువత ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే.. స్కిల్స్ ఎంతో అవసరం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని ఎన్ఎస్‌టీఐలో శుక్రవారం జరిగిన కౌశల్ మహోత్సవ్ స్కిల్ డెవలప్‌మెంట్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జూన్ 3, 4 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే జాబ్‌మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరుకావాలని చెప్పారు. ఈ మేళాకు 220 కంపెనీలు వస్తున్నాయని.. దీనిని యువత ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే యువత ఝబంఘ్రుశ్రీ ఝఘ్త్రొఖఇ.అంఎఘఎఅస్ప్రత్ఝశ్రీ.శీతీస్త్ర వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు. 8వ తరగతి పాసైన, ఫెయిలైన 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు గల యువత ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఏమైనా ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్స్ ఉన్నా తీసుకురావాలని, ఒక ఫొటో ఉండాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన కార్యక్రమం రూపకల్పన చేసి స్కిల్ ఇండియా పేరుతో యువతను స్కిల్స్ వైపు నడిపించడం జరుగుతోందని తెలిపారు. సీఎం కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఏ సమావేశానికీ రారన్నారు. శుక్రవారం నిటి అయోగ్ సమావేశానికి కూడా ఆయన రావడం లేదని సమాచారం ఉందని.. ఇది బాధ్యతారహితమైన చర్య అని అన్నారు. సీఎం కేసీఆర్ పార్లమెంట్ ప్రారంభోత్సవానికి రాకపోతే అదేమైనా ఆగుతుందా అని ప్రశ్నించారు. సచివాలయ ప్రారంభోత్సవానికి గవర్నర్ తమిళిసైని ఎందుకు ఆహ్వానించలేదని నిలదీశారు.

ఆర్థిక భారంలో పత్తి రైతులు

- ప్రకృతి వైపరీత్యం.. కలిసిరాని కాలం
- పంట దిగుబడి రాక.. ధర లేక తీవ్ర నష్టం
- నిన్నటి వరకు ఇండ్లలోనే భారీగా నిల్వలు
- ఖరీఫ్ ముంచుకొస్తుండటంతో గత్యంతరం లేక విక్రయం
- పంట నష్టం జరిగినా.. ఆదుకోని ప్రభుత్వాలు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, కౌటాల

పత్తినే జీవనాధారంగా చేసుకొని సాగు చేసిన అన్నదాతలు ఆర్థికభారంలో కూరుకుపోయారు. పంట సాగు ప్రారంభం నుంచే పంట ఎదుగుదలను కోల్పోయింది. పూత, కాత దశలోనూ ఎడతెరిపిలేని వర్షాలు కురవడంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరానికి కనీసం 10క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. 5 నుంచి 6క్వింటాళ్ల వరకు మాత్రమే వచ్చింది. వచ్చిన పంటను మార్కెట్‌లో అమ్ముకుందామంటే సరైన ధర లేకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొన్నారు. మంచి ధర వచ్చినప్పుడు విక్రయిద్దామని రాష్ట్ర వ్యాప్తంగా నెలల తరబడి ఇండ్లల్లోనే పత్తిని నిల్వ చేశారు. మళ్లీ పత్తి గింజలు నాటే కాలం వచ్చినా.. పత్తికి ధర పెరగకపోగా మరింత తగ్గింది. దాంతో గత్యంతరం లేక వచ్చినకాడికి పంటను అమ్మేస్తున్నారు. తీవ్ర నష్టాలను మూటగట్టుకున్నారు.


ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి పంటను పరిశీలించగా.. అధిక శాతం జిల్లా రైతాంగం ఈ పంటపైనే ఆధారపడి జీవనం సాగిస్తోంది. కిందటేడాది ఉమ్మడి జిల్లాలో సుమారు 11లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. ఈ లెక్కన సుమారు 80లక్షల క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ 2022-23 ఖరీఫ్ ప్రారంభం నుంచి అధిక వర్షాలు రైతులను నిండా ముంచాయి. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా పొలాల్లో నీళ్లు నిల్వ ఉండి పోయాయి. రోజుల తరబడి నీళ్ల నిల్వ ఉండటం కారణంగా మొలకలు మురిగిపోయి ఎదుగుదల లోపించింది. ఒక్కో రైతు రెండు నుంచి మూడు సార్లు విత్తనాలు వేయాల్సి వచ్చింది. ఇదే నష్టం అనుకుంటే.. పంట ఎదిగిన దశలోనూ రోజుల తరబడి వర్షాలు కురవడంతో పూత, కాత రాలిపోయి దిగుబడిపై ప్రభావం చూపించింది. పత్తి తీసే వరకు వర్షాలు కురుస్తూనే ఉండటంతో రోజుల తరబడి చేన్లకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ఎకరానికి 5 నుంచి 6క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వచ్చిన పంటను అమ్ముకుందామన్నా మార్కెట్‌లో సరైన ధర లేకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఆదిలాబాద్ జిల్లాలో 4లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఎకరానికి 8క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తుందని అంచనా వేస్తే సుమారు 32లక్షల పంట దిగుబడి రావాల్సి ఉంది. కానీ 15 నుంచి 16లక్షల క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ఇందులో కేవలం 10లక్షల క్వింటాళ్లు మాత్రమే మార్కెట్‌కు వచ్చింది.

మహారాష్ట్రకు తరలిన పత్తి..!

ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.6380 నిర్ణయించగా.. మార్కెట్‌లో తొలుత క్వింటాల్‌కు రూ.8500వరకు పలికింది. కొన్ని రోజులు మాత్రమే నిలకడగా ఉన్న ఈ ధర అనతి కాలంలోనే రూ.7950కి దిగజారింది. ధర తగ్గుముఖం పట్టడంతో రైతులు పత్తిని విక్రయించలేదు. కొందరు రైతులు మహారాష్ట్రలోని సమీప మార్కెట్‌లకు తరలించి అనువైన ధరకు పత్తిని విక్రయించారు. చాలా మంది రైతులు నెలల తరబడి క్వింటాళ్ల పంటను ఇంట్లోనే నిల్వ ఉంచారు. ధర మరింత తగ్గుతూ రూ.6600కి పడిపోయింది. దీంతో దిగులు చెందిన అన్నదాతలు మార్కెట్‌కు తరలించి తక్కువ ధరకు విక్రయించారు. ఈ నెల 30వ తేదీ వరకే మార్కెట్లు తెరిచి ఉండే అవకాశం ఉండటంతో పత్తిని అలాగే ఉంచితే ఇబ్బందులు వస్తాయని భావించి గత్యంతరం లేక తక్కువ ధరకు విక్రయించాల్సి వచ్చింది. ప్రభుత్వరంగ సంస్థ సీసీఐ వాణిజ్యపరంగా కొనుగోళ్లు చేపడతామని చెప్పినా ప్రయివేటు వ్యాపారులతో సమానంగా ధర నిర్ణయించడంతో ఈ సంస్థకు రైతులెవరూ పత్తిని విక్రయించలేకపోయారు.

గత్యంతరం లేక విక్రయించాను



ఐదెకరాల్లో పత్తి సాగు చేశాను. సుమారు 50క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. తొలుత క్వింటాల్‌కు రూ.8300 ధరకు రెండు క్వింటాళ్లు విక్రయించాను. ధర పెరుగుతుందనే ఆశతో మిగతా పత్తినంతా ఇంట్లోనే నిల్వ చేశాను. ధరలో తేడా లేకపోవడం.. క్వింటాల్ రూ.6600కు పడిపోవడంతో గత్యంతరం లేక మహారాష్ట్రకు వెళ్లి విక్రయించాను. ఈ ఏడాది ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లింది.

- రైతు నానయ్య- కౌటాల

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పత్తి సాగుకు సరైన ప్రోత్సాహం కల్పించలేదు. కొనుగోలు కోసం బడ్జెట్‌లో నిదులు అధిక మొత్తంలో కేటాయించలేదు. దీంతో మార్కెట్‌లో వ్యాపారులు కూడా మంచి ధర ఇవ్వడం లేదు. ఇంత జరుగుతున్నా కేంద్రం పట్టించుకోకుండా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా సరైన చర్యలు తీసుకోలేదు. పత్తి అమ్మకాలు ముగిసిపోయాయనే కారణంగా జిన్నింగ్ మిల్లులు పత్తి కొనుగోళ్లను నిలిపివేయడం.. ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తుండటంతో ఆందోళన చెందిన అన్నదాతలు పత్తిని విక్రయిస్తున్నారు.

రైతులు పత్తినంతా విక్రయించారు
శ్రీనివాస్, మార్కెటింగ్ ఏడీ, ఆదిలాబాద్

జిల్లాలోని రైతులు 95శాతం పత్తిని విక్రయించారు. ఆదిలాబాద్ జిల్లాలో మార్కెట్‌కు 10లక్షల క్వింటాళ్లకు పైగా పత్తి వచ్చింది. కొందరు రైతులు మహారాష్ట్రలో విక్రయించినట్టు తెలిసింది. ఈ నెల 30వ తేదీతో మార్కెట్లు మూతపడుతాయి. రైతుల వద్ద పత్తి ఉంటే వెంటనే విక్రయించాలి.

జూన్ 6న అరిబండి లక్ష్మీనారాయణ ఐదో స్మారకోపన్యాసం

- ముఖ్యవక్త ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ : రైతు సంఘం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మారుతున్న ప్రపంచం-వాతావరణ పరిస్థితులు, జాతీయ వ్యవసాయ విధానం అనే అంశంపై రాష్ట్రస్థాయి సెమినార్ జూన్ ఆరో తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, అరిబండి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ అరిబండి ప్రసాదరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో సెమినార్‌కు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆ సెమినార్‌లో ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్, అఖిల భారత కిసాన్ సభ జాతీయ కార్యదర్శి డాక్టర్ విజ్జు కృష్ణన్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. వానాకాలం సాగు అంశంపై సెమినార్లో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అగ్రికల్చర్ మేనేజ్మెంట్ డైరెక్టర్ దేవీప్రసాద్ జువ్వాడి, అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అల్దాఫ్ జానయ్య, అఖిల భారత కిసాన్ సభ సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతారని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంలో తీసుకొస్తున్న సంస్కరణలపై ఈ సెమినార్లో చర్చిస్తారన్నారు. వానాకాలంలో రైతాంగం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణులు సూచనలు చేస్తారని అన్నారు. కార్పొరేట్ సంస్థలు విత్తనం నుంచి మార్కెట్ వరకు దాడి చేస్తున్నాయని గుర్తు చేశారు. వ్యవసాయ రంగంపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ తీసుకుంటామన్నారు. ఈ సెమినార్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ కమిటీ ఓబీసీ జాయింట్ కన్వీనర్‌గా బాల్‌రాజ్



నవతెలంగాణ -ఘట్కేసర్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ డిపార్ట్మెంట్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జాయింట్ కన్వీనర్‌గా మండలంలోని ప్రతాప సింగారం గ్రామానికి చెందిన దేరంగుల బాల్‌రాజ్ నియామకమయ్యారు. మేడ్చల్ జిల్లా ఓబీసీ చైర్మన్ గువ్వ రవి ముదిరాజ్ శుక్రవారం బాల్‌రాజ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. తర్వాత బాల్‌రాజ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు నూతి శ్రీకాంత్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు రవి, మేడ్చల్ జిల్లా నియోజకవర్గ కోఆర్డినేటర్, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, ఘట్కేసర్ మండల ఉపాధ్యక్షుడు విజయ్ గౌడ్, ఎస్సీ సెల్ ఘట్కేసర్ మండల అధ్యక్షుడు నాగులపల్లి శ్రీనివాస్, జిల్లా మండల కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఉప్పల్ హిల్స్ కాలనీకి వసతులు కల్పించాలని వినతి



నవతెలంగాణ- ఉప్పల్

ఉప్పల్ హిల్స్ కాలనీకి మౌలిక వసతులు కల్పించాలని ఆ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు బాజే అబ్బయ్య, కురుమ నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు నోముల మైసయ్యలు కోరారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యే సుభాష్ రెడ్డిని శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అబ్బయ్య, మైసయ్యలు మాట్లాడుతూ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను, 300 మీటర్ల వాటర్ పైప్‌లైన్‌లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందకు కృషి చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు మహేష్ రమేష్ సత్తయ్య, లక్ష్మమ్మ వెంకటాచారి లక్ష్మయ్య పాల్గొన్నారు.

శివగంగా పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



నవతెలంగాణ -ఎల్బీనగర్

గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని శంకేశ్వర బజార్ చౌరస్తా శివగంగా సినిమా థియేటర్ పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎస్ఎన్‌డీపీ, జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి కాలనీ మీద నుంచి వచ్చే వరదనీరు శంకేశ్వర బజార్ నుంచి శివగంగా సినిమా థియేటర్ పరిసర కాలనీ నుంచి కిందికి ప్రవహిస్తోందని తెలిపారు. డ్రైన్స్ పనులు పూర్తి కావాల్సి ఉందని చెప్పారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి వరద ముప్పు లేకుండా పనులు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కోదండరాంనగర్ కాలనీ, రెడ్డి బ్రదర్స్ గల్లీలను వరద ముప్పు నుంచి కొంతమేర నివారించడం జరిగిందన్నారు. ఈ పనుల్లో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ చీఫ్ ఇంజనీర్ కిషన్, జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్ జియవుద్దీన్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, అధికారులు భాస్కర్ రెడ్డి, అశోక్ రెడ్డి, గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, రమేష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడ శ్రీశైలం యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ రెడ్డి, శివకుమార్, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా కాలనీల అభివృద్ధి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి

నవతెలంగాణ -వనస్థలిపురం

దశల వారీగా డివిజన్‌లోని ప్రతీ కాలనీని అభివృద్ధి చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అన్నారు. డివిజన్‌లోని వీరాం జనేయ కాలనీ, శ్రీనివాస పురం, జక్కిడి నగర్ కాలనీ, అనంత వేణి నగర్, ఆఫీసర్స్ కాలనీ, పద్మావతి కాలనీ, సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేస్ 2, గాంధీనగర్ సౌత్, బీఎన్ రెడ్డి నగర్ ఫేస్ 3, చైతన్య నగర్, కాలనీలలో శుక్రవారం జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ ఏఈ జగన్నాథంతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల్లో రెండు, మూడు రోజుల్లో హై మస్త్ లైట్స్ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.



అనంతరం కాలనీ వాసులు నూతన కరెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌ను కోరారు. స్పందించి కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేస్ 2 అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, శ్రీనివాసపురం కాలనీ అధ్యక్షుడు చిత్రాంజన్, జక్కిడి నగర్ కాలనీ అధ్యక్షుడు యాదిరెడ్డి, పద్మావతి కాలనీ అధ్యక్షుడు రాజు గౌడ్, ఆఫీసర్స్ కాలనీ అధ్యక్షుడు బాలాజీ, అనంత వేణి నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి బాల నరసింహ, వీరాంజనేయ కాలనీ ఉపాధ్యక్షుడు రామయ్య, కాలనీ సభ్యుడు సత్యనారాయణ, జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ జానకీరామ్, కోటయ్య పాల్గొన్నారు.

ప్రయివేట్ ఇంజనీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోండి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రయివేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు డొనేషన్ల పేరుతో విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న లక్షలాది రూపాయల దోపిడిని అరికట్టాలని ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. శుక్రవారం ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో జేఎన్టీయూహెచ్, ఉస్మానియా పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు రాకముందే కొన్ని ప్రయివేట్ ఇంజనీరింగ్ కళాశాలలు వారు మేనేజ్‌మెంట్ సీటు బుకింగ్ పేరిట ఒక్కో సీటుకు రూ.10 లక్షల వరకు డొనేషన్ వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోవడం లేదన్నారు. ర్యాంకులను ప్రమాణంగా విద్యార్థుల అడ్మిషన్లు తీసుకో వడం లేదని.. మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీపై ఉన్నత విద్యామండలి, ఫీజుల నియంత్రణ కమిటీ పర్యవేక్షణ లోపంతో ఆయా కాలేజీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి నిబంధనలు పాటించకుండా, కనీస ప్రమా ణాలు లేకుండా నడుస్తున్న ఇంజనీరింగ్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చాలా ప్రయివేట్ ఇంజనీ రింగ్ కాలేజీలు విద్యార్హత లేని వారిని ప్రిన్సిపాల్, సిబ్బందిని నియమిస్తున్నారని, తనిఖీల సమయంలో ఆయా యాజమాన్యాలు ఇచ్చే మాముళ్లకు తలొగ్గి అధికా రులు అనుమతులు ఇవ్వడంతో ఆ కాలేజీలు అడ్డగోలుగా ఫీజులు పెంచుతున్నాయన్నారు. ఎంసెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభంకాక ముందే బీ కేటగిరి సీట్లను ప్రయివేట్ యాజమాన్యాలను బుకింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే కళాశాలల దోపిడి అరికట్టాలని, డోనేషన్ల పేరిట లక్షలాది రూపాయాలు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దాడులు చేస్తామని రాథోడ్ సంతోష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఏఐటీయూసీ

నాయకుల కృషితో చిన్నారి మృతికి నష్ట పరిహారం



నవతెలంగాణ-హయత్‌నగర్

ఈ నెల 24న హయత్ నగర్ లెక్చరర్స్ కాలనీలో జరిగిన కారు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రవాసి కవిత, రాజు దంపతుల కూతురు లక్ష్మి(03) అనే చిన్నారి మరణించిన విషయం విధితమే. ఈ విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ అబ్దుల్లాపురం మెట్టు మండల్ అధ్యక్షుడు బీటీసీ రంగారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బృందం ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ మేరకు శుక్రవారం ఏఐటీయూసీ నాయకులు ప్రమాద కారకులతో మాట్లాడి నష్ట పరిహారం కింద తక్షణమే రూ.150000, కార్ ఇన్సూరెన్స్ అమౌంట్ రూ.5 లక్షలు ఇచ్చేటట్టు మాట్లాడారు. అక్కడే పని చేస్తున్న మేస్త్రీలు బాలరాజ్, నాగరాజు, మల్లికార్జున, విజయ్‌లు స్వచ్ఛందంగా రూ. 85000 ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దూపం నిరంజన్, కుర్మయ్య సుధాకర్, నర్సింహా పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషిచేస్తా : జెడ్పీచైర్మెన్



నవతెలంగాణ -ఘట్కేసర్

మండల అభివృద్ధికి నా వంతు కృషిచేస్తానని జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్ర రెడ్డి అన్నారు. ఘట్కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథిగా జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. ఘట్కేసర్ మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొనిరావాలని సూచించారు. వాటిని పరిష్కరించేందుకు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అధికారుల పనితీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ కర్రీ జంగమ్మ రైతు సహకార సంఘం బ్యాంక్ చైర్మన్ ఎంఆర్‌ఓ విజయలక్ష్మి, ఎంపీడీవో అరుణ, సర్పంచులు వెంకట్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, యాదగిరి, ఎంపీటీసీలు శోభారాణి, కందుల సరళ, వినోద తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్లను వదిలిపెట్టం

కేసులను ఛేదించిన పోలీసులను అభినందించిన రాచకొండ కమిషనర్



నవతెలంగాణ-హయత్ నగర్

చైన్ స్నాచర్లను వదిలిపెట్టం అని రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహన్ హెచ్చరించారు. శుక్రవారం ఎల్బీనగర్‌లో ఉన్న సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులను ఛేదించిన పోలీసులను కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న జరిగిన బైక్ దొంగతనం కేసులో వెంటనే నిందితులను పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ తిరుపతయ్య, హోమ్ గార్డ్ జగన్..అదేవిధంగా యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 24న జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో తక్షణమే స్పందించి నిందితులను పట్టుకున్న కానిస్టేబుల్ పి. కృష్ణ, హోమ్ గార్డ్ సంతోష్‌లను అభినందించి, నగదు రివార్డులను అందజేసినట్లు తెలిపారు.ఆయన వెంట ఎల్బీనగర్ జోన్ డీసీపీ సాయి శ్రీ, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం రెడ్డి, యాచారం ఇన్‌స్పెక్టర్ లింగయ్య లు ఉన్నారు.

టీఎస్ బీపాస్‌కు తూట్లు

- ప్రభుత్వ భూములు దర్జాగా కబ్జా
- పర్యవేక్షణ లేని నగర ప్రణాళిక విభాగం
- కోర్టు ఉత్తర్వులతో చేతులెత్తేసిన రెవెన్యూ అధికారులు







నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతన పురపాలక చట్టంలో రూపొందించిన టీఎస్ బీపాస్ చట్టానికి పూర్తి స్థాయిలో తూట్లు పడుతున్నాయి. కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబరు 63/1, 63/28 నుండి 63/39 వరకు గల ప్రభుత్వ భూమి రోజు రోజుకూ అన్యాక్రాంతం అవుతుంది. నగర ప్రణాళిక విభాగం అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా టీఎస్ బీ పాస్ ఎక్కడ అమలు కాక పోవడం వలన కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయం పూర్తి స్థాయిలో తగ్గి పోతుందనేది అందరికీ తెలిసిన సత్యమే.

ప్రభుత్వ భూముల్లో దర్జాగా నిర్మాణాలు...

పై సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిలో రోజు రోజుకూ ఇండ్ల నిర్మాణాలను యథేచ్ఛగా చేపడుతున్నారు. రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి గురి అవుతుంటే బాధ్యత వహించాల్సిన రెవెన్యూ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించకపోవడంతో కోట్లు విలువ చేసే భూములు దళారుల చేతిలోకి వెళ్ళి పోతుంది.

కోర్టు ఉత్తర్వుల పేరిటా నిర్మాణాలు...

ప్రభుత్వ భూముల్లో చేపట్టే నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకుండా కబ్జాదారులు న్యాయ స్థానాన్ని ఆశ్రయించి తప్పుడు పత్రాలతో రెవెన్యూ అధికారులు అడ్డుకోకుండా ఉత్తర్వులు తెచ్చుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. కానీ సదరు నిర్మాణాలకు టీఎస్ బీ పాస్ ప్రకారం నిర్మాణ అనుమతులు మాత్రం తీసు కోవడం లేదు. ప్రభుత్వ భూముల కబ్జాపై స్పం దించి చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికా రులు కోర్టు ఉత్తర్వులు ఉన్నాయి కాబట్టి మేం ఎం చేయలేమని చెప్తున్నారు. అదే సందర్భంలో టీఎస్ బీ పాస్ ప్రకారం తీసుకోవాల్సిన నిర్మాణపు అనుమతులను పర్యవేక్షించాల్సిన నగర ప్రణాళిక అధికారులు ఆ స్థలం తమది కాదని చెప్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరీ ఇరు వర్గాల అధికారులు బాధ్యత వహించి ప్రభుత్వ భూమిని కాపాడుతారా లేదా చూడాలి.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనుల పరిశీలన

నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని వైదేహినగర్ నార్త్ కాలనీలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హుడా నిధుల నుండి స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోసం 14లక్షల రూపాయలు మంజూరు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను హుడా ఏఈ జీవన్, నిజముద్దీన్ తో కలిసి బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట వైదేహినగర్ నార్త్ కాలనీ అధ్యక్షుడు పోగుల రాంబాబు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రమేష్ నాయుడు, యూత్ నాయకుడు తుమ్మలపల్లి చరణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన చైతన్య నగర్

నూతన కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ నూతన కాలనీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు శుక్రవారం ఆ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కార్పొరేటర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. తర్వాత కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ అసోసియేషన్లు కాలనీ సమగ్రాభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, కోశాధికారి బుగ్గయ్య, కాలనీ కార్యవర్గ సభ్యులు సంజీవరెడ్డి, జనార్దన్ రెడ్డి, మోహన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'ఆలయాల అభివృద్ధికి కృషి'

నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కేపురం డివిజన్ పరిధి సౌభాగ్యపురం కాలనీలోని శ్రీ అలివేలు మంగ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. పుష్కర బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం చిలుక మధుర ఉపేందర్ రెడ్డి దంపతులు ఉత్సవాలలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు ఉపేందర్ రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సుధాకర్, వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, దేవాలయ మాజీ చైర్మన్ రవీందర్, కోశాధికారి రామ కృష్ణ, చంద్ర కళ మోహన్ గుప్తా, కాంగ్రెస్ నాయకులు పెద్దపూర సైదులు, వంగాల శ్రీకాంత్ రెడ్డి, అనుదీప్, విప్లవ్ పాల్గొన్నారు.


'పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి'



నవతెలంగాణ-సంతోష్ నగర్

ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి కోరారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్ నుంచి ఎర్రకుంట వరకు ఎస్ఎన్‌డీపీ నాలా పనులకు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు తదితర మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఈ అన్సారి, కాలనీ అసోసియేషన్ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షులు రవీందర్ రెడ్డి, శివ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, విశాల్, నాయకులు, కార్యకర్తలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'ఓల్డ్ మలక్ పేట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా'



నవతెలంగాణ-సంతోష్ నగర్

ఓల్డ్ మలక్‌పేట్‌ను ఆదర్శంగా తీర్చి దిద్దుతానని కార్పొరేటర్ ఎండీ సైఫుద్దీన్ షఫీ అన్నారు. డివిజన్ పరిధిలోని పద్మారావు నగర్ కాలనీ పరిసర ప్రాంతాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. డ్రైనేజీ, మంచినీటి సరఫరా, సీసీ రోడ్డు, స్థానిక సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులదే అని సూచించారు. అంతకుముందు స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు కార్పొరేటర్ కు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. తర్వాత కాలనీ పరిసర ప్రాంతాల్లో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తీయించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీ మరమ్మతులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు, సీనియర్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ వర్కింగ్ జర్నలిస్ట్ జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ



నవతెలంగాణ - సంతోష్ నగర్

ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎల్బీనగర్ వర్కింగ్ జర్నలిస్ట్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం చింతలకుంట చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి ఎల్బీనగర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, పూలే, జయశంకర్ సార్, శ్రీకాంతాచారి విగ్రహాల వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. తర్వాత త్యాగ ధనుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ...ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపులో అర్హులైన వారికి ఇండ్ల స్థలాలను మంజూరు చేయాలని సూచించిందని గుర్తుచేశారు. దానిని ప్రామాణికం చేసుకొని ఎల్బీనగర్‌లో స్థానికంగా నివసిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని ఇండ్ల స్థలాల కేటాయింపులో మరొక మారు పునరాలోచన చేసి అర్హులైన జర్నలిస్టులకు స్థలాలు కేటాయించి జీవనోపాధికి తోడ్పడాలని కోరారు. ప్రభుత్వానికి ఇప్పటికే ఎల్బీనగర్ వర్కింగ్ జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యంలో 15 రోజుల నుండి వివిధ రూపాలలో ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగా అధికార పార్టీతో పాటు ప్రతిపక్షాల పార్టీల నాయకులకు కూడా కలిసి తమ బాధలు చెప్పుకున్నామని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ పోరాటాన్ని గుర్తించి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరారు.

పోలీసు భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బలాల



నవతెలంగాణ- సంతోష్ నగర్

మలక్‌పేట్ నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ భవనాన్ని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చెన్నూర్ రూపేష్, మలక్ పేట ఏసీపీ జి.శ్యాంసుందర్, సంతోష్ నగర్ ఏసీపీ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సౌత్ ఈస్ట్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనా గౌస్, సౌత్ రాయణ ఉన్నారు. ముందుగా ఎస్బీహెచ్‌బీ కాలనీలో ఉన్న స్వామివివేకానంద సామాజిక భవనంలో సంతోష్ నగర్ ట్రాఫిక్ ఠాణాను ఏర్పాటు చేసేందుకు నగర కొత్వాల్ సీవీ ఆనంద్ నిర్ణయించగా కాలనీవాసు నిరాకరించారు. వారి విజ్ఞప్తి మేరకు ప్రతిపాదన విరమించుకోవాలని ఎమ్మెల్యే కొత్వాల్‌కు సూచించారు. అందులో భాగంగా మలక్ పేట్ బీ-బ్లాక్స్ సీ-181 నుంచి సీ-184 క్వార్టర్లు సైతం పరిశీలించారు. నిర్వహణకు అనువుగా ఉండటంతో ఏర్పాటుకు పోలీసు అధికారులు సమ్మతించారు. దీంతో బల్దియా పారిశుద్ధ్య సిబ్బంది క్వార్టర్ల శుభ్రతకు ఉపక్రమించారు. ఈ కార్యక్రమంలో అక్బర్బాగ్ కార్పొరేటర్ సయ్యద్ మిన్హాజుద్దీన్, బల్దియా డీఈ బన్సీలాల్, శానిటేషన్ సూపర్వైజర్ గోవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్



నవతెలంగాణ- సంతోష్ నగర్

ఎల్బీనగర్ వర్కింగ్ జర్నలిస్ట్ జేఏసీకి ఇండ్ల స్థలాలను వెంటనే ప్రభుత్వం కేటాయించాలని రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ ఏ.ఎన్. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో ముఖ్య పాత్ర పోషించిన మీడియా ప్రతినిధులు ఈరోజు రోడ్డెక్కే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎల్బీనగర్ ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఈ సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. జర్నలిస్టుల పెన్నుబలం ఎన్నో కుర్చీలను దింపిందని.. ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ఆలోచించి వారికి తగిన న్యాయం చేయాలన్నారు.లేకుంటే తెలంగాణలో మరో ఉద్యమం వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు.

'బస్తీ దవాఖానను మహిళా భవనంలోకి మార్చాలి'



నవతెలంగాణ- ఉప్పల్

చిల్కానగర్ డివిజన్ ప్రజలకు దూరంగా ఉన్న బస్తీ దవాఖానను వెంటనే మహిళా భవనంలోకి మార్చాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యుడు మేకల శివారెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఈ బస్తీ దవాఖానాలో నెలలు దాటినా ఇంకా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా ఉందన్నారు. మందుల కొరత, కనీస నీటి వసతి కూడా లేని పరిస్థితి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్లో అధ్వానంగా మారిన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చిలకానగర్ డివిజన్ అభివృద్ధి పట్ల స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో దాసరి కృష్ణ, బూర్గుల రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ రాజ్యలక్ష్మి, బొల్లం లక్ష్మణ్, పలకల నరసింహారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంజరి సంతోష్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ పాల్గొన్నారు.

థామస్ కుక్ ఎఫ్‌వై 23 నివేదిక

నవతెలంగాణ-హైదరాబాద్

గ్రూప్ ఆపరేటింగ్ ఈబిఐటీడీఏ గణనీయంగా పెరిగి రూ. 2.7 బీఎన్ ఎఫ్‌వై 23కి వ్యతిరేకంగా రూ. ఎఫ్‌వై 22లో 1.2 బి.ఎన్. ఫారిన్ ఎక్స్ఛేంజ్ & ట్రావెల్ బిజినెస్ (థామస్ కుక్) ద్వారా వృద్ధి చెందుతుందిటీ హాస్పిటాలిటీ (స్టెర్లింగ్ సెలవులు) థామస్ కుక్ కోసం ఒక దశాబ్దంలో అత్యధిక ఆపరేటింగ్ ఈబిఐటీడీఏ & ఆపరేటింగ్ పీబీటీ. ఈబిఐటీడీఏ నిర్వహణ రూ. ఎఫ్‌వై 23 కోసం 1.2 బీఎన్; పీబీటీని నిర్వహిస్తోంది రూ.560 ఎంఎన్ వీఎస్ నష్టం రూ. ఎఫ్‌వై 22లో 1.14 బి.ఎన్ స్టెర్లింగ్ హాలిడేస్ ప్రారంభం నుండి అత్యధిక ఈబిఐటీడీఏ & పీబీటీ నమోదు చేసింది: ఎఫ్‌వై 23 కోసం ఈబిఐటీడీఏ రూ.1.1 బీఎన్; పీబీటీ రూ. 659 మిలియన్ వీఎస్ రూ. ఎఫ్‌వై 22లో 436 మిలియన్ల కార్యకలాపాల ద్వారా ఏకీకృత మొత్తం ఆదాయం ఎ23లో 163% పెరిగి రూ. 51 బి.ఎన్.

ఆశా వర్కర్ల పోస్టుల భర్తీకి 27 వరకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ కుషాయిగూడ, చర్లపల్లి , మల్లాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలలో నివసించే మహిళలు ఆశ వర్కర్ ఉద్యోగం కోసం మే 27 తేదీలోపు సంబంధిత యూపీహెచ్‌సీ సెంటర్‌లలో దరఖాస్తు చేసుకోవచ్చని కాప్రా సర్కిల్ ఏఎంహెచ్ఓ స్వప్న రెడ్డి తెలిపారు. దరఖాస్తును మెడికల్ ఆఫీసర్‌కు అందచేయాలని సూచించారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కుషాయిగూడ యూపీహెచ్‌సీ నందు 65, చర్లపల్లి నందు 20, మల్లాపూర్ నందు 22 మొత్తం 107 పోస్టులు కలవని.. అభ్యర్థులు కనీసం పదో తరగతి పాస్ అయి ఉండాలని, ఆపై చదివిన వారు కూడా అర్హులు అని తెలిపారు. అలాగే వయస్సు 25 నుంచి 40 సంవత్సరాలలో లోపు ఉండాల న్నారు. ఆయా యూపీహెచసీ పరిధిలో ఉన్న బస్తీలలో నివసించేవారు ఆశా వర్కర్ల పోస్టులకు అర్హులని తెలిపారు. స్థానిక భాషలో అనర్గళంగా మాట్లాడగలవారై ఉండాలన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు ఫారంతో పాటు రెండు ఫోటో లు, సంబంధిత జిరాక్స్ కాపీలు జతపర్చి సంబంధిత యూపీహెచ్‌సీ సెంటర్ లనందు మెడికల్ ఆఫీసర్‌కు అందజేయాలన్నారు.

కార్మిక శాఖ మంత్రిని కలిసిన వేజ్ బోర్డు మెంబర్ నర్సయ్య



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా పి.నర్సయ్య(నర్సిరెడ్డి)ను తాజాగా తెలంగాణ ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనను శాలువాతో సన్మానించారు.

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా బోనాలు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- ఆషాఢ బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమావేశం



నవతెలంగాణ-బేగంపేట్

తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పే ఆషాఢ బోనాల ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. శుక్రవారం బేగంపేట లోని హరిత ప్లాజాలో జూన్ 2 వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఆషాఢ బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై మంత్రి శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్ర కరణ్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాల పండుగను సీఎం కేసీఆర్ రాష్ట్ర పండుగగా ప్రకటించారని, ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంతో గొప్పగా నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం జూన్ 22 నుంచి ప్రారంభం కానున్న బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం రూ. 15 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. 22న గోల్కొండలో బోనాలు ప్రారంభం అవుతాయని, జులై 9న సికింద్రాబాద్ మహంకాళి బోనాలు, 16వ తేదీన ఓల్డ్ సిటీ బోనాలు జరుగుతాయని వివరించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ సంవత్సరం కూడా బోనాల ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాట్లు చేస్తామని వివరించారు. బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలనే ఆలోచనతో అనేక ప్రయివేటు దేవాలయాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని, తెలిపారు. ఈ విధంగా దేశంలో ఎక్కడా ఏ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడం లేదని తెలిపారు. బోనాల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్ల కోసం సుమారు రూ. 200 కోట్లను ఖర్చు చేయనున్నట్లు వివరించారు. విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఆలయాల పరిసరాలలో పారిశుధ్య నిర్వహణ కోసం జీహెచ్ఎంసీ అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించనున్నట్టు తెలిపారు. ఊరేగింపు నిర్వహించే రహదారులు, ఆలయాలకు వెళ్ళే రహదారులలో అవసరమైన మరమ్మతులు, అభివద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం ఇతర జిల్లాల నుంచి అదనపు పోలీసు సిబ్బందిని నియమించడం జరుగుతుందని, అవసరమైన ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. అలాగే మఫ్టీ పోలీసులు, షీ టీం లను బందోబస్తు విధుల కోసం నియమించనున్నట్టు పేర్కొన్నారు. వివిధ దేవాలయాల భక్తులకు స్వచ్ఛందంగా సేవలు అందించే వాలంటీర్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులను అందజేస్తామని తెలిపారు. స్వచ్ఛందంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్త్ క్యాంప్‌లను ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్ లను కూడా అందుబాటులో ఉంచుతామని అన్నారు.

బోనాల ఉత్సవాల సందర్భంగా గోల్కొండ లోని శ్రీ జగదాం బిక ఆలయంలో, సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి, ఓల్డ్ సిటీ లోని శ్రీ అక్కన్న మాదన్న తదితర 26 దేవాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పించనున్నట్టు మంత్రి చెప్పారు. ఉజ్జయిని మహంకాళి, అక్కన్న మాదన్న, సబ్జిమండి ఆల యాలకు అంబారీ ఊరేగింపు కోసం ఏనుగును ప్రభుత్వమే ఏర్పా టు చేస్తున్నట్టు తెలిపారు. పలు ప్రముఖ ఆలయాల వద్ద సాంస్కృ తిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. దేవాదా య శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బోనాల పండుగ సరిగా జరపలేదని, తెలంగాణా ప్రభుత్వం వచ్చాకే అన్ని ఏర్పాట్లు చేస్తూ వస్తున్నదని అన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు ప్రభాకర్ రావు, సురబి వాణిదేవి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, అరికేపూడి గాంధీ, వాటర్ వర్క్స్ ఎండీ దాన కిషోర్, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు సీవీ ఆనంద్, చౌహాన్, ట్రాన్స్ కో డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, వివిధ ఆలయాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో యువత కోసం కేఫ్ పాలిటిక్స్

- నూతన కార్యక్రమాన్ని నిర్వహిస్తున క్రిశాంక్



నవతెలంగాణ-కంటోన్మెంట్

యువత సమస్యలను పరిష్కరించేందుకు వారికి రాజకీయ అవగాహన కల్పించేం దుకు తెలంగాణ ఖనిజ సంపద కార్పొరేషన్ చైర్మెన్ క్రిశాంక్ 'కేఫ్ పాలిటిక్స్' పేరుతో ఒక ప్రత్యేకమైన కార్యక్రమాన్ని ప్రారంభించారు .కంటోన్మెంట్ యువకులు సమస్యలను తెలుసుకుంటూ వారికి ఉద్యోగ అవకాశాల విషయం పై, యువత ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై చర్చించేందుకు ఈ కార్యక్రమాన్ని వేదికగా ఏర్పాటు చేశారు. యువత సమస్యలే కాకుండా వారికి రాజకీయాలపై అవగాహన కల్పించేందుకు కూడా వేదిక ఉపయోగపడే విధంగా మన్నె క్రిశాంక్ ప్రయత్నిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ వారం ఓ బస్తి ఎంచుకొని అక్కడ యువత కోసం ఈ కార్యక్రమానికి ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ వేదిక ద్వారా యువతకు ఉన్న సమస్య తెలుసుకోవడమే తన ప్రధాన లక్ష్యమని, అలాగే ఈ కేఫ్ పాలిటిక్స్ కార్యక్రమ ఉద్దేశం అని పేర్కొన్నారు. విద్యావంతులైన యువకుల అన్ని రకాల సమస్యలు, బహుళజాతి కంపెనీలలో ఉపాధి అవకాశాలు గురించి చర్చించుకోవడం కోసం ఇదొక వేదికగా యువత ఉపయోగించుకోవచ్చు అని చెప్పారు. 'కేఫ్ పాలిటిక్స్' అనేది నా హృదయానికి దగ్గరగా ఉన్న కార్యక్రమం అన్నారు. కేఫ్ పాలిటిక్స్ కార్యక్రమంలో యువత స్థానిక సమస్యలు, రాజకీయాలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగావకాశాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాముఖ్యతపై యువతకు అవగాహన కలుగుతుందని అన్నారు.



అభివృద్ధిలో ఆదర్శంగా నేరేడ్‌మెట్‌ను నిలుపుతా..

- కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అభివృద్ధి పథంలో నేరేడ్‌మెట్ డివిజన్‌ను ఆదర్శంగా నిలుపుతానని కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి లోని రేణుకా నగర్ రేణుక ఎల్లమ్మ గుడి పక్క గల్లీలో రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గతంలో కాలనీలో పర్యటించిన సమయంలో స్థానికులకు సీసీ రోడ్డు వేయిస్తానని ఇచ్చిన మాట ప్రకారం నేడు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభోత్సవం జరిగిందన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారంతో నిధులు తీసుకుని కాలనీలో సీసీ రోడ్ వేయిస్తున్నట్టు చెప్పారు. అభివృద్ధి పనులు చేస్తున్న ఎమ్మెల్యే పని తీరును గుర్తించి కాలనీ వాసులు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి, ఏ సృజన, శ్రీనివాస్ రెడ్డి, చెన్నారెడ్డి, మహేష్, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు బైక్ దొంగలు అరెస్ట్

- చెడు వ్యసనాలకు బానిసలై చోరీలు
- వాహనాలు స్వాధీనం, నిందితుల రిమాండ్



నవతెలంగాణ-కంటోన్మెంట్

పార్కింగ్ చేసిన బైకుల చోరిలకు పాల్పడుతున్న నలుగురు యువకులను కార్ఖానా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్టు బేగంపేట్ ఏసీపీ పథ్వీధర్ రావు తెలిపారు. నార్త్ జోన్ డీసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఏసీపీ పథ్వీధర్ రావు వివరాలను వెల్లడించారు. కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం బైక్ చోరి అయ్యిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నలుగురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ నలుగురు చిన్న నాటి స్నేహితులని, జల్సాలకు, చెడు వ్యసనాలకు బానిసలై బైక్స్ చోరీ చేసి వాటిని అమ్మడం ప్రవృత్తిగా మార్చుకున్నట్టు తమ విచారణలో తేలిందని ఏసీపీ తెలిపారు. నగరంలోని పలు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 14కేసులలో వీరు నిందితులని పేర్కొన్నారు. రూ. 15 లక్షల విలువైన 14 బైక్ లను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు. నిందితులు బంజారాహిల్స్ కు చెందిన పీ పవన్, ఖైరతాబాద్ చెందిన జీ హరిచందన్, కక్కల చిన్న, కక్కల దుర్గాప్రసాద్ అని తెలిపారు.



నేటి నుండి అంతర్జాతీయ యోగా వేడుకలు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

నవతెలంగాణ-కంటోన్మెంట్

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు శనివారం నుంచి హైదరాబాద్‌లో నిర్వహించడం జరుగుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యోగా వేడుకల్లో భాగంగా పెరేడ్ గ్రౌండ్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఈ వేడుకలు నిర్వహించే అవకాశం ఇచ్చినందుకు ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలియజేశారు. యోగ ప్రపంచ దేశాల్లో ఆదరణ పొందిందన్నారు. నగరంలో శనివారం ఉదయం ఐదు గంటల నుంచి యోగా కార్యక్రమం ప్రారంభం కానుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ యోగా సంస్థలతోపాటు కళాకారులు, యోగానిపుణులు, ప్రముఖ విద్యావంతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే తెలంగాణ ప్రాంతంలోని ప్రముఖ విద్యా సంస్థల, యోగా సంస్థలు నిపుణులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం శనివారం ప్రారంభం కానున్నదని వివరించారు. కార్యక్ర మంలో ఆయుష్మాన్ కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ తదితరులు హాజరయ్యారు.



ముంబై టూ హైదరాబాద్ డ్రగ్స్ సరఫరా

- నైజీరియన్, ముంబైకు చెందిన నిందితుల అరెస్టు
- రూ.5 లక్షల విలువగల 60 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ముంబై నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయించేందుకు ప్రయత్నించిన నైజీరియాదేశస్తునితోపాటు ముంబాయ్‌కి చెందిన మరో నిందితుడిని సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్సు, సివిల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5లక్షల విలువగల 60గ్రాముల సిథెటిక్ డ్రగ్స్‌తోపాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని పోలీస్‌కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ సంజయ్‌కుమార్‌తో కలిసి అదనపు డీసీపీ రమణారెడ్డి.. నిందితుల వివరాలను వెల్లడించారు. వ్యాపార వీసాపై ఇండియాకు వచ్చిన నైజీరియాకు చెందిన చుక్వుమెకా న్యూఢిల్లీలో నివాసముంటూ నైజీరియన్లకు ఫుడ్ సప్లయ్ చేస్తున్నాడు. ముంబాయ్‌కి చెందిన మహమ్మద్ హసన్ షేక్ స్థానికంగా ఫుట్‌వేర్ వ్యాపారం చేస్తున్నాడు. సలువుగా డబ్బులు సంపాదించాలని ఇద్దరు వేర్వేరుగా డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. ముంబైలో తక్కువ ధరకు సింథెటిక్ డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న నిందితులు నగరంలో అధిక ధరలకు విక్రయించేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు సివిల్ పోలీసులతో కలిసి నాంపల్లిలో ఇద్దరిని అరెస్టు చేశా రు. వారిని తిరిగి కస్టడికి తీసుకుని విచారిస్తే మరిన్ని విషయాలు తెలిసే అవకాశముందని అదనపు డీసీపీ రమణారెడ్డి తెలి పారు. ఈ సమా వేశంలో నాంపల్లి ఎస్‌హెచ్ఓ రాజు నాయక్, టాస్క్ ఫోర్సు ఇన్‌స్పెక్టర్ రఘు నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ పైప్ లైన్ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ శుభోదయ నగర్ విస్టా హెూమ్స్ పక్కన గల వీధిలో నూతన వాటర్ పైప్ లైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో భాగంగా మంచి నీటి పైప్ లైన్ వేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ ఏఈ రోహిత్, కాలనీ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి,చెంచి రెడ్డి, శ్రీనివాస్ ,రామకృష్ణ, ప్రతాప్ రెడ్డి, రాంచందర్, హరి, డివిజన్ నాయకులు బాల్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పడి కంప్యూటర్ ఆపరేటర్‌కు గాయాలు..

- ఆదుకున్న కార్పొరేటర్ స్వర్ణ రాజు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ బోయిన గీత ప్రమాదవశాత్తు ఇంటి దగ్గర పడిపోయారు. ఆమె తలకు, ముక్కు, కనుబొమ్మలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ స్వర్ణ రాజు.. ఆమెను అత్యవసర వైద్యం కోసం శ్రీనివాస హాస్పిటల్‌లో చేర్పించారు. ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి ఆమెకు మెరుగైన వైద్యం చేయించారు. తక్షణమే స్పందించి సహాయసహకారాలు అందించిన కార్పోరేటర్‌కు విద్యుత్ విభాగం డీఈ రవీందర్ , ఏఈ ప్రత్యూష,వారి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.



బీఎల్ఆర్ క్రికెట్ లీగ్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కాప్రా

సైనిక్ పూరిలోని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద ఈ నెల 29 నుంచి ఈసీఐఎల్ గ్రౌండ్‌లో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఎల్ఆర్ క్రికెట్ లీగ్‌కు సంబంధించిన పోస్టర్‌ను ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా కాప్రా , ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి బైరి నవీన్ గౌడ్, మైనార్టీ నాయకులు బద్రుద్దిన్, ఇంద్ర, రహీం, భాస్కర్ గౌడ్, రవీందర్, శివ రాజ్, గణేష్ యాదవ్, శ్రీకాంత్ గౌడ్ ,గోలి శ్రీను, పవన్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో ఆధ్వర్యంలో ఎంఎన్‌జేలో అన్నదానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, అసద్ అన్వర్ మెమోరియల్ వ్యవస్థాపకులు డాక్టర్ సయ్యద్ మజీదుల్లా హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్ హిల్స్‌లోని మెహదీ నవాబ్ జాంగ్ క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో సుమారు 600 రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మానవసేవయే మాధవ సేవ అని.. వివిధ కారణాలతో ఆస్పత్రికి వచ్చే పేద ప్రజలకు అన్నదానం చేయడం తనకు ఎంతో సంతో షాన్ని ఇస్తుందని డాక్టర్ ముజీబ్ తెలిపారు. తన తల్లిదండ్రుల పేరు మీద మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి తద్వారా అన్నదాన కార్యక్రమం, ఇతర సాంఘీక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నందుకు తన కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యోగులు కె.ఆర్.రాజ్ కుమార్, కుర్రాడి శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శస్త్ర, ముఖీం ఖురేషి, ఖుతుబుద్దీన్, ఐటీఐ సుధాకర్ రెడ్డి, చాంద్ పాషా, నాలుగో తరగతి అసోసియేట్ అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి సభ్యులు శివ కుమార్, చంద్రశేఖర్, మిత్రులు ఉస్మాన్ అలి ఉస్మాని, రామకృష్ణారెడ్డి, ఏపీఆర్వో మహమ్మద్ అబ్దుల్ వహీద్, ముస్తఫా షరీఫ్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామికి వెండి కిరీటం అందజేసిన శ్రీనివాస్ దంపతులు



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ మంగా పురంలోని శ్రీ వెంకట ేశ్వర స్వామి దేవాల యంలో స్వామి వారికి శ్రీనివాస్, జ్యోతి దంప తులు 2 కిలోల 350 గ్రాముల వెండి కిరీటాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కిరీటం ధర సుమారు రూ. 2 లక్షల 35 వేలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకన్న గౌడ్, శోభారాణి, గారె బుచ్చయ్య, పి మల్లేష్ గౌడ్, సమ్మని మురళి చారి, భాస్కర్, విక్రమ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తోంది

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తోందనిమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని సిరిపురం కాలనీలో శుక్రవారం రూ.12 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ పైప్ లైన్ పనులను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరించేందుకు కషి చేస్తానని చెప్పారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న నియోజకవర్గ పరిధిలో రోడ్లు, డ్రయినేజీ, వాటర్ పైప్‌లైన్ వంటి పలు అభివృద్ధి పనుల కోసం రూ. 10 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా మంజూరైనాయని తెలిపారు. అభివద్ధి పనులు అన్ని పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సాయన్న ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధికి కషి చేస్తామని అన్నారు. సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దీపిక, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంటరీ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లాస్య నందిత, సుబ్రమణ్య స్వామి ఆలయ చైర్మెన్ సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫలితాల్లో సత్తా చాటిన కేంబ్రిడ్జ్ విద్యార్థులు

నవతెలంగాణ-హైదరాబాద్

ప్రపంచవ్యాప్తంగా 5 నుంచి 19 ఏండ్ల పిల్లలకు అంతర్జాతీయ విద్యను అందించే అతిపెద్ద సంస్థ కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్. ఇప్పుడు కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ జనరల్ సర్టిఫికేట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (ఐజీఎస్‌సీఈ) , కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఏఎస్ & ఏ లెవెల్ కోసం మార్చి 2023లో నిర్వహించిన పరీక్షా సిరీస్ ఫలితాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 379 పాఠశాలల నుంచి 65,157 దరఖాస్తులు వచ్చాయి. మార్చి 2023 పరీక్షల సిరీస్ భారతదేశంలోని కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ విద్యార్థులకు మరోసారి అద్భుతమైన ఫలితాలను అందించింది. కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఏఎస్ & ఏ స్థాయిలో 12 శాతం వృద్ధిని సాధించింది. గత ఏడాది 13,833 దరఖాస్తులతో పోలిస్తే 2022-23 ఏడాదిలో 15,600 దరఖాస్తులు వచ్చాయి. కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఏఎస్ & ఏ లెవెల్ కోసం గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, ఫస్ట్ లాంగ్వేజ్ ఇంగ్లీష్ , బయాలజీ కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ (ఐజీఎస్‌సీఈ) సబ్జెక్టులు కాగా, గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం , కామర్స్ అత్యంత ప్రజాదరణ పొందిన సబ్జెక్టులు. కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్, దక్షిణాసియా ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ శ్రీవాస్తవ ఈ వివరాలు వెల్లడించారు.

పొల్యూషన్ వాటర్ సమస్య పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-అంబర్‌పేట

పొల్యూషన్ వాటర్ సమస్య పరిష్కారానికి నిరంతర కృషి చేస్తున్నానని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం అంబర్ పేట డివిజన్ పరిధిలోని ఆకాష్‌నగర్‌లో స్థానిక అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించిన సందర్భంగా స్థానిక ప్రజలు పొల్యూషన్ వాటర్ వస్తుందని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందుంటాననీ, ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన కలవచ్చని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ యాదగిరి రెడ్డి, వాటర్ వర్క్స్ అధికారులు రమేష్, స్థానిక నాయకులు అతిక్, రఫీక్, ఖలీల్, జీహెచ్ఎంసీ వాటర్ వర్క్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సిన్‌ల పంపిణీ

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిలో హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు వైద్య పరీక్షలు ఐదు రోజుల పాటు మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని కింగ్ కోఠి క్లస్టర్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మజ తెలిపారు. హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహించిన 500 మందికి వ్యాక్సినేషన్, మెనింగోసీవీ, టీఓపీబీ, ఎస్ఐవీ వంటి వ్యాక్సిన్‌లను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కింగ్ కోఠి జిల్లా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్ఎంఓ డాక్టర్ సాధన, బొగ్గులకుంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీప్తి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ పాలకులను గద్దె దించుదాం

- తెలంగాణ జన సమితి అధ్యక్షులు కోదండరాం
- రాంనగర్‌లో పార్టీ హైదరాబాద్ ప్లీనరీ

నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్రంలో నిరంకుశ పాలకులను గద్దె దించి ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుదామని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం.నరసయ్య అధ్యక్షతన రాంనగర్ ఎస్ఆర్‌టీ కమ్యూనిటీ హాల్లో జరిగిన హైదరాబాద్ ప్లీనరీ సభలో కోదండరాం మాట్లాడారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో తెలంగాణ జన సమితి కీలకంగా మారనున్నదన్నారు. రాజకీయాల్లో "మార్పు" కోసం తమ వంతు ప్రయత్నిస్తామని తెలిపారు. నగరంలో అర్హులైన లబ్దిదారులందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు వెంటనే పంపిణీ చేయాలనీ, ట్రాఫిక్ చలాన్ల నుంచి వాహనదారులను కాపాడాలని కోదండరాం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సభ ప్రారంభానికి ముందు రాంనగర్ చౌరస్తాలోని అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామ్‌నగర్ చౌరస్తా నుంచి సభా వేదిక వద్దకు కోదండరాంతో సహా కార్యకర్తలు, నాయకులు పాదయాత్రగా తరలి వెళ్లారు. సభ ప్రారంభానికి ముందు హాలులో కోదండరాం పార్టీ జెండాను ఆవిష్కరించారు. సభలో తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్, అంబర్‌పేట ఇన్‌చార్జి జస్వంత్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రగిరి సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, రైతు విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీధర్, యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సలీం పాష, విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ మాసంపల్లి అరుణ్ కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, నగర యువజన సమితి అధ్యక్షుడు సుశీల్ కుమార్, మహిళా విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుష్పలత, అడిక్మెట్ డివిజన్ అధ్యక్షుడు కాకునూరి సుధాకర్, నగర సహాయ కార్యదర్శి జయపాల్‌రెడ్డి, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు అజయ్ గౌడ్, ముషీరాబాద్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటయ్య, నగర నాయకులు లక్ష్మణ్, సురేష్ నగరంలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన నరసయ్య

గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడిగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ ఉద్యమకారుడు, జర్నలిస్టు ఎం.నరసయ్య రెండోసారి ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన హైదరాబాదు ప్లీనరీ సభలో కోదండరాం ఆయన నియమకాన్ని వెల్లడించారు. ప్రధాన కార్యదర్శిగా బట్టల రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహమ్మద్‌తో పాటు మరో 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి



- బీసీ కుల గణన చేపట్టాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం

నవతెలంగాణ-అంబర్‌పేట

బీసీ కుల గణన చేపట్టి 75 కోట్ల మంది బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిసివినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో 56 శాతం జనాభా గల బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన వాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. బీసీలకు న్యాయం చేయడానికి కేంద్ర మంత్రులందరూ జోక్యం చేసుకోవాలని కోరారు. బీసీలకు ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం వాటా ఇవ్వలేదన్నారు. ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో కనీస ప్రాతినిధ్యం లభించలేదన్నారు. ఇది ప్రజాస్వామ్య దేశం అనీ, ప్రజాస్వామ్యంలో అన్ని సామాజిక కులాలకు వారి వారి జనాభా ప్రకారం అన్ని రంగాల్లో వాటా ఇవ్వాలి కానీ 75 ఏండ్లు గడిచినా వాటా ఇవ్వడం లేదన్నారు. బీసీలు అంటే ఉత్పత్తి కులాలు అనీ, దేశ సంపదను సృష్టిస్తున్నారు కానీ ఆ సంపద అనుభవించే హక్కు లేకుండా పోయిందన్నారు. పన్నులు కట్టే దేశ బడ్జెట్ ఇస్తున్నారు. కానీ బడ్జెట్‌లో కనీస వాటా లేదన్నారు. ఓట్లు వేసి అధికారం ఇస్తున్నారు. కానీ అధికారంలో బీసీలకు వాటా దక్కడం లేదన్నారు. బీసీలకు అన్ని రంగాల్లో సమాన వాటా ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందనీ, స్వయానా ప్రధానమంత్రే బీసీ, కేంద్రమంత్రి వర్గంలో 27 మంది మంత్రులు బీసీ వర్గానికి చెందిన వారున్నారన్నారు. ఈ డిమాండ్లు న్యాయమైనవి అనీ, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడానికి, బీసీలకు బడ్జెటు పెంచడానికి తన వంతు పాత్రగా కృషి చేస్తానని కిషన్‌రెడ్డి హామీనిచ్చారు. ఇంకా పూర్తి స్థాయి న్యాయం చేయడం కోసం చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, భూపేష్ సాగర్, నందగోపాల్, రామకృష్ణ, రాజ్ కుమార్, వరప్రసాద్, రాకేశ్, లలిత ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్రం



- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

నవతెలంగాణ-ముషీరాబాద్

దేశంలో మెజారిటీ ప్రజలైన బీసీ, ఎంబీసీ, సంచార, విముక్త జాతుల అభివృద్ధిని, సంక్షేమాన్ని గాలికి వదిలేసి దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని ప్రకటించుకోవడం సిగ్గు చేటని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ తీవ్రంగా విమర్శించారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరుతున్నా.. బీసీ ప్రధానిగా చెప్పుకునే నరేంద్ర మోడీ విస్మరిస్తున్నారన్నారు. సంచార, అర్ధసంచార జాతుల కులాల జాతీయ సమ్మేళనం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ముగిసింది. ఈ సందదర్భంగా హైదరాబాద్ డిక్లరేషన్ 2023ను ఆవిష్కరించారు. అనంతరం బండా ప్రకాశ్ మాట్లాడుతూ సంచార జాతుల జీవ ప్రమాణాలను మెరుగుపర్చాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి తప్పుకుంటుందన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ జాతీయ బీసీ కమిషన్‌ను నియామకం చేసిన కేంద్రం మిగతా వైస్ చైర్మెన్, సభ్యులను ఎందుకు నియామకం చేయలేదని ప్రశ్నించారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ సంచార జాతులకు చెందిన ప్రజలు ఓటు బ్యాంకుగా మారితేనే రాజకీయ పార్టీలు గుర్తిస్తాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షులు కొప్పుల రాజు మాట్లాడుతూ గతంలో యూపీఏ ప్రభుత్వం చేసిన కుల గణనను ఈనాటి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తొక్కి పెట్టినట్టు చెప్పారు. సంచార జాతుల అభివృద్ధి కోసం ప్రకటించిన హైదరాబాద్ డిక్లరేషనుకు పూర్తి స్థాయిలో మద్దతు ఉంటుందన్నారు. సభలో ప్రొఫెసర్ తిరుమలి, డిఎస్టి కమిషన్ మాజీ చైర్మన్ బాలకృష్ణ రేణకె, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్య క్షులు ఒంటెద్దుల నరేందర్, ప్రధాన కార్యదర్శి తిపిరిశెట్టి శ్రీనివాస్, ప్రొఫెసర్ బసవ చెన్నయ్య, పల్లవి రేణకె, ఏపీ ఎంబీసీ చైర్మన్ పెంద్ర వీరన్న, పూసల రవి, సంచార జాతుల యువజన విభాగం అధ్యక్షులు యువరాజ్ ప్రధాన కార్యదర్శి వెన్నెల నాగరాజు తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు.

డీఎస్సీ 2008 అభ్యర్థులకు కేసీఆర్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

నవతెలంగాణ-అడిక్‌మెట్



డీఎస్సీ 2008 అభ్యర్థులకు కేసీఆర్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి అని డీఎస్సీ 2008 బీఈడీ మెరిట్ క్యాండిడేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమామహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద డీఎస్సీ 2008 అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కు మద్దతు గా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగా రెడ్డి హాజరై మాట్లాడారు. డీఎస్సీ 2008లో నష్టపోయిన అభ్యర్థులకు హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. 2009 నుంచి 14 ఏండ్లుగా సుదీర్ఘ పోరాటం తర్వాత హైకోర్టులో సానుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. గతంలో సీఎం కేసీఆర్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగ నోటిఫికేషన్ అమలు చేయాలన్నారు. ఈ ధర్నాలో బీఈడీ మెరిట్ క్యాండిడేట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సింగారి సంగమేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, భూపేసాగర్, వేముల రామకృష్ణ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శమూర్తి బీఆర్ అంబేద్కర్

నవతెలంగాణ-బంజారాహిల్స్



కుల మత ప్రాంతీయ రాజకీయాలను కొనసాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం వారి పద్ధతులను మార్చుకుని నూతన పార్లమెంట్ పేరును అంబేద్కర్ నామకరణం చేస్తూ రాష్ట్రపతిని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని ప్రజ్ఞా సంఘాల జేఏసీ చైర్మెన్ గజ్జలకాంతం డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రపంచానికి చాటి చెప్పే విధంగా దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు, నూతన సచివాలయానికి అంబేద్కర్ పేరు నామకరణం చేశారని తెలిపారు. సీఎం కేసీఆర్‌కు బహుజనులు, బడుగు, బలహీన వర్గాలు అండగా ఉంటామన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం రాయకపోతే తాను ప్రధానిని కాలేనని చెప్పిన ప్రదాని నూతన పార్లమెంట్ భవనానికి ఆయన పేరు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. గిరిజన ఆదివాసీ బిడ్డను రాష్ట్రపతి చేశామని గొప్పలు చెప్పుకున్న వారు ఆమెను పార్లమెంటు ప్రారంభోత్సవానికి ఎందుకు ఆహ్వానిచడం లేదో సమాధానం చెప్పాలన్నారు. నియంత పాలను అంతం చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. తెలంగాణలో అధికారం పగటి కలే అనీ, కర్ణాటకలో మీరు చేసిన పాలన ప్రజలు చూశారన్నారు. గుజరాత్‌లో ఆడబిడ్డలు కనిపించకుండా పోయిన ఘటనపై ఎందుకు విచారణకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు. హిందూ దేవతల పేర్లతో రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రయివేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంధం రాములు, పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోలా శ్రీనివాస్, డాక్టర్ సంజు నాయక్, ఇష్టమని పూసల సంఘం సిద్దిపేట జిల్లా గౌరవ అధ్యక్షులు కోనేటి సత్యం, మున్నూరు కాపుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటి మంజులరాణి, తెలంగాణ వడ్డెర సంఘం అధ్యక్షులు దండగుల రామకృష్ణ, పద్మశాలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

సారస్వత పరిషత్తు పురస్కారాల ప్రదానోత్సవం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



తెలంగాణ సారస్వత లోకానికి 80 ఏండ్లుగా ఆత్మీయ సంస్థగా ఉన్న పరిషత్తు తన కృషిని భవిష్యత్తులో కూడా ప్రమాణాలు తగ్గకుండా అంకితభావంతో కొనసాగిస్తుందని అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. లోకనంది శంకర నారాయణరావు, సురవరం ప్రతాపరెడ్డి, దేవులపల్లి రామానుజరావు, నూకలనరోత్తమ రెడ్డి, డాక్టర్ సి.నారాయణరెడ్డి వంటి పెద్దల బాటలో నడుస్తామని చెప్పారు. 2023 సంవత్సరానికి గాను వివిధ ప్రక్రియల్లో పోటీలో గెలుపొందిన ఉత్తమ గ్రంథాలకు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్యతో కలిసి పురస్కారాలను అందజేశారు. ఈ ఏడాది పెండ్యాల కిషన్ శర్మ రచించిన శ్రీ వరదాభ్యుదయం పద్య కావ్యానికి, హనీఫ్ రచించిన నాది దుఃఖం వీడని దేశం అనే వచన కవితా సంపుటానికి పురస్కారాలు అందజేశారు. కథా ప్రక్రియలో డాక్టర్ టి.సంపత్ కుమార్ రచించిన నా నుంచి మన వరకు గ్రంథానికి, నవలా ప్రక్రియలో వి.శాంతి ప్రబోధ రచించిన బతుకు సేద్యం గ్రంథానికి, విమర్శ ప్రక్రియలో ఆడెపు లక్ష్మీపతి రచించిన దిక్చక్రం వ్యాస సంపుటికి పురస్కారాలు అందజేశారు. వీరందరికీ రూ.20వేల చొప్పున నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. ఇతర ప్రక్రియల్లో న్యాయ నిర్ణీతల పరిశీలనలో సమానమైన స్థాయి పొందిన దేవనపల్లి వీణావాణి రచించిన ధరణీరుహ, హెచ్.రమేష్ బాబు రచించిన లోటస్ ఫిలిం కంపెనీ -హైదరాబాద్ గ్రంథాలకు బహుమతి మొత్తాన్ని చెరి రూ.10వేల చొప్పున అందజేశారు. ఈ ఏడాది వరిష్ఠ పురస్కారాల కింద ఆశారాజు, జూపాక సుభద్ర, వారాల ఆనంద్, గుడిపాటిలకు పరిషత్తు తరపున పురస్కారాలు అందించారు. రూ.20 వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతో పన్యాసం చేస్తూ తెలంగాణలో వివిధ ప్రక్రియల్లో తెలుగు సాహిత్యం ఉత్తమ ప్రమాణాలతో వెలువడుతున్నదన్నారు. తెలంగాణ జన జీవితం ఈ రచనల్లో మునుపటి కన్నా ఎక్కువగా ప్రతిఫలిస్తున్నదని చెప్పారు. పరిషత్తు ఉపాధ్యక్షులు డా.ముదిగంటి సుజాతారెడ్డి, కోశాధికారి మంత్రి రామారావు, ట్రస్ట్ సభ్యులు డాక్టర్ సి. వసుంధర పాల్గొన్నారు. కార్యవర్గ సభ్యుడు రింగు రామ్మూర్తి సభా సమ న్వయం చేశారు. పురస్కార గ్రహీతలు తమ స్పందనను తెలియజేశారు.



బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు శీలం సరస్వతి ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఇసామియ బజార్‌లోని కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు దిలీప్ ఘనటె, గన్ ఫౌండ్రీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ సరస్వతిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోషామహల్ నియోజకవర్గంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు పార్టీ కోసం కష్టపడాల్సి అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ పటిష్ట కోసం కమిటీలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీ వినోద్ కుమార్, అమర్ బద్రి చారి, దర్శన్ రాజు, మహిళా నాయకులు నికత్ బేగం, నాగమణి, ఉమారాణి, రేణుక, కళ్యాణి, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సంరక్షణలో తెలంగాణ నెంబర్ వన్'



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆరోగ్య సంర్షణలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని హైదరాబాద్ జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి అన్నారు. ఎవర్ కేర్ గ్రూప్ ఆధ్వర్యంలో రెండు రోజుల సదస్సు నిర్వహించారు. ప్రముఖ వైద్యరంగ సంస్థ ఎవర్ కేర్ గ్రూప్ కేర్ హాస్పిటల్స్ నిర్వాహకులు ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణలో నాణ్యత, మెరుగుదల లక్ష్యంగా తొలి ఆరోగ్య సదస్సును రెండు రోజులు విజయవంతంగా నిర్వహించారు. ఈ సదస్సులో డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటి మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ ఖర్చులను తగ్గించే ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. రోగుల సంరక్షణ, భద్రత అత్యున్నత ప్రమాణాలను సమర్థిస్తూనే.. ఖర్చులను తగ్గించడానికి ప్రభుత్వ, ప్రయివేటు హాస్పిటల్స్ మధ్య పరస్పర సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు. సదస్సులో భాగంగా ఆరోగ్య సంరక్షణ విభాగం వాటాదారుల మధ్య సంభాషణ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు దోహదం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కలిసి పని చేయడం ద్వారా నాణ్యతలో రాజీ పడకుండా ఖర్చులను తగ్గించడానికి వినూత్న పరిష్కారాలను కనుగొనగలమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రదర్శనలు, బృంద చర్చలు, నెట్ వర్కింగ్ అవకాశాలు, జ్ఞానమార్పిడి సహకారాన్ని పెంపొందించడంలో సదస్సు విజయవంతమైంది. భారత్‌తో పాటు కెన్యా, నైజీరియా తదితర దేశాల నుంచి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలి



నవతెలంగాణ-అడిక్‌మెట్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలనీ, ఉచిత విద్య, వైద్యం అందజేయాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మర బోయిన కేశవులు డిమాండ్ చేశారు. తెలంగాణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు మద్దతుగా రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు బడుగు బలహీన వర్గాల పేదలకే కాకుండా అగ్రవర్ణ పేదలకు కూడా అందుతున్నాయన్నారు. 70 ఏండ్లు అధికారంలో ఉన్న వాళ్ళు, ఉచిత విద్యుత్ అడిగితే కాల్చి చంపినోళ్ళు ఈరోజు ఏదో చేస్తాం అంటున్నారన్నారు. ఇన్నేండ్లు ఏం చేశారో చెప్పాలన్నారు. దేశంలో పేదరికం పోవాలంటే, యువత బాగుపడాలి అంటే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో తెలంగాణలో ఉన్న సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం స్ఫూర్తిగా తీసుకుని అమలు చేయాలన్నారు. తొమ్మిదేండ్లలో తెలంగాణలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. మిగతా రాష్ట్రాలు ఎందుకు పేదరికంలోనే ఉన్నాయి అని ప్రశ్నించారు. సంచార హక్కు చట్టం కొందరు రాజకీయ నాయకులు వారి స్వార్థం కోసం వాడుకుంటున్నారన్నారు. రాజకీయ నాయకులు ఎవరు దుర్వినియోగం చేస్తున్నారో దానిపై కూడా దృష్టి పెట్టాలన్నారు. బొమ్మర బోయిన కేశవులు మాట్లాడుతూ సామాన్య ప్రజలకు వారి సంపదలో ఎక్కువ భాగం విద్య, వైద్యంకు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. దీనితో ప్రజలు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, సమయానికి కావాల్సిన వైద్యం, అవసరమైన విద్యను పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతమున్న సామాజిక పరిస్థితుల దృష్ట్యా సమాచార హక్కు పరిరక్షణ సమితి దేశవ్యాప్తంగా ఉచిత విద్య ఉచిత వైద్యం అందించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ధర్నాలు, నిరసనలు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఉభయ తెలుగు రాష్ట్రాల మాజీ ప్రధాన సమాచార కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ జి.యతిరాజులు, జల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సత్యనారాయణ, ఎస్‌హెచ్‌పీఎస్ జాతీయ కో-ఆర్డినేటర్ గాదం ఉత్తరయ్య, సమాచార హక్కు పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కన్నబోయిన ఉషారాణి, సమాచార హక్కు పరిరక్షణ సమితి హైదరాబాద్ జిల్లా కన్వీనర్ కొంసంపేట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



టీబీ వ్యాధిపై ఇంటింటి సర్వే

- ఉస్మానియా ఆస్పత్రి యూనిటీ సూపర్‌వైజర్ ఖలీల్ అహ్మద్

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

క్షయ (టీబీ) వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించామని ఉస్మానియా హాస్పిటల్ టీబీ యూనిట్ సూపర్‌వైజర్ ఖలీల్ అహ్మద్ చెప్పారు. శుక్రవారం బేగంబజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని జోషి వాడిలో క్షయ వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి, డీటీసీఓ డాక్టర్ కల్పన ఆదేశాల మేరకు తమ యూనిట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు రెండు, మూడు వారాలు దగ్గు, ఛాతి నొప్పి, కఫంలో రక్తం (దగ్గినప్పుడు లేదా గొంతును శుభ్రం చేసినప్పుడు ఉత్పత్తి అయ్యే శ్లేష్మం, లాలాజలం) ఊపిరి ఆడకపోవడం, వెన్నెముక క్షయవ్యాధి వెన్నునొప్పికి కారణం కావచ్చు అన్నారు. మూత్రంలో రక్తం మూత్రపిండాల్లో క్షయవ్యాధి కారణంగా సంభవించవచ్చు అన్నారు. మెదడులోని టీబీ తలనొప్పి, మెడ బిగుసుకుపోవడం, గందరగోళం, వాంతులు, మానసిక స్థితి మారడం, మూర్ఛలు, నరాలకు సంబంధించిన ఇతర సంకేతాలు, లక్షణాలను కలిగిస్తుంన్నారు. బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, చలిజ్వరం, వాతావరణం చల్లగా ఉన్నా రాత్రిపూట నిద్రపోయేట ప్పుడు చెమటలు పడతాయని చెప్పారు. టీబీపై అనుమానం ఉంటే వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీటీబీ ప్రాజెక్ట్ ప్రతినిధి సుభద్ర, టీపీటీ స్రవంతి, ఆశా కార్యకర్తలు పద్మ, మాధవి, లక్ష్మీ పాల్గొన్నారు.

ఎన్‌కే పర్మనెంట్ హెయిర్ కలర్ నూతన ప్రొడక్ట్ ఆవిష్కరణ

నవతెలంగాణ-అడిక్‌మెట్



ప్రముఖ రెవలాన్ కంపెనీ కేశ సంపదను పెంపొందించడం కోసం సహజసిద్ధమైన ఆయిల్స్‌తో తయారు చేసిన కలర్ ఎన్ కేర్ పర్మనెంట్ హేర్ కలర్ నూతన ప్రొడక్ట్‌ను ఆ సంస్థ శుక్రవారం కవాడిగూడలోని హెూటల్ మారియట్‌లో సంస్థ నూతన ప్రోడక్ట్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ ప్రోడక్ట్ ను ఆ సంస్థ జనరల్ మేనేజర్ రోహిత్ జైన్, ఆల్ ఇండియా మార్కెటింగ్ మేనేజర్ సౌమిత్ర ప్రసాద్, ఫైనాన్సు హెడ్ అలోక్ కస్లివాల్, సౌత్ ఇండియా ఇన్చార్జి ఆద్య, ఏపీ తెలంగాణ కర్ణాటక గోవా రాష్ట్రాల ఇన్చార్జి ఏ.మహేష్ ముఖ్య అతిథులుగా కలర్ ఎన్ కేర్ పర్మనెంటు హేర్ కలర్ ప్రొడక్టును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యూటీ రంగంలో అనేక ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువచ్చిన తమ సంస్థ పరిమనెంట్ హేర్ కలర్‌లో కూడా నూతన ఉత్పత్తిని తీసుకురావాలని ప్రయత్నించి ఈ ప్రోడక్ట్‌ను తీసుకొచ్చినట్టు తెలిపారు. ప్రొడక్ట్ వాడిన వారి పర్మనెంట్ హెయిర్ కలరు ఎనిమిది వారాల వరకు చెక్కు చెదరకుండా ఉంటుందని తెలిపారు. ఈ ప్రొడక్ట్‌ను బాక్స్, షసే రూపంలో మార్కెట్లోకి తీసుకొచ్చినట్టు వారు తెలిపారు. బాక్స్ ప్రొడక్ట్ రూ.200 , సాచెట్ రూ.45 మార్కెట్లో లభిస్తుందని తెలిపారు. అందరూ తమ కేశ సంపదను పెంపొందేందుకు ఈ ప్రొడక్ట్‌ను వాడాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్లు ఆకుల భాస్కర్, సుమన్ వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, హితేందర్, సందీప్, తెలంగాణ, ఏపీ, కర్ణాటక, గోవా రాష్ట్రాలకు చెందిన డిస్ట్రిబ్యూటర్లు, ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలను నిలిపివేయాలి : ఆకుల శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

కార్మిక చట్టాలకు, రాజ్యాంగానికి విరుద్ధంగా జరుగుతున్న ఎస్‌బీఐ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలను తక్షణమే నిలిపివేయాలని ఎస్‌బీఐ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జాతీయ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణలో 7 వేలమంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. శుక్రవారం హైదర్ గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు ఎడవెల్లి నర్సింహాతో కలసి ఆయన మాట్లాడారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతన చట్టం అమలు చేసి పూర్తి స్థాయిలో వేతనాలు, పీఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 8 గంటల పని విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. 12 గంటల పని విధానం కార్మిక చట్టాలకు విరుద్ధం అనీ, దీన్ని వెంటనే తొలగించాలన్నారు. ఈడీఎల్ స్కీమ్ కింద చనిపోయిన 500 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎలాంటి బెనిఫిట్స్ అందలేదనీ, వీటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. త్వరలో రాష్ట్రానికి రానున్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఇబ్బందులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పై వేధింపులను యాజమాన్యం మానుకోవాలన్నారు. 2017లో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి దృష్టికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల బాధలను తీసుకవచ్చి కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ ద్వారా ఉద్యోగులకు బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో షేక్ సలావుద్దీన్ పాల్గొన్నారు.

సివరేజ్ పైప్ లైన్ నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-అంబర్‌పేట

నల్లకుంట డివిజన్ పరిధిలోని తిలక్‌నగర్ పెద్ద గణేష్ చౌరస్తాలో రూ.14.80 లక్షలతో నిర్మిస్తున్న సివరేజ్ పైప్ లైన్ నిర్మాణ పనులను అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ నల్లకుంట కార్పొరేటర్ వై.అమృతతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ పరిధిలో దాదాపు మంచి నీటి సమస్యలను పరిష్కరించగలిగామన్నారు. సివరేజీ సమస్యలను కుడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, భాస్కర్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు గోనె ప్రదీప్ రావు, కూర నరేందర్, రాము యాదవ్, భూపతినాథ్, కిషన్ రావు, అడ్వకేట్ సత్యం, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
కుత్బుల్లాపూర్
శనివారం 27 మే 2023

ఎమ్మెల్యేను కలిసిన టీఎస్ఐఐసీ కాలనీ నూతన సంక్షేమ సంఘం

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్



సూరారం 129 డివిజన్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీ నూతన సంక్షేమ సంఘం ఎన్నికైన సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను చింతల్ లోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. సభ్యులంతా ఐక్యమత్యంగా ఉంటూ కాలనీలో ఎటువంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారంలో ఎల్లవేళలా సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ చాక్క సురేష్ బాబు , జనరల్ సెక్రటరీ కే. గిరిధర్, ట్రెజరర్ టీఎస్ఎన్ మూర్తి, జాయింట్ సెక్రెటరీలు కే రాజ, వినోద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపి, శ్రీకాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

యాదవ హక్కుల సమితి ఆధ్వర్యంలో బెల్లి లలితక్కకు నివాళులు

నవతెలంగాణ - కూకట్ పల్లి



మలిదశ తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో, గాన కోకిలగా పిలువబడి, ఉద్యమ గొంతుకగా, కళా సమితి కన్వీనర్‌గా తన రక్తాన్ని ధారపోసిన వీర వనిత, తన ప్రాణ త్యాగంతో కొత్త ఉద్యమానికి శ్రీకారం చుట్టిన అమరవీరురాలు బెల్లి లలితక్క 24వ వర్ధంతి సందర్భంగా, కూకట్‌పల్లి రామాలయం వద్ద ఆమె చిత్రపటానికి గొట్టె ముక్కల వెంకటేశ్వర్ రావు పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు, కూకట్ పల్లి యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గండి మల్లేష్ యాదవ్, యాదవ సోదరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

- జలమండలి ఎండీ దానకిశోర్
- జలమండలిలో వార్డు అసిస్టెంట్లకు ఒక రోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మహానగరంలో తాగునీటి సరఫరాతోపాటు సీవరేజీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు వార్డు అసిస్టెంట్లు పని చేయాలని ఎండీ దానకిశోర్ సూచించారు. వివిధ వార్డుల్లో పని చేయడానికి ఎంపిక చేసిన అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని జలమండలిలో శుక్రవారం నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎండీ దానకిశోర్ పాల్గొని మాట్లాడారు. వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యంగా వార్డు అసిస్టెంట్లు పని చేయాలన్నారు. జలమండలికి ఇప్పటికే కస్టమర్ కేర్ సెంటర్, ఆన్‌లైన్‌లో ట్విటర్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. వీటికి తోడు ప్రజలు ఇచ్చే పిటిషన్లను సంబంధిత సెక్షన్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. అంతేకాకుండా ఫిర్యాదులను ఎంసీసీలో నమోదుచేసి, ఆ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఎప్పటికప్పుడు ఫిర్యాదుదారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. వార్డు స్థాయిలో నమోదయ్యే తాగునీటి, సీవరేజీ సమస్యలపై క్షేత్ర స్థాయిలో ఇతర శాఖల సమన్వయం చేసుకుంటూ త్వరితగతిని పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. హైదరాబాద్ నగర వాసుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం త్వరలో వార్డు వ్యవస్థను తీసుకొస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ప్రతీ 50 వేల మంది జనాభాకు ఒక వార్డు ఏర్పాటు చేయనుంది. అన్ని శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు ఒకే చోట ఇచ్చేందుకు దీన్ని తీసుకొస్తుంది. ఇందులో తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణకు సంబంధించి జలమండలి నుంచి ఒక వార్డు అసిస్టెంట్‌ను నియమించనున్నారు. వీరు ప్రజల నుంచి సంబంధింత ఫిర్యాదులు స్వీకరించి వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తారు. ఎంపిక చేసిన వార్డు అసిస్టెంట్లకు ఖైరతాబాద్ లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో వీరు పాటించాల్సిన విధి విధానాలు, చేయాల్సిన పనులు తదితరల అంశాల గురించి సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఈడీ డా.ఎం.సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్. ప్రవీణ్ కుమార్, సీజీఎంలు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, వినోద్ భార్గవ, శ్రీధర్, జీఎంలు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి యాత్రలో భాగంగా జీడిమెట్ల డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటన



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని వెన్నెలగడ్డ , బౌద్ధ నగర్ లలో ప్రగతి యాత్రలో భాగంగా 68వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పర్యటించారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తూ పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. కాగా తమ బస్తీల్లో కాలనీలలో మెరుగైన సౌకర్యాల కల్పనకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించినందుకు, ఎమ్మెల్యేకి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంచినీటి సరఫరలో అంతరాయం లేకుండా చూడాలని అక్కడక్కడ మిగిలి ఉన్న భూగర్భ డ్రయినేజీ, సీసీ రోడ్ల ఏర్పాటు పార్క్ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యేని కోరగా అక్కడే ఉన్న అధికారులకు ఆయన ఆదేశించారు త్వరలోనే వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ది రాములు , గుమ్మడి మధుసూదన్ రాజు, జ్ఞానేశ్వర్ , వార్డు సభ్యులు సుధాకర్ గౌడ్, ఇందిరారెడ్డి ,కాలే నాగేష్, సమ్మయ్య, బాలేష్, బిక్షపతి , రవి , యాదగిరి, సుబ్బారావు, మధు, కృష్ణ, ముత్యం రెడ్డి, చక్రవర్తి పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీత సుభాష్‌కు సన్మానం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



గాంధీనగర్ ఇండస్ట్రియల్ లో గల భాస్కర ఎలక్ట్రానిక్స్ కంపెనీలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కే సుభాష్ శ్రమశక్తి అవార్డు అందుకున్న నేపథ్యంలో ఆయనను కార్మికులందరూ కలిసి యూనియన్ ప్రెసిడెంట్ ముద్దాపురం మదన్ గౌడ్‌తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముద్దాపురం మదన్ గౌడ్ సుభాష్‌ను శాలువతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆధ్వర్యంలో భారీ ఎత్తున సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రమశక్తి అవార్డు గ్రహీత కే సుభాష్ మాట్లాడుతూ సేవ చేస్తే ఏప్పటికైనా ఫలితం దక్కుతుందని దానికి నిదర్శనమే నేడు అని, శ్రమశక్తి అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. గత 30 సంవత్సరాలుగా సుహృద్భావ పారిశ్రామిక సంబంధాలు , కార్మిక సంక్షేమానికి విశేష కృషి చేసినందుకు గాను, ఒక కార్మికుడిగా డ్యూటీ చేసిన తన శ్రమను మన తెలంగాణ గవర్నమెంట్ గుర్తించి అవార్డు ఇచ్చిందన్నారు. కావున తన బాధ్యతని ఇంకా పెంచుకొని కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తూ...100 శాతం న్యాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు కే రాంబాబు, ఆదినారాయణ రెడ్డి, జి పవన్ కుమార్ అదే విధంగా వివిధ కార్మిక నాయకులు కంపెనీ బాడీ నంబర్స్ మంజుల, జ్యోతి , డి పద్మావతి, జి నీలాదేవి, డి వసుంధర , వనిత, కె రమాదేవి, జయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వం కల్పించిన జి.వో 59 తో స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలి

- కూకట్‌పల్లి తహసీల్దార్ గోవర్ధన్



నవతెలంగాణ - కూకట్ పల్లి

కూకట్‌పల్లి మండల పరిధిలోని నివాసితులు.. ప్రభుత్వం కల్పించిన 58 జీవోతో వారిస్థలాలను క్రమబద్ధీకరించు కోవాలని కూకట్ పల్లి తహసీల్దార్ గోవర్ధన్ తెలిపారు. జీవో 58, 59 తో ప్రజల్లో నెలకొన్న సందేహాలను, దరఖాస్తు చేసుకున్న నివాసితులకు ప్రభుత్వం పంపించిన నోటీస్‌లో వచ్చిన అధిక రుసుము చెల్లించేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులపై, శుక్రవారం కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ లోని శ్రీశ్రీశ్రీ వీరంజనేయ శివాలయం కమిటీ హాల్లో, బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన గోవర్ధన్ వాటిని నివృత్తి చేశారు. రెండు లక్షలు ఆపై ఉన్న డబ్బులను చెల్లించి రెగ్యులరైజ్ చేయించుకోవలన్నారు. రూ. 10, 20 లక్షలు ఆపై చెల్లించాలని నోటీసులు అందుకున్న వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగ్గించే వెసులుబాటును కల్పించేందుకు ప్రయత్నం చేస్తానని గోవర్ధన్ ఈ సందర్భంగా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ శ్రీనివాస్ రెడ్డి, బస్తి ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి , కోశాధికారి నర్సింహులు ముదిరాజ్ నాయకులు, పేర్ని ధర్మారావు ,దొడ్ల రాంరెడ్డి ,జీబీ కన్నారవు, వెంకటరెడ్డి, ఎం కనక రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాసరావు, బిక్షపతి ,తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ హెడ్ హైటెన్షన్ పవర్ లైన్లను మార్చాలి

- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్



కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ ఫిరోజ్ గూడ నివాసితులు స్థానికంగా ఉన్న ఓవర్ హెడ్ హై-టెన్షన్ పవర్ లైన్లను మార్చాలని కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీంద్రరెడ్డికి సూచించారు. ఈ విషయమై ఎమ్మెల్యే సూచనల మేరకు కార్పొరేటర్ విద్యుత్ శాఖ డీఈ కోటేశ్వరరావును కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హెడ్ హైటెన్షన్ పవర్ లైన్ల కింద జీవించడం వల్ల కలిగే అపారమైన నష్టాలు, విపత్తుల గురించి అధికారికి వివరించారు. నివాస గృహాలపైన ఉన్న హై-టెన్షన్ పవర్ లైన్ వలన ఇది వరకు నలుగురు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఈ విషయమై కార్పొరేటర్ హెచ్ వైర్లను త్వరగా మార్చాలని కోరారు. గన్లాక్ ఫీడర్ కోసం ఉద్దేశించిన హెచ్ లైన్లు స్థానికులకు ప్రమాదంగా మారాయని, విద్యుత్ లైన్లు ఈ ప్రాంతంలోని చాలా ప్రయివేటు నివాసాలపైన ఉన్నందున వాటిని వెంటనే మార్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ - ధూల్ పేట్



లంగర్ హౌజ్ డివిజన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మాధవి లతను సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నాయకులు కలిసి బొకే తో సన్మానించారు. శాంతి భద్రతలను కాపాడాలని, తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పార్టీ హైదరాబాద్ సౌత్ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు.జి.విఠల్ అన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎమ్ సౌత్ కమిటీ కార్యదర్శి పి కళ్యాణ్, డీవైఎఫ్ఐ నాయకులు దేవేందర్ చారి, ఆవాజ్ నాయకులు సాదక్ అలీ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ - బాలానగర్



మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శివశంకర్ నగర్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పేదలకు ఉచితంగా వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నా మన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మల్లారెడ్డి హాస్పిటల్ సహాయ సహకారాలతో ప్రతి శుక్రవారం డివిజన్ పరిధిలో ఏర్పాటు చేయనున్నట్టు కార్పొరేటర్ తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ స్థానిక ప్రజలకు సూచించారు. ఉచిత వైద్య శిబిరంలో షుగర్, బీపీ, పంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి హాస్పిటల్ ప్రతినిధి డా. రవికుమార్, స్థానికులు బస్వరాజు, శ్రీను, విజయ్, అశోక్, బాబీ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కలగా వెంకటేష్ శర్మకు నంది పురస్కారం

నవతెలంగాణ- మేడ్చల్

మండల పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన పురోహితుడు కలగా వెంకటేశ్ శర్మకు నంది పురస్కారం దక్కింది.శ్రీ త్రినయన సాంస్కృతిక కళానిలయం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని త్యాగరాయ గానసభలో ఉగాది నంది పురస్కార మహోత్సవం నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మెన్ శ్రీనివాస్ గుప్త, మాజీ మంత్రి, బ్రాహ్మణ పరిషత్ సలహా దారు సముద్రాల వేణు గోపాల చారి, సరస్వతి దేవి ఉపాసకులు దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా పూడూరు చెందిన వెంకటేష్ శర్మకు వైదిక పూర రహిత విభూషణ రత్న నంది పురస్కారాన్ని ప్రదానం చేశారు.ఈ సందర్భంగా పలువురు పూడూరు గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సేవాసంస్థ స్థాపక కార్యదర్శి శివకుమార్, కోశాధికారి శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి సీసాల బస్తీలో ఈనెల 16 నుంచి పది రోజులుగా నవదుర్గ జై దుర్గా సమితి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం శ్రీ వైష్ణవి దుర్గ, శ్రీ చక్ర ఉపదేవతల సహిత ప్రాణ ప్రతిష్ట మహోత్సవాలు ఉడిపి కొక్కే సుబ్రహ్మణ్య మఠాధిశులైన శ్రీ 1008 విద్యా ప్రసన్న తీర్థ స్వాముల వారిచే వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు తో పాటు స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, సూరారం, గాజుల రామారం, డివిజన్ కార్పొరేటర్,లు రావుల శేషగిరి, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బొంగు నూరు ప్రభాకర్ రెడ్డి లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పండితులు శ్రీకాంత్ పంతులు, రాఘవేంద్ర పంతులు, బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్, డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, స్థానిక బస్తీ వాసులు, వివిధ ప్రాంతాల నుండి భక్తులు ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

అందరి సహకారంతో త్వరలోనే సమస్యల పరిష్కారం



- డాక్టర్ ముజీబ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ పౌర సరఫరాల శాఖ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి(డీఎస్‌వో) రమేష్ శుక్రవారం నాంపల్లి గృహకల్పలో తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్), కార్యదర్శి విక్రమ్ కుమార్‌లను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖలో నెలకొన్న సమస్యల గురించి ముజీబ్ దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా పౌర సరఫరాల శాఖలో సర్వీస్ రూల్స్ లేవని, జీవో నెంబర్ 317 ప్రకారం ఉద్యోగుల విభజన సరిగా కాలేదని, ప్రమోషన్లు ఇవ్వడం లేదని తెలిపారు. అనంతరం డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులతో సంప్రదించి, వారి సహకారంతో పౌర సరఫరాల శాఖ మంత్రితో పాటు కమిషనర్‌ని కలిసి అన్ని సమస్యలకు త్వరలోనే పరిష్కారం చేయిస్తానని హామీచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గం నరేష్, ఖాలెద్ అహ్మద్, శ్రీధర్, సీఆర్వో యూనిట్ అధ్యక్షుడు రజ్వి, కార్యదర్శి సుధీర్, నసీర్, నాయక్, నందరాజు, ప్రిథ్వి జగదీష్, సమీర్, అయాజ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన జాతీయ సదస్సు

నవతెంగాణ-సిటీబ్యూరో



ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ) నేతృత్వంలో నిర్వహించిన జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ) నేతృత్వంలో 'గనుల తవ్వకాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యం, భౌగోలిక అంశాలు, పర్యావరణ పరిరక్షణ'పై ఈనెల 25, 26న రెండురోజులపాటు జాతీయ సదస్సు నిర్వహించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని చాణక్య సెమినార్ హాల్లో రెండో రోజు కొనసాగిన సదస్సులో దేశనలుమూలల నుంచి ప్రముఖ మైనింగ్ నిపుణులు, ప్రముఖులు పాల్గొని మాట్లాడారు. గనులను, పర్యావరణను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మైనింగ్ తవ్వకాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గనుల తవ్వకాల్లో భద్రతను పాటించాలని, పర్యావరణను రక్షించడంతోపాటు భౌగోలిక అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. 25 టెక్నికల్ అంశాలను 17 పేర్లలో ప్రతిపాదించారు. ఈ సందర్భంగా ఈఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ జీ.రామేశ్వర్‌రావు వివరాలను తెలిపారు.దేశంలోని మైనింగ్, ఖనిజ పరిశ్రమలలో భద్రత, ఆరోగ్యం, పర్యావరణాన్ని మెరుగుపర్చడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తపై చర్చించామని తెలిపారు. దేశంలోని మైనింగ్ పరిశ్రమలలో అమలు చేయాల్సిన పలు అంశాలు, నిబంధనలు, జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరముందన్నారు. ఖనిజా సంపద, ఇంధనాల వెలికితీత, పర్యావరణ ప్రభావాలు, రాడర్, డ్రోన్స్ అప్లికేషన్స్‌పై చర్చజరిగిందన్నారు. ఈఎస్‌సీఐ కన్సల్టెన్సీ సేవలను ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేడియోధార్మిక ఖనిజాల రేడియేషన్ ప్రభావాలు, సముద్రపు అడుగుభాగంలో మైనింగ్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలను తగ్గించడంపై చర్చించారన్నారు. కార్యక్రమానికి సహకరించిన ఎన్ఎండీసీ, సింగరేణి కాలరీస్, నాగ్‌పూర్ ఎస్ఎంఎస్ లిమిటెడ్, చంద్రాపూర్ బీఎస్ ఇస్పాత్ లిమిటెడ్, మినిమాటిక్స్ సొల్యూషన్స్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఎన్ఐటీకే ఎమిరిటస్ ప్రొఫెసర్ డి.వెంకట్ రెడ్డి, ఎన్ఎండీసీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐ.బీ.సాహూ, సింగరేణి (మైనింగ్) డీ.ఎస్.ప్రసాద్, చెన్నై అన్నా యూనివర్శిటీ నుంచి డాక్టర్ కే.శ్రీనివాస్, ఇఎస్‌సీఐ డివిజన్ హెడ్‌మైనింగ్ కే.జే.అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

- ఉప్పల శ్రీనివాస గుప్త

నవతెలంగాణ -నాగోల్



పిల్లలు చదువు తోపాటు క్రీడల్లో ఆసక్తి కనబరిచి రాణిస్తే ఎంతో మంచి భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. శుక్రవారం సాయంత్రం నాగోలు డివిజన్లోని బండ్లగూడలో గల వీ- స్పోర్ట్స్ లో ఈనెల 17 నుం చి 7 రోజులపాటు జరిగిన ఫుట్‌బాల్ ఇంటర్నల్. లీగ్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు వారి పిల్లలను కేవలం చదువుల పైనే కాకుండా వారికి ఏ ఆటల లో ఆసక్తి ఉందో గుర్తించి ప్రోత్సహిస్తే వారికి మంచి భవిష్యత్తును అందించిన వారవుతారన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని 33 జిల్లాలలో క్రీడా మైదానం నిర్మాణాలు చేపట్టి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్టు విశిష్ట అతిథిగా ఎల్బీనగర్ ఏసీపి శ్రీధర్ రెడ్డి పాల్గొని గెలిచిన వారిని అభినం దించారు. 9 టీములు పాల్గొనగా విన్నర్‌గా ధాన్యల్ టీం, రన్నర్‌గా రిషి టీం ,మూడో స్థానంలో వినోదు టీంలు నిలవగా గెలిచిన క్రీడాకారులకు శ్రీనివాస గుప్త, ఏసిపి శ్రీధర్ రెడ్డిలు గోల్డ్ ,సిల్వర్ మెడళ్లను అందిం చారు.కోచ్ సురేందర్, నిర్వాహకులు మీ నరేష్ కుమార్, జి రాజు ,కే వినోద్ ,తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని వార్డు ప్రజలు సద్వినిగయోగం చేసుకోవాలి

నవతెలంగాణ- మేడ్చల్



కంటివెలుగు శిబిరాన్ని వార్డు ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని కౌన్సిలర్ భవాని రాఘవేందర్ గౌడ్ వార్డు ప్రజలకు సూచించారు. శుక్రవారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో రెండవ విడత కంటి వెలుగు శిబిరాన్ని కౌన్సిలర్ భవాని రాఘవేందర్ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో పెద్ద ఎత్తున ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న వార్డు ప్రజలకు కంటి పరీక్షల అనంతరం కండ్ల జోడ్లను అందజేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కంటి వెలుగు వైద్య అధికారులు,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

సెమీస్‌లో సింధు, ప్రణయ్

● కిదాంబి శ్రీకాంత్ పరాజయం ● మలేషియా మాస్టర్స్





కౌలాలంపూర్ : భారత స్టార్ షట్లర్, మాజీ వరల్డ్ నం.2 పి.వి సింధు ఫామ్‌లోకి దూసుకొచ్చింది. చైనా షట్లర్ జాంగ్ యి మాన్‌ను చిత్తు చేసిన తెలుగు తేజం మలేషియా మాస్టర్స్ టోర్నీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో 21-16, 13-21, 22-20తో పి.వి సింధు విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో జపాన్ స్టార్ షట్లర్ కెంటా నిషిమోటపై 25-23, 18-21, 21-18తో హెచ్.ఎస్ ప్రణయ్ అదరగొట్టాడు. మూడు గేముల మ్యాచుల్లో గెలుపొందిన సింధు, ప్రణయ్‌లు సెమీఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల సింగిల్స్ మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్స్‌లో విఫలమయ్యాడు. 21-16, 16-21, 11-21తో ఇండోనేషియా షట్లర్ క్రిస్టియన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. నేడు సెమీస్‌లో ఇండోనేషియా షట్లర్, ఏడో సీడ్ గ్రిగోరియ మారిస్క టన్‌జంగ్‌తో సింధు తలపడనుండగా.. క్వాలిఫయర్ క్రిస్టియన్‌తో ప్రణయ్ పోటీపడనున్నాడు.

సింధు అదిరెన్ : మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సింధు దుమ్మురేపింది. చైనా షట్లర్ జాంగ్ యి మాన్‌ను చిత్తు చేసింది. 74 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో సింధు 2-1తో గెలుపొందింది. తొలి గేమ్‌లో సింధు తొలుత వెనుకంజ వేసింది. జాంగ్ యి మాన్ ఆరంభంలో ముందంజలో వేసినా.. 10-10 వద్ద తొలిసారి స్కోరు సమం చేసిన సింధు 11-10తో విరామ సమయానికి ఆధిక్యం దక్కించుకుంది. ద్వితీయార్థంలో ఎక్కడా వెనక్కి తగ్గని సింధు వరుస పాయింట్లు ఖాతాలో వేసుకుంది. 21-16తో అలవోకగా తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో జాంగ్ యి మాన్ పుంజుకుంది. 11-4తో విరామ సమయానికి భారీ ఆధిక్యంలో నిలిచిన జాంగ్ యి మాన్.. 21-13తో రెండో గేమ్‌ను గెల్చుకుంది. మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. ఇక టైబ్రేకర్‌కు దారితీసిన మూడో గేమ్‌లో సింధు పైచేయి సాధించింది. 11-8తో ఆధిక్యంలో నిలిచిన సింధు..13-15తో లయ కోల్పోయింది. 20-17తో సింధు మ్యాచ్ పాయింట్ వద్ద నిలువగా.. జాంగ్ యి మాన్ గొప్ప ప్రతిఘటన చూపించింది. వరుసగా మూడు సార్లు మ్యాచ్ పాయింట్ కాచుకుని 20-20తో స్కోరు సమం చేసింది. చివర్లో వరుసగా రెండు పాయింట్లు నెగ్గిన సింధు 22-20తో మూడో గేమ్‌ను, సెమీఫైనల్స్ బెర్త్‌ను సొంతం చేసుకుంది.

పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ మారథాన్ పోరాటం చేశాడు. జపాన్ షట్లర్ కెంటా నిషిమోటను మూడు గేముల్లో జయించాడు. 91 నిమిషాల సాగిన క్వార్టర్‌ఫైనల్లో భారత షట్లర్ 2-1తో విజయం సాధించాడు. ఆద్యంతం ఆధిక్యం చేతులు మారుతూ ఉత్కంఠగా సాగిన తొలి గేమ్‌ను సూపర్ టైబ్రేకర్‌లో ప్రణయ్ 25-23తో సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్ 21-18తో నిషిమోట నెగ్గగా.. నిర్ణయాత్మక మూడో గేమ్‌ను ప్రణయ్ 21-13తో అలవోకగా గెలుపొందాడు. క్వార్టర్స్‌లో మెరుపు విజయం సాధించిన హెచ్.ఎస్ ప్రణయ్ నేడు సెమీస్‌లో ఇండోనేషియా షట్లర్ క్రిస్టియన్ (క్వాలిఫయర్)తో ఢీకొట్టనున్నాడు. మరో క్వార్టర్స్ పోరులో మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్‌పై 16-21, 21-16, 21-11తో క్రిస్టియన్ విజయం సాధించాడు.

సిప్లిగంజ్ పాట.. కళాకారుల ఆట!

● జోరుగా సిఎం కప్ ఆరంభోత్సవ ఏర్పాట్లు
● సమీక్ష సమావేశంలో శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్



నవతెలంగాణ-హైదరాబాద్



సిఎం కప్ 2023 రాష్ట్ర స్థాయి పోటీలకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ నెల 28-31 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనుండగా.. 29న ఆరంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన సమీక్ష సమావేశంలో అధికారులకు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ దిశా నిర్దేశం చేశారు. సోమవారం సాయంత్రం జరుగనున్న ఆరంభోత్సవానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కెటిఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఆస్కార్ వేదికపై అలరించిన గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ నాటు నాటు పాటతో హోరెత్తించనుండగా.. సంప్రదాయ కళాకారులు నృత్య ప్రదర్శనలతో దుమ్మురేపనున్నారు. ఈ మేరకు ఆరంభోత్సవ కార్యక్రమం గుర్తుండిపోయే ఎంటర్‌టైనర్‌గా నిలిచేందుకు శాట్స్ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. సిఎం కప్ రాష్ట్ర స్థాయిలో 18 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనుండగా, సుమారు 10000 మంది అథ్లెట్లు పోటీపడనున్నారు. ఈ పోటీలకు వేదికలుగా 6 మైదానాలను శాట్స్ ఖారారు చేసింది. కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి స్టేడియం (యూసుఫ్‌గూడ), సరూర్ నగర్ స్టేడియం, ఎల్బి స్టేడియం, జింఖానా గ్రౌండ్స్, జిఎంసీ బాలయోగి స్టేడియం (గచ్చిబౌలి), షూటింగ్ రేంజ్ (హెచ్‌సీయూ, గచ్చిబౌలి) సిఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. పది వేల మంది క్రీడాకారులు బస చేసేందుకు సైతం శాట్స్ యంత్రాంగం ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసింది.

'తెలంగాణ రాష్ట్రంలో సిఎం కప్ పోటీలు తొలిసారి జరుగుతున్నాయి. ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదు. క్రీడాకారులకు వసతి, భోజనం, రవాణా ఏర్పాట్లలో ఎటువంటి పొరపాట్లకు తావు లేదు. క్రీడాకారులు ఆహ్లాదకర వాతావరణంలో పోటీపడి తిరిగి ఇంటికి చేరుకునే వరకు వారి బాధ్యత మనదే. పోలీసు, తాగునీరు, పారిశుద్ధ్యం, భోజన వసతి, వైద్య ఆరోగ్యం, రవాణా కమిటీలు సమన్వయంతో పని చేయాలి. క్రీడలు జరిగే ఆరు వేదికల బాధ్యులు అన్ని సమయాల్లోనూ క్రీడాకారులకు అందుబాటులో ఉండాలి. ఇందులో ఎటువంటి రాజీ లేదు' అని శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్ అన్నారు. సమావేశంలో క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియ, శాట్స్ ఉన్నతాధికారులు, నిర్వహణ కమిటీ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విజేతకు రూ.13.23 కోట్లు

● రన్నరప్‌కు రూ.6.61 కోట్లు
● ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్ ప్రైజ్‌మనీ




దుబాయ్ : ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ విజేత రూ.13.23 కోట్లు అందుకోనుంది. రన్నరప్‌కు రూ.6.61 కోట్లు దక్కనున్నాయి. ఈ మేరకు ఐసీసీ శుక్రవారం ప్రైజ్‌మనీ వివరాలు వెల్లడించింది. తొలి డబ్ల్యూటీసీ ప్రైజ్‌మనీ యథావిధిగా కొనసాగించిన ఐసీసీ.. ఎటువంటి పెంపుదల చేయలేదు. ఓవరాల్ ప్రైజ్‌మనీ సుమారు 20 కోట్లు కాగా.. ఇతర ఏడు జట్లకు సైతం ఐసీసీ నగదు బహుమతి అందించనుంది. ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్ జూన్ 7-11న లండన్‌లోని ది ఓవల్ మైదానంలో జరుగనుంది. భారత్, ఆస్ట్రేలియాలు ప్రతిష్టాత్మక టెస్టు గద కోసం పోటీపడనున్నాయి. ఆరంగ్రేట డబ్ల్యూటీసీ ఫైనల్లో న్యూజిలాండ్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. టెస్టు క్రికెట్ అంతిమ సమరం కోసం భారత క్రికెటర్లు కొందరు ఇప్పటికే లండన్‌కు చేరుకుని సాధన మొదలెట్టారు!.

ఫైనల్లో గుజరాత్ టైటాన్స్

● శుభ్‌మన్ గిల్ శతక తీన్‌మార్
● మోహిత్ శర్మ ఐదు వికెట్ల ప్రదర్శన

క్వాలిఫయర్2లో ముంబయి ఓటమి


శుభ్‌మన్ గిల్ 129 (60 బంతుల్లో 7 ఫోర్లు, 10 సిక్సులు)

శుభ్‌మన్ గిల్ (129) శతక బీభత్సం సృష్టించగా, మోహిత్ శర్మ (5/10) ఐదు వికెట్ల ప్రదర్శనతో విరుచుకుపడగా గుజరాత్ టైటాన్స్ వరుసగా రెండో సీజన్లో టైటిల్ పోరుకు సిద్ధమైంది. క్వాలిఫయర్2లో ముంబయి ఇండియన్స్‌పై 62 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ 16 ఫైనల్లోకి ప్రవేశించింది. ఆదివారం టైటిల్ పోరులో చెన్నై సూపర్‌కింగ్స్, గుజరాత్ టైటాన్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి.

నవతెలంగాణ-అహ్మదాబాద్

శుభ్‌మన్ గిల్ (129, 60 బంతుల్లో 7 ఫోర్లు, 10 సిక్స్‌లు) విధ్వంసక విశ్వరూపంతో సీజన్లో ఏకంగా మూడో సెంచరీ నమోదు చేశాడు. 49 బంతుల్లోనే శతకం సాధించిన శుభ్‌మన్ గిల్ క్వాలిఫయర్ 2లో టైటాన్స్‌కు ఘన విజయాన్ని అందించాడు. సాయి సుదర్శన్ (43, 31 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), హార్దిక్ పాండ్య (28 నాటౌట్, 13 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించగా తొలుత గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 233 పరుగుల భారీ స్కోరు చేసింది. 234 పరుగుల రికార్డు ఛేదనలో ముంబయి ఇండియన్స్ చతికిల పడింది. సూర్యకుమార్ యాదవ్ (61, 38 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), తిలక్ వర్మ(43, 14 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ మెరుపులతో కదం తొక్కినా.. ఇతర బ్యాటర్ల నుంచి సహకారం లభించలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ (8), నేహల్ వధేరా (4), విష్ణు వినోద్ (5), టిమ్ డెవిడ్ (2) విఫలమయ్యారు. కామెరూన్ గ్రీన్ (30, 20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) వరుస శతకాల జోరు చూపించలేకపోయాడు. టైటాన్స్ పేసర్ మోహిత్ శర్మ (5/10) ఐదు వికెట్ల ప్రదర్శనతో ముంబయి ఇండియన్స్‌ను దెబ్బకొట్టాడు. వరుస ఓవర్లలో రెండేసి వికెట్లు పడగొట్టిన మోహిత్ శర్మ.. ముంబయి ఇండియన్స్ ఆశలు ఆవిరి చేశాడు. మహ్మద్ షమి (2/41), రషీద్ ఖాన్ (2/33) రాణించారు. 18.2 ఓవర్లలో 171 పరుగులకు ముంబయి ఇండియన్స్ కుప్పకూలింది. 62 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్ భారీ విజయం సాధించింది. శుభ్‌మన్ గిల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

శుభ్‌మన్ షో : వర్షం అంతరాయంతో క్వాలిఫయర్2 పోరు 30 నిమిషాలు ఆలస్యమైంది. పిచ్‌పై తేమను సద్వినియోగం చేసుకునే ఆలోచనలో ముంబయి ఇండియన్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. శుభ్‌మన్ గిల్, వృద్ధిమాన్ సాహా (18తొలి వికెట్‌కు 54 పరుగులు జోడించారు. వ్యక్తిగత స్కోరు 30 వద్ద జోర్డాన్ బౌలింగ్‌లో టిమ్ డెవిడ్ క్యాచ్ నేల పాలు చేయటంతో గిల్ జీవనదానం పొందాడు. మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 32 బంతుల్లో అర్థ సెంచరీ బాదిన గిల్.. అసలు విశ్వరూపం పది ఓవర్ల తర్వాతే చూపించాడు. 10 ఓవర్లలో 91/1తో ఉన్న టైటాన్స్.. గిల్ మెరుపులతో చివరి పది ఓవర్లలో ఏకంగా 145 పరుగులు పిండుకుంది. ముంబయి ప్రధాన బౌలర్లు పియూశ్ చావ్లా, ఆకాశ్ మధ్వాల్, క్రిస్ జోర్డాన్‌లను టార్గెట్ చేసిన గిల్ బౌండరీలతో రెచ్చిపోయాడు. నాలుగు ఫోర్లు, ఎనిమిది సిక్సర్లతో 49 బంతుల్లోనే 100 పరుగులు చేసిన గిల్.. ఈ సీజన్లో ముచ్చటగా మూడో శతకం చేశాడు. మరో ఎండ్‌లో స్ట్రయిక్ రొటేషన్‌కు పరిమితమైన సాయి సుదర్శన్ ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 43 పరుగులు చేశాడు. రెండో వికెట్‌కు గిల్, సాయి జోడీ 138 పరుగులు జోడించింది. చివర్లో హార్దిక్ పాండ్య (28), రషీద్ ఖాన్ (5) మెరుపు ముగింపు అందించారు.

నవచిత్రం

సొగసే మా వీధి వైపు..

హీరో సిద్ధార్థ్ త్వరలో 'టక్కర్' అనే సినిమాతో సరికొత్తగా అలరించనున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, పాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాలో దివ్యాంశ కౌశిక్


దివ్యాంశ కౌశిక్, సిద్ధార్థ్

కథానాయికగా నటిస్తున్నారు. జూన్ 9న తెలుగు, తమిళ భాషల్లో భారీ స్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఊపిరే' అంటూ సాగే మూడో పాట విడుదలైంది.

ఈ చిత్రానికి నివాస్ కె ప్రసన్న సంగీతం అందించగా, కృష్ణకాంత్ అన్ని పాటలకు సాహిత్యం అందించారు. 'కయ్యాలే', 'పెదవులు వీడి మౌనం' పాటల మాదిరిగానే 'ఊపిరే' పాట కూడా కట్టిపడేసేలా ఉంది. అభయ్ జోధ్‌పుర్కర్, సంజన కలమంజే ఈ పాటను ఎంతో అందంగా ఆలపించారు. "సొగసే మా వీధి వైపు.. సరదాగా సాగెనే.. దిశలేమో నన్ను చూసి.. కను గీటెనే" అంటూ కథానాయికపై కథానాయుడికి ఉన్న ప్రేమను తెలిపేలా ఎంతో అందంగా ఉంది ఈ పాట. సంగీతానికి, సాహిత్యానికి తగ్గట్టుగానే నాయకా నాయికల మధ్య కెమిస్ట్రీ కూడా చక్కగా కుదిరింది. ఈ రొమాంటిక్ యాక్షన్ రైడ్ ఘన విజయం సాధిస్తుందని మేకర్స్ ఎంతో నమ్మకంగా ఉన్నారు.

31న అదిరిపోయే అప్‌డేట్..

మహేష్‌బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తాజాగా ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. గత కొంత కాలంగా ఈ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్ల కోసం ఎదురు చూస్తున్న మహేష్ ఫ్యాన్స్‌కి ఈనెల 31న అదిరిపోయే అప్‌డేట్ రానుంది. సూపర్‌స్టార్ కృష్ణ జయంతి నేపథ్యంలో ఈనెల 31న ఈ చిత్ర టైటిల్‌ని అనౌన్స్ చేయబోతున్నట్టు మేకర్స్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో పూజా హెగ్డే, శ్రీలీలా నాయికలు. తమన్ సంగీతం అందిస్తున్నారు.


మహేష్‌బాబు

సరికొత్త యాక్షన్ థ్రిల్లర్..

'స్వాతిముత్యం' సినిమాతో సక్సెస్‌ఫుల్‌గా అరంగేట్రం చేసిన యువ కథానాయకుడు బెల్లంకొండ గణేష్ 'నేను స్టూడెంట్ సార్'తో ప్రేక్షకులకు థ్రిల్ ఇవ్వడానికి రెడీ అవుతున్నారు. రాఖీ ఉప్పలటి దర్శకత్వంలో ఎస్వీ2 ఎంటర్‌టైన్‌మెంట్ పై 'నాంది' సతీష్ వర్మ ఈ చిత్రాన్ని నిర్మించారు.


బెల్లంకొండ గణేష్, అవంతిక దస్సాని

యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా టీజర్, ట్రైలర్ అంచనాలు పెంచాయి. జూన్ 2న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది.

సెన్సార్ బోర్డ్ ఈ చిత్రానికి 'యూ/ఏ' సర్టిఫికేట్ ఇచ్చింది. ఒక మంచి సినిమా చూసిన అనుభూతి కలిగిందని సెన్సార్ బోర్డ్ సభ్యులు ఈ చిత్ర బృందాన్ని అభినందించారు. సినిమా మొదటి నుంచి చివరి వరకూ చాలా థ్రిల్లింగ్, గ్రిప్పింగ్‌గా ఉందని కితాబివ్వడం విశేషం. ఈ చిత్రంలో గణేష్‌కు జోడిగా అవంతిక దస్సాని నటించింది. సముద్రఖని, సునీల్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

హిడింబ హిట్ ఖాయం

అశ్విన్ బాబు కథానాయకుడిగా అనిల్ కన్నెగంటి దర్శకత్వంలో శ్రీ విఘ్నేష్ కార్తీక్ సినిమాస్ బ్యానర్ పై గంగపట్నం శ్రీధర్ నిర్మిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'హిడింబ'. ఎకే ఎంటర్‌టైన్‌మెంట్స్ అనిల్ సుంకర ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. హీరో సాయి ధరమ్ తేజ్ ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. రెండు విభిన్నమైన టైమ్‌లైన్స్‌లో కంటెంట్ సెట్ చేయడం, విజువల్స్ గ్రాండ్‌గా ఉండటం, కథ, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ నెక్స్ట్ లెవల్‌లో ఉండటంతో సినీ అభిమానులకు ఈ ట్రైలర్ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ సందర్భంగా హీరో సాయి ధరమ్ తేజ్ మాట్లాడుతూ,' ఈ ట్రైలర్ అదిరిపోయింది. టీం అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. అశ్విన్ సినిమా ట్రైలర్ లాంచ్‌కి రావడం ఆనందంగా ఉంది. క్రికెట్‌తో మా పరిచయం ఏర్పడింది. ఈ సినిమా పెద్ద విజయం కావాలి' అని అన్నారు.


అనిల్, అశ్విన్‌బాబు, సాయిధరమ్‌తేజ్, నందిత శ్వేత, గంగ పట్నం శ్రీధర్

'మీ అందరికీ ట్రైలర్ నచ్చడం ఆనందంగా ఉంది. ఈ సినిమా నా కెరీర్‌లో హయ్యస్ట్ బడ్జెట్ మూవీ. నిర్మాత ఎక్కడా రాజీ పడకుండా చేశారు. దర్శకుడు అనిల్ సినిమా అద్భుతంగా తీశారు. అనిల్ సుంకర ఈ సినిమాని ప్రజంట్ చేయడం చాలా పాజిటివ్‌గా ఉంది' అని చెప్పారు. నాయిక నందిత శ్వేత మాట్లాడుతూ, 'ఈ ట్రైలర్ గూస్ బంప్స్ తెప్పించింది. సినిమా ఇంకా అద్భుతంగా ఉంటుంది. ఇందులో చాలా కీలకమైన పాత్ర చేశాను' అని తెలిపారు. 'ఎలాంటి ఇన్ఫ్లూయెన్స్ లేకుండా ఒరిజినల్ కాన్సెప్ట్‌తో తీసిన సినిమా ఇది. ఒక ఇన్వెస్ట్ గెట్ థ్రిల్లర్ నుంచి హిస్టారికల్ ఫిక్షన్‌కి వెళ్ళే సినిమా ఇది. చాలా డిఫరెంట్‌గా, ఫ్రెష్‌గా ఉంటుంది. గూస్ బంప్స్ మూమెంట్స్ ఉంటాయి. అశ్విన్ యాక్టింగ్ స్కిల్స్ ఈ సినిమాతో తెలుస్తుంది. ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ రావడం ఆనందంగా ఉంది' అని దర్శకుడు చెప్పారు.

ఓ తండ్రి తీర్పు..

సినిమా పబ్లిసిటీ డిజైనర్‌గా అందరికీ సుపరిచితమైన వివ రెడ్డి (విష్ణువర్ధన్ రెడ్డి మావూరపు) హీరోగా రూపొందుతున్న చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. ఎవీకే ఫిలిమ్స్ బ్యానర్ పై లయన్ ఆరిగపూడి విజయ్ కుమార్ సమర్పణలో లయన్ శ్రీరామ్ దత్తి నిర్మిస్తున్నారు. ప్రతాప్ భీమవరపు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్‌తో పాటు ఎడిటింగ్ కూడా పూర్తి చేసుకుంది.


వివ రెడ్డి, పునర్నవి

రాజేంద్ర రాజు కాంచన పల్లి రచన, దర్శకత్వ పర్యవేక్షణలో తల్లిదండ్రుల ఆస్తులపై ఉన్న ప్రేమ పిల్లలకు తల్లిదండ్రులపై లేకపోవటం ఎంత మానసికక్షోభకు గురిచేస్తుందో తెలియజేసే సినిమా ఇది. ఈ చిత్రంలో కొడుకుగా వివ రెడ్డి చేస్తున్న ప్రధానమైన పాత్ర చాలామంది కొడుకులకు కనువిప్పు కలిగించేదిగా ఉంటుందని, ఒక మంచి కుటుంబ కథా చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు గర్వంగా ఉందని, ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందని నిర్మాత శ్రీరామ్ దత్తి అన్నారు.

ప్రియమైన ప్రియ..


అశోక్‌కుమార్, లీషా ఎక్లెయిర్స్

గోల్డెన్ గ్లోరి బ్యానర్ పై అశోక్ కుమార్, లీషా ఎక్లెయిర్స్ జంటగా ఏజె.సుజిత్ దర్శకత్వం వహించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్రియమైన ప్రియ'. ఏజె. సుజిత్, ఎ.బాబు నిర్మించిన ఈ చిత్ర ట్రైలర్, ఆడియో రిలీజ్ వేడుక ప్రసాద్‌ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. సంగీత దర్శకులు దేవా కుమారుడు శ్రీకాంత్ దేవా ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఈ సినిమా ఆయనకు 100వ చిత్రం కావడం విశేషం. ఈ వేడుకకు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ బసి రెడ్డి, నిర్మాతల మండలి అధ్యక్షులు కె.ఎల్. దామోదర్ ప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యదగిరి, ప్రొడ్యూసర్ ఎంఆర్ చౌదరి వడ్లపట్ల ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర యూనిట్‌ను అభినందించారు. సి.హెచ్. సీతారామ్ యాదవ్ నిర్మాణ నిర్వాహణలో రూపొందిన ఈ చిత్రాన్ని మన స్క్రీన్ మ్యాక్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా థియేటర్‌లలో రిలీజ్ చేయబోతున్నారు.

ఈ సందర్భంగా హీరో అశోక్ మాట్లాడుతూ, 'ఇదొక మంచి సైకో థ్రిల్లర్. ఇందులో హీరో నేనే, సైకో నేనే' అని తెలిపారు. 'ఓ మంచి కాన్సెప్ట్‌తో రూపొందిన చిత్రమిది' అని హీరోయిన్ లీషా అన్నారు.

ప్రముఖ దర్శకుడు కె.వాసు ఇకలేరు


కె.వాసు

ప్రముఖ దర్శకుడు కె.వాసు (కొల్లి శ్రీనివాసరావు) (72) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. సీనియర్ దర్శకుడు కె.ప్రత్యగాత్మ తనయుడే కె.వాసు. ఆయన బాబాయి హేమాంబరధరరావు కూడా దర్శకులే. కమ్యూనిస్టు భావజాలం ఉన్న కె. ప్రత్యగాత్మ, సత్యవతి దంపతులకు వాసు జన్మించారు. వాసు మేనమామ చలసాని శ్రీనివాసరావు కూడా గొప్ప కమ్యూనిస్టువాది. ఆయన జ్ఞాపకార్థం ఈయనకు శ్రీనివాసరావు అని పేరు పెట్టారు. బాబాయి దగ్గర దర్శకత్వ శాఖలో మెళకువలు నేర్చుకున్న వాసు తొలి దర్శకత్వంలో వచ్చిన సినిమా 'ఆడపిల్లల తండ్రి' (1974). 'ప్రాణం ఖరీదు' చిత్రంతో చిరంజీవిని వెండితెరకు పరిచయం చేశారు. 'కోతల రాయుడు', 'ఆరని మంటలు', 'గోపాలరావుగారి అమ్మాయి', 'దేవుడు మావయ్య', 'పక్కింటి అమ్మాయి', 'కలహాల కాపురం', 'అల్లుళ్ళొస్తున్నారు', 'కొత్త దంపతులు', 'అయ్యప్పస్వామి మహత్యం', 'శ్రీ షిర్డీ సాయిబాబా మహత్యం' వంటి తదితర చిత్రాలు విశేష ప్రేకాదరణ పొందాయి. కె.వాసు మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

అన్నయ్య చిరంజీవి వెండితెరపై కనిపించిన తొలి చిత్రం 'ప్రాణం ఖరీదు' సినిమా దర్శకులుగా వాసుగారిని మరిచిపోలేం. వినోదాత్మక కథలే కాకుండా భావోద్వేగ అంశాలనూ ఆయన తెరకెక్కించారు. ఆయన సినిమాల్లో శ్రీ షిర్డీ సాయిబాబా మహత్యం ప్రత్యేకమైంది.
- పవన్‌కళ్యాణ్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.